
ఆంధ్ర సచిత్ర వారపత్రిక

20-8-82
150 పైసలు




మీలాంటి
మగవానికి
తృప్తినిచ్చేది-
చార్మినారే!
CHARMINAR
THE VAZIR SULTAN TOBACCO CO LTD
10 CIGARETTES
విశ్రాంతి పొందండి! చార్మినార్ తాగండి.
చట్టబద్ధ మైన హెచ్చరిక: సిగరెట్ తాగడం ఆరోగ్యానికి హానికరం
STATUTORY WARNING: CIGARETTE SMOKING IS INJURIOUS TO HEALTH
90 పైసలకు 10
*గరిష్ఠ ధర స్థానిక పన్నులను అనుసరించి
CASVS-259-244 TEL



శుభ్రమైన తాజా శ్వాస...
ఆరోగ్యంవిందే గట్టి పళ్ళు
కోల్గేట్
డెంటల్ క్రీమ్ ఫలితం
ప్రతిసారి భోజనం చేసిన తర్వాత కోల్గేట్‌తో మీ పళ్ళను తోముకుండి. కోల్గేట్ ప్రపంచమంతటా దంతవైద్యులు సిఫారసు చేసే తీరులో మీకు రక్షణ సమకూరుస్తుంది.
మీ పళ్ళలో మిగిలిపోయే ఆహారపు అణువులలో బాక్టీరియా పెరుగుతుంది. అవి ముందు నోటి దుర్వాసన ఆపైన బాధాకరమైన దంతక్షయాన్ని కలిగిస్తాయి.
అందుకే మరి ఎప్పుడూ భోజనంకాగానే కోల్గేట్‌తో తోముకోవడం సరైన మార్గం. అది మీ శ్వాసను తాజాగా రూపొందించేందుకు, పళ్ళను తెల్లగా మెరిసేలా చేసేందుకు దంతక్షయాన్ని ఎదిరించేందుకు అమోఘమైనదని రుజువయింది.
కోల్గేట్ యొక్క నమ్మకమైన సూత్రీకరణ ఎలా పని చేస్తుందంటే:
మీ పళ్ళలో ఇరుక్కుపోయిన ఆహారపు అణువులలో దుర్వాసన, దంతక్షయాన్ని కలిగించే బాక్టీరియా పెరుగుతుంది.
కోల్గేట్ యొక్క సాటిలేని చర్యగల నురుగు బాగా లోతుకుచేరి హానికరమైన ఆహారపు అణువులను, బాక్టీరియాను తొలగిస్తుంది.
ఫలితం: ఆకర్షణీయమైన తెల్లని పళ్ళు, శ్వాస తాజాగా ఉందన్న నమ్మకం, దంతక్షయంనుండి రక్షణ.
కోల్గేట్‌లోని తాజా పిప్పరమెంట్ లాంటి రుచి మీ మనసుకు నచ్చుతుంది.
నోటి దుర్వాసనను ఆపండి...
కోల్గేట్ డెంటల్ క్రీమ్‌తో
దంతక్షయాన్ని
ఎదుర్కోండి!
Colgate
DENTAL CREAM
Colgate
STOPS BAD BRE
సంపూర్ణమైన దంతరక్షణ కోసం
కోల్గేట్ ట్రైగార్డ్ టూత్‌బ్రష్‌లనే వాడండి.
మూడింతలు మేలైనవి
1
2
3
DC.G.74 TL

న వ్వు

30.7.82 నాటి ఆంధ్ర సచిత్ర వార పత్రిక తిరగవేసి చూడగానే "శ్రీ" కనిపించింది. వెంటనే నాకు నవ్వు వచ్చింది.

సంధి, తరిని, తారకేశ్వరరావు (ఖర్గపూర్)

ముచ్చటగా వుంది

నటి "శ్రీ" చూడ ముచ్చటగా ఉంది. ఇటీవల మీరు క్రొత్త నటీ మణులనే ముఖ చిత్రాలుగా ప్రచురిస్తున్నారు. నటులను, దర్శకులను కూడ ముఖ చిత్రాలుగా ప్రచురిస్తే బాగుంటుంది.

ఎల్. అన్వర్ హుస్సేన్ (గిరింపేట)

ఒకే అక్షరమా!

నటి "శ్రీ" ముఖ చిత్రంతో వెలువడిన సంచికలో ముఖ పత్ర తార పేరు "శ్రీ" అని చూసే సరికి చాల ఆశ్చర్యపోయాను. కేవలం ఒకే ఒక అక్షరం కల నటి పేరు ఎన్నడు వినలేదు. చూడ లేదు. ఈ నటి పేరు చూడగానే ఈవిధంగా ఒకే ఒక అక్షరం గల పేర్లను ఎందుకు పెట్టుకుంటారో అని మనసులో నవ్వుకున్నాను.

కందిగట్ల ప్రభాకర్ (జనగామ)

అతిశయోక్తి కాదు

"సూపర్ కవర్ పేజీ ఆంధ్ర వీక్లీ" అని అనక తప్పదు. అత్యంత ఆకర్షనీయంగా, కన్నులకు ఇంపుగా ఆంధ్ర సచిత్ర వార పత్రిక ముఖ చిత్రం ఉన్నదనుటలో అతిశయోక్తి లేదు.

జి. శ్రీనివాస్ (ముది మాణిక్యం)

చిత్తమే మరపించె

కథల సంఖ్య మించి, కార్టూనులను మెచ్చ
రామలక్ష్మి కలము ప్రోపుగాంచ
సినిమ శీర్షిక గన చిత్తమే మరపించె
'వార పత్రిక' సరి వేరు గలదె!

బాపట్ల వెంకటేశ్వర సాయి (చెరువు)

దుఃఖము ఆగలేదు

లక్ష్మి కొలాస్కర్‌గారి తెలుపు, నలుపు అచ్చం నా జీవితములాగానే వున్నది. ఆ కథలో ప్రభుత్వము యొక్క చెప్పు చేతుల్లో వున్న డాక్టరు శిల్ప భవిష్యత్తును పాడు చేస్తే, కట్టుకున్న భర్త తనకు సంతాన యోగము లేదని తెలిసి డాక్టరుతో కుమ్మక్కయినా జీవితాన్ని పాడు చేసినాడు. శిల్ప కెట్లా జరిగినదో నాకు అలాగే జరిగినది. కథ చదువుతుంటే నాకు దుఃఖము ఆగలేదు. అంత మోసము చేసిన భర్తతో సంసారము చేయడము ఇష్టము లేక, పుట్టిల్లు చేరుకున్నాను.

అభాగ్యసోదరి (కడప)

త ప్పి న స రి

"'నేటికథ—రేపటి ముగింపు' 'కథ చాలాబాగుంది. కథ చివరలో ప్రకాశ్ పాత్ర ద్వారా పలికించిన మాటలు హృదయాన్ని హత్తుకొనేలా ఉన్నాయి. బలహీనుల్ని హింసించి చంపే దానవ న్యాయం రాజ్యం చేస్తున్న దేశంలో ప్రకాశ్‌లాంటి వ్యక్తులు తప్పని సరి.

మూల్పూరి వెంకట రమణ (ఖమ్మం)



ఏడు కథలు

నటి శ్రీ ముఖ చిత్రంతో వెలువడిన ఆంధ్ర సచిత్ర వారపత్రిక చాలా ఆకర్షణీయంగా ఉంది. ఈ వారం పత్రికలో ఏడు కథలు ప్రచురించినందులకు మీకు మా హృదయ పూర్వక ధన్యవాదములు.

పి. వి. రామనాధరావు, విజయశ్రీ (మధిర)

మెచ్చిన కథలు

30. 7.82 సంచికలో నాకు నచ్చిన, నేను మెచ్చిన కథలు రెండే రెండు మార్పు, బొట్టు పెట్టె. మొదటి కథలో ఒకరు గవర్నమెంటు ఆఫీసరు. మరిఒకరు ప్రయివేటు కంపెనీలో గుమస్తా. వీరి హోదాల్లోను, మనస్తత్వాలులోను, ఆర్థిక స్థాయిలోను వచ్చిన మార్పు ఎట్టిదో బాగా చిత్రీకరించేరు వసుంధరగారు. ఇక రెండవ కథలో వెండి బొట్టు పెట్టె గురించి కలలు గన్న సౌభాగ్యమ్మ కోరిక తీర్చలేని యిద్దరు కొడుకులకు చివరకు, కన్నీళ్లే మిగిలాయి. భర్త పట్టుదల, కోడళ్ల విభిన్న మనస్తత్వాలు, కొడుకుల పశ్చాత్తాపము మొదలైన సన్నివేశాలు యీ కథ చదివిన వారికే అర్థమవుతుంది.

కురువాడ సూర్య ప్రకాశం (కాశీబుగ్గ)

స ం దే హ ం

"యుగ సంధి" లో నాకు ఒక అనుమానం కల్గింది. ఏమిటంటే కథా నాయకుడికి తండ్రి తద్దినానికి పూర్వం ఎవరూ తండ్రి తద్దినం పెట్టటానికి రమ్మనమని ఉత్తరం రాయలేదా?

జి. ఎస్. ఆర్. సాయి (ఒంగోలు)

హా స్య ం

"బామ్మగారి బడాయి" కథ మా మిత్రబృందాన్ని నవ్వులతో ముంచేసినది. హాస్యాన్నివోడించి వ్రాశారు.

పి. నరేంద్ర, ఇతరులు (ఖర్గపూర్)

మ న వి

డాక్టర్ సలహాలు, ప్రశ్నావళి శీర్షికలకి ప్రశ్నలు పంపేవారు తాము పంపే శీర్షిక పేరు రాసి కేరాఫ్ సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగర్, వి జ య వా డ — 520003 అన్న చిరునామాకి పంపాలి. రాసిన వారి పూర్తి పేరు, చిరునామా యివ్వడం ఎంతైనా అవసరం. —సం.

ఉద్వేగపూరితం

"'నేటి కథ—రేపటి ముగింపు" కథ చదివాక ఎటువంటి వ్యక్తి హృదయమైనా స్పందిస్తుంది. ఎంతగానో పరితపిస్తుంది కూడా. మెదడు ఆలోచనా తరంగాలపై పయనించి 'రేపటి ముగింపు' అనే గమ్యాన్ని వెతుక్కుంటూ పోతుంది. కథలో ప్రకాష్ అన్న మాటలు సందర్భోచితంగా వుండుటయే గాక, ఉద్వేగ పూరితంగా ఉన్నాయి.

నిజమే. నేడు ఎన్నో అకృత్యాలు, దారుణాలు, వయసు తారతమ్య మనేది లేకుండా జరుగుతున్న మానభంగాలు సంభవిస్తున్న కలియుగంలో కంచు కాగడా పట్టి వెదికినా కనిపించనంతటి సుదూర తీరాలకు "మానవత్వం" పారిపోయింది. క్షణికోద్రేకానికి వచ్చని కాపురాలు, వెచ్చని జీవితాలు దీపం చుట్టూ తిరుగాడే శలభల్లా మాడి మసై పోతున్నాయి. కసితీరా మానవత్వాన్ని కాల రాచి దానవునిగా నేటి మానవుడు విజృంభిస్తూ రాక్షసత్వాన్ని హృదయోన్నత శిఖరాలపై ప్రతిష్ఠింపజేసి తాను దాసోహ మవుతున్నాడు. నాటి రాజుల పరిపాలనలో దొంగతనాలకు, మానభంగాలకు, హత్యలకు ఎటువంటి శిక్షా విధానం అమలు పర్చేవారో, న్యాయ ధర్మాలు ఎలా కాపాడబడుతుండేయో, ఆనాటి ప్రభువులు, ప్రజలు మానవత్వానికి ఎలా నివాళులర్పించేవారో చరిత్ర పుటలు తిరుగవేస్తే, స్పష్టంగా కనిపిస్తుంది. మరి నేడు......చేసే అరాచకానికి .... విధించే శిక్షకు .... అమలు పరిచే శాసనానికి ఎక్కడా పొత్తు కుదరక, చట్టానికి కళ్లు, న్యాయస్థానానికి వినే చెవుళ్లు లేకుండా పోయాయి న్యాయ ధర్మాలు మంట గలిసి పోతున్నాయి. వజ్రాన్ని వజ్రమే కోసే విధంగా, నేటి చట్టాన్ని సవరించి శాసనాల్ని ప్రతికరణ శుద్ధిగా అమలు పరిచేనాడు, నిజంగా నేటి (దారుణాలకు) కథలకు, రేపటి ముగింపు తథ్యం.

సూరాడ నారాయణరావు (హిప్‌గిర్)

అభినందనలు

'ధర్మ పథం' శీర్షికలో వేద పురాణాలలోని అనేక గూఢార్థాలను 'యజ్ఞాల తత్త్వం'లో చక్కగా వివరించిన రచయితకు మా అభినందనలు.

బళ్లారి మహమ్మద్ సలీమ్ (గుత్తి)

చరబండరాజు సంచిక

తాను నమ్మిన సిద్ధాంతాన్ని వూపిరిగా పీల్చి, పోరు పాటల్ని జెండాలుగా ఎగుర వేసి, జానపదుల గుండెల్లో స్పందనా డమరు ధ్వని ప్రమోగించిన ప్రముఖ విప్లవ కవి కీ. శే. చరబండ రాజుపై 'ఎక్స్‌రే' ప్రత్యేక సంచికను వెలువరించనున్నది.

కావున రచయితలు చెరబండ రాజుపై తమ తమ రచనలను ఆగస్టు 10 లోగా 'ఎక్స్ రే' కార్యాలయానికి పంపవలసిందిగా కోరుచున్నాము.

పంపవలసిన చిరునామా:

"ఎక్స్ రే" కొల్లూరి హవుస్, అమలాపురం—533202.

(66 వ పేజీ చూడండి)

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాధుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938—1972]

శుక్రవారం : 20-8-'82
దుందుభినామ సం. భాద్రపద శు. పాడ్యమి
సంపుటము 75 : సంచిక 50

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

పోస్ట్‌లో ఏడాది చందా రు. 85-80
విడి ప్రతి వెల రు 1-50

ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

ముఖచిత్రం :
నటి జయప్రద
(రిలయన్స్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీస్‌వారి సౌజన్యంతో)

కథలు :

గృహమేకదా స్వర్గసీమ ... 7
వికలముకూడా సుఖమేకదా... 12
కుక్కర్ సింహం-గ్రామసింహం 16
సందేగాతి ... 47
నిర్ణయం ... 52
మమతాంకురాలు ... 58
నిలకడలేని మనసులు ... 61


సీరియల్ నవలలు :

కాలం కరిచాక ... 20
దాంపత్య సంగీతం(ప్రారంభం) 34
ధర్మోరక్షతి రక్షితః ... 42

వ్యాసాలు, శీర్షికలు :

ఉత్తరాలు — 4, లోకంపోకడ—5, శ్రీ కృష్ణాష్టమి వైశిష్ట్యం — 6, పాలక్షునిద్దరి—10, ధర్మపధం—15, వారఫలం-18, బొమ్మలమహాభారతం-25, సినిమా-26, నేనూ ఒకప్పుడు ఫాన్‌నే-30, డాక్టర్ సలహాలు-32, ప్రశ్నావళి—51, వంటలు — 57, హైదరాబాద్ నోట్‌బుక్—64, అవీ-ఇవీ-అన్నీ—65.

లోకంపోకడ



శ్రీకృష్ణాష్టమి వైశిష్ట్యము

భగవంతుడు దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు అనేకావతారా లెత్తినట్లు పురాణాల్లోని దశావతార వర్గీకరణ చెబుతుంది. భాగవతంలో దశావతారాలే కాకుండ ఇరవయ్యొక్క అవతారాలు భగవంతునికి వున్నట్లు హయగ్రీవుడు, కపిలుడు, దత్తాత్రేయుడు, వ్యాసుడు, నరనారాయణులు, ఇత్యాది ప్రముఖులంతా అవతార పురుషులేనని అందు విదితం అవుతున్నది. ఈ ఇరవయ్యొక్క అవతారంలో మన కత్యంత ప్రీతి పాత్రమైనది, ఆదర్శ ప్రాయమైనవి శ్రీరామ, శ్రీకృష్ణావతారాలే అని నిస్సంశయంగా చెప్పవచ్చును. శ్రీరామ శ్రీకృష్ణుల గూర్చి తెలీని తెలుగువాడుండడు. మాతాపితలపై, సోదరులపై క్రమంగా భక్తి వాత్సల్యాలు, గురుభక్తి, ధర్మరక్తి లక్షణాలలో రామునకు రాముడే సాటి. ఇంక కృష్ణావతారాన్ని పరిశీలిస్తే ఆయన 'మాటలూ, చేతలూ సర్వమూ భగవన్మయ భావనలో నిండి వుంటాయి. అందుకనే "కృష్ణస్తు భగవాన్ స్వయమ్" అన్న నానుడి యేర్పడింది. అర్జునుణ్ణి ఆధారంగా చేసుకొని మానవాళికి సర్వదా, సర్వథాకావల్సిన ధర్మ నీతి జ్ఞాన వైరాగ్యాలను బోధించిన జగద్గురువు శ్రీకృష్ణుని జన్మదినమే శ్రీకృష్ణాష్టమి పర్వదినం. శ్రావణ బహుళాష్టమినాడు సంభవించే ఆనంద ప్రదాయిని.

శ్రీకృష్ణుని జననంలో ఎన్నో అమానుషమైన అద్భుత దృశ్యాలు గోచరిస్తాయి. తను జన్మించక ముందే తన మాయను యశోదాదేవి గర్భం ద్వారా లోకానికి పంపటం, తను పుట్టిన తదుపరి కారాగారపు కవాటాల్ప్రయత్నంగా తెరుచుకోవటం, రామునకు సముద్రుడు దారి యిచ్చినట్లుగా, శ్రీకృష్ణ ప్రయాణానికి యమునానది త్రోవ యివ్వటం, యశోద యోగ నిద్ర పొంది తన ప్రక్కలో వున్న మాయ స్థానంలో శ్రీకృష్ణుని ప్రవేశాన్ని తెలియనేరకపోవటం, ఇత్యాది ఘటనలన్నీ ఆయన జన్మ రహస్యంలోని "అజాయ మానః బహుధాః విజాయతే" అన్న వేదవాక్కుకు ప్రతీకగా వుంటవి తాను కనబడకుండా, తనతోపాటు మాయను ప్రభవింపజేసి కంసుని కన్నులు తెరిపించిన కృష్ణలీలలు అద్భుతావహములు; ఆదర్శ దర్శనాలు.

కంసుడు కారాగృహానికి వచ్చి ఆడుబిడ్డ అని అయినా ఆలోచించకుండా యోగమాయను నేలపై బడవేసి చంప బూనుకున్నపుడు అది ఆకసానికెగిరి కంసుని అవశ్య మరణాన్ని హెచ్చరించింది. భయపడిన కంసుడు వెంటనే దేవకీ వసుదేవులను విడిపించి క్షమాపణ కోరటం కృష్ణ మాయా విలాసమే.

"ప్రకృతిం పురుషం చైవ విద్ధి పార్థ ఉభావపి" — అన్నట్లుగా ప్రకృతి మాయగా, పురుషుడు పరమాత్మగా భావించటం వల్లనే శ్రీకృష్ణుడు లీలామానుషడైనాడు. శ్రీరాముడు తాను మానవుడిననే చెప్పి మాయకు లొంగి మనుగడ సాగించగా, శ్రీకృష్ణుడు తన్ను మానవ మాత్రునిగా భావించిన వారు మూఢులని స్పష్టంగా చెప్పి, తన భగవతత్త్వాని జన్మదినం నుండే ఆవిష్కరించాడు. కంసుని ప్రేరణచే తన్ను హతమార్చ వచ్చిన శకటాసుర, ధేనుకాసుర, బకాసుర తృణావర్తాది రాక్షసులను సంహరించటమే ఇందుకు ప్రమాణాలు.

ఇంతటి మహనీయ జనన జీవిత వైపుల్యముగల శ్రీకృష్ణుడు జన్మాష్టమినాడు జగన్నాటక సూత్రధారిగా యావన్మానవాళి మనసులలో వుండిపోవటానికి ప్రతిసంవత్సరం అవతరిస్తూనే వుంటాడు. మన కళ్లకు ప్రత్యక్షంగానో, ప్రత్యక్షం అవుతూ దుష్టశిక్షణ శిష్టరక్షణల కంకితమై జగత్కల్యాణాన్ని ప్రసాదిస్తూనే వుంటాడు.

"పరిత్రాణాయ సాధూనామ్, వినాశాయచ
దుష్కృతామ్
ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి
యుగే యుగే" -

అన్న అక్షరాకృతి శ్రీకృష్ణ భగవానుడు

"సుచంద్ర"




‘ఏం(ట్రోయ్! అలాగ షేక్స్పియర్‌లాగా మొహం పెట్టుకుని కూర్చున్నావ్?’ అని, సీట్లో గంభీరంగా విషాదంగా కూర్చుని వున్న సుబ్బారావుని ప్రశ్నించాడు అడ్డ. కస్సు మన్నాడు సుబ్బారావ్, వురఫ్ ఎలుగ్గొడ్డు.

‘ఏం(ట్రోయ్! ఫ్రండువిగదా! అలాగున్నా వేమని పలకరిస్తే మీదపడి కరుస్తున్నావ్?! ఆ కళ్ళు అలా ఎర్రగా వున్నాయేంటి?’ అని అడ్డ అనగా— మిర్రి మిర్రి చూసాడు సుబ్బారావు. కళ్ళెర్రజేశాడు.

‘కాఫీకొస్తావేమోనని అడిగితే అలాగ ఎలుగ్గొడ్డులాగ మీదికి వురికేటట్టు చూస్తావేంరా?! వస్తావా కాఫీకి? వస్తే రా. లేకపోతే నీ ఖర్మ. అలాగే పడివుండు. ఏమిటీ కేసూ? గృహ కార్యకలాపాల నిర్వహణలో, డిపాజిట్టు గాని పోలేదు గదా! సర్లెయితే. మేంవస్తాం’ అని గలగల కబుర్లు చెప్పుకుంటూ అడ్డా, సోలా వెళ్ళిపోయారు. దిగులుగా కూర్చుండి పోయేడు సుబ్బాన్.

అడ్డ పేరు ఆనందరావు. ప్రతివిషయానికీ అడ్డదిడ్డమయిన ప్రశ్నలు వేసి కన్‌ఫ్యూజ్ చేస్తాడని ఆ ముద్దుపేరు. సోల పేరు సోమ శేఖర్రావు. ప్రతి చిన్న విషయానికీ కంగారు పడిపోయి సోల ఆయిపోతాడని ఆ నిక్‌నేమ్. బాగా కండలు పెంచి, ప్రతిదానికీ ఆలోచన అనేది లేక ముందుకి వురుకుతాడని సుబ్బారావుకి ఎలుగ్గొడ్డని ఒక సూక్ష్మనామం పెట్టుకుంట !

సుబ్బారావుకి తిక్క తిక్కగా వుంది. ఆకలిగా వుంది. ఏ పనీ చేయాలనిపించదు. మనసుని కత్తికఠారులతో నిర్దాక్షిణ్యంగా పొడిచినట్లుగావుంది. కళ్ళు మండుతున్నాయ్. బుర్ర వేడెక్కి మాగ్జిమం టెంపరేచరు అందుకుంది. వేడి, యమవేడి. ఉక్క, తిక్క కూడాను.



ఆ వుదయం ఏమయిందంటే—

సుబ్బారావుకి ఇద్దరు పిల్లలు. ఒకడు బండిచక్రమూ, రెండోది సైకిలూ. చక్రానికి ఆరేళ్ళు. సైకిలు వయస్సు నాలుగేళ్ళు. సుబ్బారావు భార్య సుందరి. సుందరిని లవ్‌చేసి పెళ్ళి చేసుకున్నాడు సుబ్బారావు. ఇంట్లో సుందరిమాటే రూలు. అవునా—

ఆ తెల్లవారుఝామున నాలుగు గంటలకు నిద్రలేచి, కొన్ని అర్జంటు ఆఫీసు ఫైల్సు మీద పని చేసేసి, లేచి దొడ్లోకి వెళ్ళి కాల కృత్యాలు తీర్చుకుని ముందుగదిలోకి వచ్చాడు, ఏడింటికి సుబ్బారావు. ఆ క్షణంలో కంట బడిన ఆ దృశ్యాన్ని చూసి సుబ్బారావు అగ్ని పర్వతంలాగా పెటిల్లుమని పొగలూ సెగలూ క్రక్కాడు! కోపంతో బుసలు గొట్టి బుషేశ్వర్ అయాడు.

అతను ఎంతో కష్టపడి నోట్సూ, డ్రాఫ్టూ తయారుచేసిన ఆ కాగితాలనిండా సిరా, ఘోరంగా వలకబోసి వుంది. అందుకు కారకురాలయిన సైకిలు చేతులనిండా, మొహంమీదా, గౌనుమీదా విరివిగా సిరా మరకలు వున్నాయి. ‘సుబ్బారావు పెన్ను’ని చేత్తో పట్టుకుని, బండిచక్రంగాడు ఆట కాయితనంగా బలంగా నేలకేసి గుద్దాడు. పెన్ను, పాళీ, నాళికా పచ్చడి పచ్చడి అయి వంకరలు తిరిగి పోయేయి. పెన్ను పగిలిపోయి ఏడ్చి సిరాచుక్కలు రాలుస్తున్నది.

సుబ్బారావు కోపం ఆపుకోలేకపోయేడు. కసిగా విజృంభించేడు, అరుస్తూ. ఆ ఇద్దరు కొంటె పిల్లల వీపులూ రాంధోం మోతలు మోగిపోయేయి. చంపలు ఛళ్ళుమన్నాయి. వాళ్ళ చెవులు సుబ్బారావు చేతుల్లో కఠిన శిక్షకి గురయ్యేయి. ఆ ఇద్దరు పిల్లలు గో





గృహమేకదా స్వర్గసీమా!

గోలగా ఏడ్చేసేరు. ఆ అరుపులకి సుందరి వురుకులమీదా పరుగులమీదా వచ్చింది. సుబ్బారావు కబంధ హస్తాలనుంచి పిల్లల్ని విడిపించి వళ్లోకి తీసుకుంది. వాతలు తేలిన వీపుల్నీ, వేళ్ల ముద్రలు పడిన పిల్లల చంపల్నీ చూసి కంట తడి పెట్టింది. ఏడ్చి ఏడ్చి అలసిపోయి నిద్రలో పడ్డారు పిల్లలు. వాళ్ల దెబ్బలకి బర్నాల్‌రాసి, నీరసంగా వాళ్ల ప్రక్కనే పడుకుంది సుందరి తనూ.

అప్పుడు ఆ ఇంట్లో గాలి స్తంభించింది. భయంకరమయిన నిశ్శబ్దం. ఉక్కిరి బిక్కిరి చేసినది వాతావరణం. నార్మల్ రొటీన్‌కి భిన్నమయిన గంభీర ప్రకృతి. టెంపరేచర్ రైజయింది.

కాసేపు కాలుగాలిన పిల్లిలాగా అటూ ఇటూ తిరిగి, సుందరి దగ్గరకి వెళ్లాడు సుబ్బారావు.

'వీళ్ళు పిల్లలా రాక్షసులా?! వీళ్లు చేసిన పనికి నేను ఆఫీసరునేత ఇవాళ గట్టిగా ఎన్ని చీవాట్లు తినాలి?' అన్నాడు, తన యాక్షన్‌ని సబ్‌స్టాన్షియేట్ చేసుకుంటాన్కి ప్రయత్నంలా.

'మీరు— ఆ భయం వున్నవాళ్లు ముందే జాగ్రత్తపడి వుండాలి' అంది కళ్లు తుడుచుకుంటూ సుందరి పరుషంగా.

'అయితే పొరపాటు నాదేనంటావు? వీళ్ల దేమీ తప్పులేదనేనా నీ అభిప్రాయం?!'

'వాళ్లకేం తెలుసూ? పసిపిల్లలు! ఇన్నేళ్లు వచ్చిన మనకే ఒకొక్కప్పుడు ఆలోచన వుండదయ్యే.' అని మొహం తిప్పుకుంది నిర్దాక్షిణ్యంగా. సుబ్బారావుకి కోపం పొర్లి వచ్చింది. కాస్సేపట్లో అది వుధృతమయింది. ఆ కారణంగా — అలిగి భోజనమయినా చెయ్యకుండా, ఫైళ్లు పుచ్చుకుని ఆఫీసుకి వచ్చాడు–బుసలు గొట్టుకుంటూ. సుందరి ఏం మాట్లాడనే లేదు.

సుబ్బారావు మనసు అల్లకల్లోలంగా వుంది. కడుపులో ఆకలిగా వుంది. కాంటీను నుంచి, ప్యూను పున్నయ్య చేత, ఎలుగ్గొడ్డు కోసం, కాఫీ పట్టించుకు నొచ్చి త్రాగమని బ్రతిమాలారు అడ్డా, సోలా. గుటుక్కున ఆ వేడి వేడి కాఫీని తాగేసి నిట్టూర్చాడు సుబ్బారావు. చూపుల్తోనే వాళ్లకి థాంక్సు చెప్పాడు.

సాయంత్రం అయిదయేసరికి ఒక నిర్ణ

యానికి వచ్చాడు సుబ్బారావు. వుదయం భోజనం లేనందువలన నీరసంగా వున్నా' ఓపిక తెచ్చుకుని, మార్కెట్‌కి వెళ్లి పూలూ, పళ్ళూ, స్వీట్సూ తీసుకుని బిక్కు బిక్కుమంటూ ఇల్లు చేరాడు. గుమ్మంలోనే ఎదురయ్యారు బండి చక్రమూ, సైకిలూ! సుబ్బారావును చూసి, 'నాన్నా! నాన్నా' అంటూ కాళ్లు చుట్టేసారు వాళ్లని ఎత్తుకుని, ముద్దులు కురిపించి స్వీట్సు, పళ్ళు అందించాడు. సుందరికి పూలు ఇచ్చాడు. తన వల్ల పొరపాటు జరిగిన మాట నిజమేననీ, ఇక ఎప్పుడూ రాక్షసుడి లాగా వాళ్ల మీద చెయ్యి చేసుకోననీ, వాగ్దానం చేశాడు. వాతావరణపు వుష్ణోగ్రత నార్మల్‌కి వచ్చేసింది. మనసు ప్రశాంతంగా అయింది. తుఫానూ, అగ్నిపర్వతాలు ప్రేలటాలూ ఆగిపోయాయి. ఎంతో సంతోషంగా ఫీలయాడు సుబ్బారావు. నార్మల్సీ ఈజ్ గ్రేట్!

ఆ మర్నాడూ, తర్వాత వారం రోజుల లోనూ—సుబ్బారావింట్లో కొన్ని వుపద్రవాలు జరిగాయి. సుబ్బారావు కళ్లజోడు టేబులు మీంచి పడిపోయి పగిలింది అతని ఆఫీసు డ్రాయరు తాళంచెవి మాయమయి నాల్గు రోజుల తర్వాత దొరికింది. అతను కొత్తగా మళ్లీ పెన్ను కొనుక్కుంటే అది మాయమయింది. అతని మేజోళ్లు వంటగది అల్మారాలో దాక్కున్నాయి. సుబ్బారావు దైనందిన జీవితాన్ని భంగపరుస్తూ ఎన్నో వుపద్రవాలు జరిగాయి, వాటికి ప్రధాన కారకులు బండిచక్రమూ, సైకిలూ. ఏం జరిగినా అన్నీ నిర్లిప్తంగా స్వీకరించాడు సుబ్బారావు. ఆ అసౌకర్యాలకి ఎడ్జస్టయిపోయాడు. ఆ రోజు సుబ్బారావు ఆఫీసు కెళ్లటానికి బట్టలు తీసి పెట్టుకుని, బాత్‌రూంకి వెళ్లాడు స్నానం చేసి అతను తువ్వాలు చుట్టుకుని వచ్చేసరికి అవి మాయమయ్యాయి. 'ఏంట్రా ?!' అనుకుంటూ బెడ్‌రూంలోకి వెళ్లి చూసేసరికి—అతనిక్కనిపించిందిదీ!—

బూజు బూజుగా వేళ్లాడుతూ కాళ్లనుంచి తల దాకా వచ్చిన 'సుబ్బారావు చొక్కా'ని తగిలించుకుని బండిచక్రమూ, అతని పంచని చీర లాగా చుట్టబెట్టు కొనటానికి అవస్థపడుతూ వున్న సైకిలూ! సుందరిని రహస్యంగా కేకేసి ఆ దృశ్యం చూపించి ముసి ముసిగా నవ్వాడు సుబ్బారావు.

సుందరి తనూ నవ్వి, సుబ్బారావు కేసి చుర చుర చూసింది ఆ వెంటనే.

'కోపమా ? ఎందుకు సుందరీ ?' అన్నాడు సుబ్బారావు, భయం భయంగా.

'ఈ వెధవలు కోతుల్లాగా అవుతున్నారు. రోజు రోజుకీ వీళ్ల అల్లరి శృతిమించుతూంది. అందుకు కారణం మీరే' అంది సుందరి నిశ్చితమయిన ధోరణిలో.

'నేనేం చేశాను దేవీ ? ఇందులో నా తప్పేమిటీ ?'

'వాళ్ళని నెత్తిమీద ఎక్కించుకుని అతిగారాబం చేశారు ! అదే మీ తప్పు.'

'మరేం చేయనూ ? వాళ్లు పసిపిల్లలు. మన పిల్లలూ వాళ్లకేం తెలుసూ ?'

'నిజమే వాళ్లకి తెలీదు. కనుకనే కట్టుదిట్టాల్లో పెంచాలి, భయం భక్తీ నేర్పాలి వాళ్లకి పిల్లలు అని నెత్తిమీదకి ఎక్కించుకుంటే ఎలాగా ?' అని ప్రశ్నించింది సుందరి.

'మరి ఏం చేయమని, నాకు దేవిగారి ఆజ్ఞ ?' అని సుబ్బారావు అడిగాడు వినయంగా.


'వాళ్లకి మీరంటే భయం భక్తీ వుండాలి. కోపం తెచ్చుకుని గొడ్డుని బాదినట్టుగా బాదటం, లేకపోతే నెత్తిమీద ఎక్కించుకుని వాళ్ళని కోతుల్లాగా తయారు చేయటం, ఇది గృహ యజమానిగా మీకు వుచితమయిన పని గాదు.' అంది సుందరి దృఢంగా.

'చిత్తం' అన్నాడు సుబ్బారావు సరెండరయిపోయి. ఏ ఫైన్ సరెండర్ రియల్లీ !

'చిత్తం గాదు సార్, కావలసింది యాక్షన్' అని సుందరి అనగా, సుబ్బారావు విజృభించాడు.

'ఒరేయ్, రాస్కెల్స్ ఏంట్రా ఆ వెధవ పన్లూ ? భయం భక్తీ లేకుండా, వెధవాయిల్లారా! వీపులు పగలగొడతాను, చెవులు పొగదీస్తాను' అని గట్టిగా పేలాడు. బిక్కమొహం పెట్టి బండిచక్రం దొర్లుకుంటూ పోగా, సైకిలూ తుర్రుమంది. మెచ్చుకోలుగా—సుందరి అరుణాధరంపై విరిసిన ఆ చిరు దరహాసం వొంక పరిహాసంగా చూసాడు, ఎలుగ్గొడ్డు వురఫ్ సుబ్బారావు. ●





పట్టుబడ్డ దొంగ!

మద్రాసులో ఎవరో ఒక వీరుడు అసాధారణ లాఘవంతో మోటారు సైకిలుమీద పోతూ, రోడ్డుమీద నడుస్తూన్న అమ్మాయిల మెడలోని బంగారు గొలుసులు తెంపుకు పోతున్నాడట. మొన్న జనవరినుంచి యీ జూలై వరకూ యిలాటివి 15 దొంగతనాలు అరవై వేల కిమ్మత్తు వరకూ జరిగాయట. అన్ని రిపోర్టులను బట్టి చూస్తే యీ రకం దొంగతనాలు చేసేది ఒకే ఒక వ్యక్తి అని తెలిసిందట. అతన్ని పట్టలేక యిహ కాల్చి పారేసయినా యీ సమస్య పరిష్కరించాలని పోలీసు నిర్ణయించుకున్నదట. మొన్న 16 వ తేదీ ఆ వ్యక్తిని గురించి కొంత సమాచారం అందిన పోలీసులు తేనాంపేట, సైదాపేట ప్రాంతాలలో గస్తీ నిలబడ్డారట. అనుకున్నట్టుగానే ఆ వ్యక్తి వయ్యిన మోటారు సైకిలుమీద వస్తూండేసరికి గప్పున అడ్డు తగిలి పట్టేశారట. అతనే అసలు వీరుడట. పేరు కణ్ణబాబుట. ఇప్పటి కాతను పలుగుర్ని వివాహం వంటిది చేసుకుంటే అందులో ముగ్గు రాతన్ని వదిలేసి చక్కా పోయారట. నాలుగో ఆమె మొన్న నీతన్ని వదిలేసి పోడంతో యింకా ఎవరినీ సెటప్ చేసుకోలేదట.

ప్రధానిని ఆకర్షించిన పథకం!

తమిళనాడు ప్రభుత్వం బీద పిల్లలకు రోజూ మధ్యాహ్నం కమ్మని రుచికరమైన పోషక ఆహారాన్ని ఉచితంగా సరఫరా చేసే ఒక నవీన పథకాన్ని తయారు చేసి, దానిని మొట్టమొదట కోయంబత్తూరు, నీలగిరి, పెరియార్, సేలం, ధర్మపురి, నార్త్ ఆర్కాటు జిల్లాలలో ఆ జిల్లా కలెక్టరుల పరిశీలనలో ఆరంభించిందట. ఈ సంపూర్ణ పథకానికి 114 కోట్ల రూపాయల ఖర్చు వుంటుందట. ఎంత కష్టానికీ, నష్టానికీ అయినా వోర్చుకుని యీ పథకం మేం నెరవేర్చి తీరుతాము అంటున్నారట యం. జి. ఆర్. ఈ పథకం అమలు అయి చక్కగా సాగడాన్ని చూసిన ప్రధాని వివరంగా యీ పథకం గురించి తనకు తెలియజేయమని తమిళనాడును కోరారట.

అక్షరాస్యతలో కేరళ ముందంజ!

కేరళ రాష్ట్రంలో అక్షరాస్యత యింకా ఎక్కువై పోతోందట. 1971 లో 60 42 శాతం వున్నదల్లా 1981 నాటికి 69.17 శాతానికి హెచ్చయినదట. 80—81 లో స్కూళ్ళల్లో చేరినవారి సంఖ్య 55.95 లక్షలు అయితే, యిది 1981—82 కు 56·67 లక్షలకు పెంపొందిందట.

వింతల్లో వింత!

ఇండోర్‌కు చెందిన వో మూడేళ్ల వయస్సు బాలుని జననాంగం మటుకు యువ్వనంలో ఉన్న పురుషుని అవయవమంత ఉండి, కేశాలు కూడా కలిగి ఉన్నదట. ఇది చాలా ఆశ్చర్యకరమయిన విషయం. ప్రపంచ అద్భుతాలలోకే అత్యద్భుతమనీ విజ్ఞులు అభిప్రాయపడి దీనిని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో ప్రకటించాలని కోరుతున్నారట. న్యాయమే కదా! ప్రపంచంలో అత్యద్భుత, నభూతో నభవిష్యతి అనే మాదిరి విషయాలను ప్రచురించే బుక్కులో ఈ విషయం వేసి తీరాలి!

కుక్కతెలివి!


తూర్పు జర్మనీ కస్టమ్స్ శాఖలో అంజ అనే వో శునకరాజం తన అత్యధిక తెలివితేటల వల్ల గ్రహణశక్తి వల్లా అనేక కేసులు పట్టిస్తోందట. గత ఆరేళ్ళగా అది విజృంభించి మత్తు పదార్థాలనెక్కడ దాచినా, నిముషాల మీద కనిపెట్టేస్తూ ఆహా! అనిపించుకుంటూందట. ఈ శునక మేధస్సుకు ఆ శాఖవారు అబ్బురపడి, దానికి కొన్ని గౌరవ బిరుదులు యిచ్చి, రాజ లాంచనాలతో, సదుపాయాలతో ఉండే ఏ. సి గదిలో నివాసమేర్పరచారట. మనిషి కలకాలం బ్రతికేకన్నా కుక్కై ఆరేళ్ళ బ్రతికితే చాలు అని సామెత మారుద్దామా?

ఆత్మహత్యా? హత్యా?

నిమ్మకూరులో కొన్నేళ్ల క్రితం కారుపురాతి ఈశ్వరలింగం, బులుసు వీరాంగులు అనే ఇద్దరు హత్య చేయబడిన సందర్భంలో జంపాలి జాలా చంద్రుడు అనే వో సాక్షి సహాయంతో కోర్టు ముద్దాయిలకు శిక్ష విధించిందట. ముద్దాయిల తరపునవారు ఈ సాక్ష్యం చెప్ప వద్దనీ, చెప్తే ప్రాణానికి ముప్పనీ జాలాచంద్రుని హెచ్చరించినా, అతను వినలేదట. ముద్దాయిలకు శిక్షపడ్డాక జాలా చంద్రుడు ఆ వూరు వదలి ఎరికెపాలెంలో తన తమ్ముని వద్ద స్థిరపడ్డాడట. శిక్ష పూర్తి అయాక ముద్దాయిలు ఇతని నెలాగయినా చంపుతామని ప్రతిజ్ఞలుచేశారట. 19.10.72న జాలాచంద్రుడు తన ప్రియురాలు వెంటరమణమ్మ అనే ఆమెతో పామర్రులో సెకెండ్‌షో సినిమాకిబయలుదేరాడట. ఆ మరునాటి ఉదయం వూరు చివరి తోపులో వారిద్దరి శవాలూ ఒకరి మీద ఒకరుగా పడి ఉన్నాయట. వారి ప్రక్కన ఎండ్రిను ఖాళీసీసా, నాటుసారా, మాంసాహారమూ పడిఉన్నాయట. పోలీసు లిది ఆత్మహత్యలుగా తీసుకుని కేసు మూసేశారట. జ్వాలాచంద్రుని అభిమానుల కథనం ప్రకారం అతన్ని దారి కాసి, పెడ రెక్కలు విరగదీసి నోట్లో ఎండ్రిను పోసి, ఇద్దరినీ ఆ ముద్దాయిలు, వారి అనుయాయులూ చంపారని.


జైలునుంచి పారిపోయిన బాఖియా!

ఏప్రిల్ 21వ తేదీన గోవాలో కస్టమ్స్ శాఖవారు స్మగ్లింగ్ నేరంమీద సుఖుబ్ నారాయన్ బాఖియా అనే ఆయనను అరెస్టు చేశారట. కస్టమ్స్ శాఖకు యీ సందర్భంగా ఏడు కోట్ల డెబ్బయి అయిదు లక్షల రూపాయల కిమ్మత్తున్న విదేశీ సరుకులు, బంగారం దొరికాయట. ఇంత ఖరీదయిన యీ సుఖుబ్‌నారాయన్ బాఖియా పోర్టు ఆగుయుడా జైలునుంచి అతి సుఖంగా తప్పించుకు పోయారట!



వికలము కూడా సుఖమే కాదా....

బుద్ధరాజు సన్యాసిరాజు



కరెక్ట్ టైముకే వచ్చి, స్టేషన్ వదిలేసిన రైలును కసిదీరా బూతులు తిడుతున్నాడు కాశి...

"కన్నతల్లిని తిడితే కడుపు నిండదురా యదవా ... ఒళ్ళుబలిసి నువ్వు టైముకి దూటేకి రాలేకపోతే, అది దాని తప్పేటి?" అని కోప్పడ్డాడు పైడి.

పైడి కుంటివాడు — కుడికాలు తొడ వరకూ లేదు.

కాశికి ప్రపంచజ్ఞానం బోధించిన గురువు.

"ఎవురూ ... కాశిగాడేనా? ... గతిలేని ముద్దు గానుగు లాగిందనీ ... ఈ వాడికి అడుక్కుతినే కర్మ పట్టింది గాని, ఏ వాడైనా కట్టపడి యెరుగునా, పాపం..." అన్నాడు, ఏడాది క్రితం వరకూ అందర్నీ చూడగలిగే ప్రయోజనంలేక, మూపు పాడు చేసుకున్న పింకటేసు.

ఆ మాటలకు చలించాడు కాశి...

పింకటేసు చెప్పింది అక్షరాలా నిజం... గతం కళ్ళముందు కదిలింది కాశికి.

* * *

కాశి తండ్రి కలాసీగా వుండేవాడు, స్టేషన్లో.

తల్లిలేదు, అక్కయ్య వుండేది...

స్టేషనుకు దగ్గర్లో ఓ చిన్న పాకలో వుండేవాళ్ళు.

అక్కయ్య తండ్రికి భోజనం తీసుకెళ్తుండేది ...

స్కూలు లేనప్పుడు తనూ వెళ్ళేవాడు, అక్కతో.

ఆహ్ — ఆ రోజులు తల్చుకొంటుంటే ఎంత ఆనందంగా వుంది!

'చిన్నదొర' అని పిలిపించుకొనే అసిస్టెంటు స్టేషన్ మాస్టరు తనను దగ్గరకు పిల్చి కూర్చోబెట్టుకుని, చాక్లెట్లు తెప్పించేవాడు ...

ఒకళ్ళిద్దరు టి. టి. ఈ లు బుగ్గలు చిదిమి టిఫిను, టీ తెప్పించి యిచ్చేవాళ్ళు...

అక్క చూసీ చూడనట్టు ఊరుకునేది...

వాళ్ళు అప్పుడప్పుడు అక్కతో ఏదో మాట్లాడుతుండే వాళ్ళు మెల్లగా...

తనని గురించే అక్కకి చెప్తున్నారనుకుని సిగ్గుతో మొహం దించేసుకునే వాడు తను...

ఆ రోజు తనింకా మర్చిపోలేదు...

అప్పుడు తను ఏడోతరగతి చదివేవాడు, హైస్కూల్లో...

అక్కా, తనూ నాన్నకి భోజనం పట్టుకెళ్ళారు.

కాని నాన్న స్టేషన్లో లేడు...

ఇంతలో లైన్‌మేన్ చిన్నయ్య పరుగెత్తుకుంటూ వచ్చి, నాన్న రైలు పట్టాల మధ్య చచ్చిపోయి ఉన్నాడని చెప్పాడు.

స్టేషన్లో ఉన్న కళాసీలు, పోలీసులు వెళ్ళి

నాన్న శవాన్ని తీసుకొచ్చి స్టేషన్లో పెట్టారు ..

అక్క, తనూ ఆ రోజు నాన్న శవం మీద పడి ఏడ్చారు—అక్కకూ, తనకూ ఏ దారీ లేదు

ఓ రోజు చిన్నదొర ఓ కళాసీతో కబురు పెట్టాడు, అక్కను రమ్మని

కొంతమందికి కేరేజీలు తెచ్చేపనికి కుదిర్చాడు, అక్కని.

రోజులు మామూలుగా గడిచేవి...

ఓ రోజు తనకి డబ్బులిచ్చి సినిమా చూసి రమ్మంది అక్క

దాన్ని కూడా రమ్మంటే తలనొప్పిగా ఉందని చెప్పింది.

సినిమా హాల్లోదూరి, జనాన్ని తోసుకుని టిక్కెట్టిచ్చే దగ్గరికి వెళ్తుంటే, టోపీ వేసుకున్నాయన పట్టుకుని 'కేడీ నా కొ...' అని తిట్టి, తన దగ్గరున్న చిల్లర లాక్కుని, కొట్టి బయటకి తోసేసాడు ...

ఏడ్చుకుంటూ ఇంటి కొచ్చేసాడు ...

రెండు మూడు సార్లు గుడిసె తలుపు కొట్టినా, అక్క తియ్యలేదు...

బాగా నిద్రపట్టేసిందేమో అనుకున్నాడు ...

మరో రెండుసార్లు గట్టిగా బాది, పిలిచాడు...

కొంతసేపటి తరవాత తలుపు తీసింది, అక్క ...

చిన్నదొర గాబరాగా బయటికి వెళ్ళిపోయాడు, గుడిశెలోనుంచి...

తనను చూసి అక్క గాబరా పడింది ... ఏప్పుడూలేంది చిరాగ్గా చూసింది తనకేసి.

రెండు మూడు నెలల తరవాత ఓ రోజు అక్కనీ, తననీ బయటి కీడ్చి, గుడిశె పడగొట్టేసారు, చుట్టుప్రక్కల వాళ్ళు.

ఎందుకలా చేసారో అప్పుడర్థం కాలేదు, తనకి.

తరవాత స్టేషనే యిల్లయింది-అక్కకు, తనకూ.

ఒక ఉదయం తను నిద్రలేచేసరికి అక్క లేదు.

అందరూ తనని అదోరకంగా చూడటం మొదలెట్టారు ...

ఓ రోజు స్టేషన్లో తిరుగుతుంటే పైడి బాలిపడి, ఈ సలహా యిచ్చాడు.

ఆ రోజు నుంచీ తను అడుక్కుంటు న్నాడు.

* * *

"నీ గురించి నర్సింగు గోర్ని కనుక్కు న్నానురా... సంగంలో పేర్చుకోడానికి కుదర దనీసారు..."

అన్నాడు పైడి కాశితో, బాధగా.

తను కట్టుకున్న గాలిమేడలు కూలి పోయాయి...

పట్టుకుందామనుకున్న కొమ్మ చేతి కందలేదు...

సంగంలో చేరిపోతే ఏ యిబ్బందీ ఉండ దనుకున్నాడు... చేరమని పైడే సలహా యిచ్చాడు.

సంగం పెద్ద 'నర్సింగు' గారట. ఆయనా మొదట్లో స్టేషన్లో అడుక్కునే వారట. తరవాత్తరవాత స్టేషన్లో ఓ అందమైన పిచ్చిదాన్ని చేరదీసి, నలుగురికీ దాన్ని రుచి చూపించి, నాలుగు డబ్బులు వెనకేసి అడుక్కోటం మానేసారట...

చనువున్న వాళ్ళెవరైనా 'ఒరే నర్సింగూ' అంటే, వాళ్ళని కొట్టినంత పని చేసేవారట.

నెమ్మది నెమ్మదిగా, స్టేషన్లో అడుక్కునే వాళ్ళమీద జులుం చేసి, ఒక్కొక్కడి దగ్గరా రోజుకో పది పైసలు చొప్పున వసూలుచేసి, ఒక సంగం పెట్టారట...

ఇప్పుడాయన మూడు రిక్షాలకి ఓనరట!

కాని, నర్సింగు గారిలో ఒక గొప్ప గుణం వుందట... సంగంలోని వాళ్ళకి అన్యాయం చెయ్యరట...

ఇప్పుడు సిటీలో వున్న అన్ని సంగాలకన్నా నర్సింగు గారి సంగమే పెద్దదట.

సంగంలో చేరిన వాళ్ళ దగ్గర నుంచి రోజుకు రెండురూపాయల చొప్పున వసూలు చేస్తారట...

ఉదయం డూటీకి వెళ్ళే ముందు నాలుగు ఇడ్లీ, టీ యిస్తారట...

మళ్ళీ రాత్రికి భోజనం...

పడకలకోసం ఫుట్‌పాత్‌లమీది సిమ్మెంట్ పలకలు కేటాయిస్తారట...

సిటీలో ఎక్కడికి కావాలంటే అక్కడికి బదిలీ చేయించుకోవచ్చుటకాని, అక్కడి వాడు ఈ ఖాళీకి రావడానికి ఒప్పుకోవాలట.

రైల్వేస్టేషను,బస్టాండులాటి సెంటర్సుకు బదిలీలు కావటం చాలా చాలా కష్టం అట!

ఈ విషయాలన్నీ తనకు పైడే చెప్పాడు.

'తంతే బూర్ల గంపలో పడినట్టు, స్టేషన్లోనే డూటీ దొరకడం నీ అదృష్టంరా కాశీ...'... అని పైడే అన్నాడు.


సంగంలో తొందరగా చేరకపోతే స్టేషన్లో గాని, మరెక్కడయినా గాని డ్యూటీ చెయ్య నీరని కూడా పైడి చెప్పాడు.

కాని తనని చేర్చుకోనంటున్నారని కూడా చెప్పాడు పైడి

ఎందుకు చేర్చుకోరో అర్థం కాలేదు, కాశికి...

అదే అడిగాడు పైడిని...

"అదేంటన్నా గుడ్డోడా, కుంటోడా?... అడ్డమైన వోళ్ళందర్నీ సంగంలో పేర్చు



కుంటే నా సంగం స్వతంత్ర్యమైపోదూ..." అన్నాడట పర్సింగు గారు.

అదీ నిజమే అనిపించింది కాశికి

విధిలేక దొంగతనంగా అడుక్కుంటు న్నాడు కాశి, స్టేషన్లో.

*　　*　　*

ఆ రోజు రావల్సిన రైలు రెండు గంటలు లేటట.

ప్రయాణీకుల ముఖాలు ముడుచుకున్నాయి...

ముష్టివాళ్ల ముఖాలు వికసించాయి!

ఒకడు చెడితేగాని ఇంకొకడు బాగుపడడన్న సిద్ధాంతం ఇక్కడా వర్తిస్తుందేమో...

ప్రయాణీకుల్లో హడావుడి తగ్గి, ఖాళీ ఉన్న దగ్గరల్లా చతికిలబడుతున్నారు.

ప్రపంచంమీద చర్చ సాగుతోంది, స్టేషన్లో.

'అమెరికాలోని ట్రెయిన్లకి లేటంటే ఏమిటో తెలియ'దంటున్నాడు ఒకడు...

'రష్యాలో లేటొచ్చిన ట్రెయిన్ని ఉరి తీసేస్తా'రంటున్నాడు ఇంకొకడు ప్రపంచ జ్ఞానినని ఫీలవుతూ.

చుట్టూవున్న 'జ్ఞానశూన్య' అవార్డు గ్రహీతలు నోళ్లు వెళ్లబెట్టి వింటున్నారు.

వాళ్లని చేరాడు కాశి.

"బాబూ ధర్మం..."

ఎవరికీ ఏకా గ్రత చెడలేదు.

"ధర్మ ప్రభువులు... కనికరించాలి"

ఆత్మాభిమాన్ని జయించిన కర్తవ్యం నేర్పిన సంబోధన అది.

"దున్నపోతులాగున్నావ్... ఏదైనా పని చేసుకోరాదూ."

అన్నాడొకాయన చీకికళ్ల మొహం చిట్లించి.

"ఇలాంటి వెధవలంతా పగలు అడుక్కునే పని, రాత్రి బ్రోకరు పని..." ఇంకొకాయన.

"మన దేశంలో శ్రమలేని ఉద్యోగాలివే... కొన్నాళ్లకి దేశమంతా అడుక్కుతినేవాళ్లే అయినా ఆశ్చర్యపోనక్కర్లేదు."

అన్నాడు ఖద్దరు బట్టల గారపళ్ల శాస్త్రి, జోకేసినట్టు.

మొదటి 'ఒకాయనా', 'ఇంకొకాయనా' ప్లాట్‌ఫాం మీద దొర్లి దొర్లి నవ్వారు ఆ కుళ్లు జోకుకి.

రచయిత్రుల పోస్టాఫీసు !

పశ్చిమ జర్మనీలో ముగ్గురు మహిళలు కలిసి "రచయితల పోస్టాఫీసు" ప్రారంభించారు. పోస్టాఫీసంటే కార్డు, కవర్లు అమ్మే కార్యాలయం కాదు అది ప్రచురణకర్తలకు, చెత్త బుట్టకు మధ్య వారధి. సాహిత్యం అంగట్లో అమ్మే సరుకు కాదని వీరి అభిప్రాయం. కొత్త రచయితలను వెలుగులోకి తీసుకురావడం, పుస్తక ప్రచురణ వీరి ధ్యేయం కాదు పుస్తక ప్రచురణకు ప్రత్యామ్నాయం కాగలగటమే వీరి ధ్యేయం. ఔత్సాహికులైన రచయితలు తమ రచనలను ఇక్కడ చదివి వినిపిస్తారు. వాటిని గురించి చర్చిస్తారు. స్వయంగా రాలేక పోతే రచనలు పోస్టులో పంపవచ్చు వాటి ప్రతులను పాఠకులకు అందుబాటులో ఉంచుతారు. పాఠకునికి అందటమే సాహిత్యానికి పరమావధికదా!

చాలా బాధనిపించింది కాశికి... 'లేదు పో'మ్మనవచ్చుగదా.

దేశం అడుక్కుతింటే తన కేమిటే... తన పొట్ట నిండాలి గాని...

ఇప్పుడు మాత్రం దేశం అడుక్కోకుండా తింటున్నదా?

ఇంతలో తడుముకుంటూ వాళ్లని చేరాడు ఎంకటేసు.

ముగ్గురూ ధర్మంచేసారు వాడికి'

చూసాడు కాశి... కడుపు మండింది.

మరి ముందుకు వెళ్లలేదు...

వెనక్కి వచ్చి, స్టేషను చుట్టూ వున్న ఇనుప ఫెన్సింగును చూసాడు. సిమ్మెంటు స్తంభాలకి కొట్టివున్న ముళ్లతీగలు బాగా తుప్పపట్టి వున్నాయి.

సిమెంటు స్తంభం దగ్గరగా వెళ్లాడు...


ఏడుపొచ్చింది...

కళ్లు మూసుకుని గట్టిగా సిమెంటు స్తంభాన్ని తన్నాడు.

'అబ్బా' అని మూలిగాడు బాధకి.

*　　*　　*

"సెప్టిక్ అయిపోయింది... ఇంజీషన్ను వాడాలి— పది రూపాయ లవుద్ది."



ధర్మపథం

బులుసు వేంకటరమణయ్య

ఆపద మ్రొక్కులు

ఒకసారి ఒక మహాసభ జరిపేటప్పుడు ప్రారంభంలో దైవప్రార్థనను చేయవలెనని ఒక వ్యక్తిని కోరగా "ఏమిటి ఇస్తారు?" అని ప్రశ్నించాడట! "దైవప్రార్థనకు లంచం కావాలా?" అని ప్రశ్నించగా "కష్టంలో ఉన్నప్పుడు దేవుణ్ణి ప్రార్థించాలి. నాకే కష్టమూ లేదు. నేనెందుకు ప్రార్థించాలి?" అని సమాధానమిచ్చాడట! ఈ జవాబు కొంత ఆశ్చర్యం కలిగిస్తున్నా – జరుగుతున్న సంగతి యింతే! సుఖంగా కాలం గడుస్తున్నప్పుడు దైవప్రార్థన చేసేవారు తక్కువ. కష్టసమయంలోనే దేవుడు స్మరణకు వస్తాడు. ఈ కష్టాన్నుండి గట్టెక్కితే ఫలానా మ్రొక్కుబడి చెల్లిస్తానని మొక్కుకుంటారు కూడా. భగవదనుగ్రహంవల్ల ఆ కష్టం నుంచి బయటపడిన తర్వాత ఆ భక్తి కొంత తగ్గుతుంది. ఎలాగో మొక్కుబడిని చెల్లించి, తన బాధ్యత తీరినదని తృప్తిపడడం జరుగుతుంది. మళ్ళీ ఏదో అవసరం వస్తేనే మళ్ళీ దేవుడు జ్ఞప్తికి వస్తాడు. వ్యక్తిని మంచి మార్గంలో ప్రవేశపెట్టడానికే దేవుడు అతని కోరికను నెరవేర్చిన సంగతి స్మరణకు రాకపోవటం వింతే!

ఒకడు తన కోరిక నెరవేరితే తిరుపతి వేంకటేశ్వర స్వామికి హుండీలో తన వ్రేలి ఉంగరం ఇస్తానని మొక్కుకున్నాడు. కోరిక నెరవేరింది. కాని, ఆ మనిషికి ఆ ఉంగరం అంటే ఎంతో ఇష్టం. మొక్కుబడి చెల్లించాలి గదా! అతడు ఆలోచించి, ఆ ఉంగరం విలువ పైకాన్ని మూటకట్టి హుండీలో వేసి, మ్రొక్కుబడి తీర్చుకోవాలని నిశ్చయించాడు. హుండీలో ఆ పైకాన్ని పడవేస్తున్నప్పుడు, తన వేలికి బిగువుగా ఉన్న ఉంగరం కూడా జారి హుండీలో పడిపోయింది. దేవుణ్ణి మోసం చెయ్యదలిస్తే తానే మోసపోయాడు. ఈ విషయం చాలా మంది చెప్పుకుంటారు. ఇట్టి సంకుచితాభిప్రాయాలకు చోటు ఇవ్వకూడదు. ఆపత్కాలంలో మాత్రమే దేవుణ్ణి స్మరించడం, ఏమార్చదలచడం సరియైన పద్ధతి కాదు. అన్నిసమయాలలోను దైవధ్యానం, దైవప్రార్థన మానవునికి కర్తవ్యమై ఉన్నది. అట్టి ప్రార్థన మాత్రమే యథార్థమైన ప్రార్థన. దీనిని అందరూ గ్రహించవలసి ఉన్నది.

అంది– గవర్నమెంటువారి ఖరీదయిన (అ)ధర్మాసుపత్రి ఎర్నమ్మ– మనిషిని నమిలి పిప్పిని ఉమ్మే రాక్షసిలా– ఖారాకిళ్ళీ పిప్పి ఉమ్మేస్తూ, గేటు దగ్గరే.

నగటు మానవుడికి మినిష్టరుగారి దర్శనం దొరకనట్టే, డాక్టరు మహాకాయం కనిపించలేదు కాశికి.

డాక్టరు లేనప్పుడు నర్సమ్మే పెద్ద డాక్టరని తెలుసు...

అయినా ఎందుకనో ఆమె సలహా నివ్వలేదు...

కుంటుకుంటూ ఇంటికొచ్చేసాడు, అదే– స్టేషనుకి, నిరాశగా.

నానా అవస్థలూ పడి డబ్బులు కూడ బెడుతున్నాడు, కాశి, అడుక్కుంటూ.

నెల రోజులు పోయాక అతి ప్రయాస మీద ఆస్పత్రి చేరాడు మళ్ళీ.

ఏ వూరుకి వరదొచ్చిందో, డాక్టరుగారున్నారు!!

కాశిని చూసి, పెదవి విరిచారు.

ఇంతలో నర్సమ్మ వచ్చి కాశిని చూసి, గుర్తు పట్టింది.

"ఓరి పిచ్చిముండాకొడకా... గోటితో పోయేదాన్ని గొడ్డలిదాకా తెచ్చుకున్నావుగదరా. నీకసలు బతకాలని వుందా?" అని చిరాకు పడింది.

"ఉంది" అన్నాడు కాశి, ముక్తంగా,

"అప్పుడే యిండీషన్లు తీసుకుంటే మారాజులా బాగయ్యేది కదా, ఇన్నాళ్ళు కుళ్ళబెట్టావెందుకూ?"

"డబ్బుల్లేక" అబద్ధమాడాడు కాశి.

"పోనీ యిప్పుడున్నాయా?"

"ఎంతవుద్ది?"

"నగంకాలు తీసెయ్యాల... యాభై రూపాయలు వట్టా... మరి ఇండీషన్లూ, రొట్టే, పాలూ బలమైన తిండీ పెట్టాలి గదా" అంది నర్సమ్మ.

"ఎప్పుడొచ్చేది?"

"పొద్దున్నే రా– డబ్బులెత్తి."

నర్సమ్మకి రెండు చేతులెత్తి దణ్ణం పెట్టాడు కాశి.

తనని కుష్ఠుదాన్ని చూసినట్టు చూస్తాడనుకున్నవాడు దణ్ణం పెట్టేసరికి ఉక్కిరిబిక్కిరైంది, నర్సమ్మ.

కాశి కళ్ళనుంచి రెండు ఆనంద బాష్పాలు రాలాయి.

తమ సంఘంలో చేరడానికి అర్హత సంపాదించుకున్నాడు.

తనూ జీవితంలో స్థిరపడుతున్నాడు!

ఆ ఆలోచన రాగానే ఓ గగుర్పాటు కలిగి మనస్సు, శరీరం తేలికైంది...

ఆ మధుభాతిల రెండు కన్నీటి బొట్లు రాల్చింది.

అంతకంటే వాడి కింకేం కావాలి?

అది చాలు!

పరుగులాంటి కుంటి నడకతో స్టేషను వేపు దారి తీసాడు కాశి.

కుక్కర సింహం గ్రామ సింహం

రాణీ మోహన్రావు



...అరగంట సేపు గడగడా మాట్లాడి రావుగారి మొహం వేపు, చూసేడు నరసింహం. నరసింహం సన్నగా రివట్లా వుంటాడు. బండిగూడు క్రాపు, సోడాబుడ్డి కళ్లద్దాలు, పెదాలు దాటొచ్చే ఎత్తుపళ్ళు— డబ్బాకాకి ఫ్యాంట్‌లో తెల్లచొక్కా టక్‌చేసి చూసేవాళ్లకి ఒక కార్టూన్‌లా కన్పిస్తాడు.

నరసింహం ఓ కుక్కర్ల కంపెనీలో సేల్సుమేన్—

నరసింహం ఇంగ్లీషు (భాషను) ధాటీగా ధారాళంగా మాట్లాడుతాడు. కరక్టుగానా అంటే చెప్పలేం. అది వినేవాళ్ల జ్ఞానంబట్టి వుంటుంది. మొత్తం మీద అతనింగ్లీషు భాషంటే గ్రామర్‌కే భయమని చెప్పాలి!

నరసింహానికో రోగిష్టి తల్లి వుంది. ఆమె ఎప్పుడూ విరామం లేకుండా దగ్గుతూ వుంటూంది. తల్లి అంటే న ర సిం హా ని కి ప్రేమకాదు. ఎనలేని జాలి. ఆమె దగ్గు తగ్గాలని ఎన్నో పూజలు చేసేడు. ఎందరో బాబాలకు— సాధువులకు మొక్కేడు...ఆంధ్ర దేశంలో వున్న పుణ్య క్షేత్రాలను దర్శించేడు. ఇంగ్లీషు మందుల్లో వున్న అన్ని రకాల మందులు వాడేరు. తెలుగు మందులువాడేడు. ఫలితం కనవళ్లేదు. ఇక చివరకు సంస్కృతం మందులే దిక్కు అనుకొని తూర్పుగా తిరిగి ఓ నమస్కారం చేసేడు.

నరసింహాని కిద్దరు ఆడపిల్లలు— లాంతరు పట్టుకొని ముందుకెళ్లేందుకు కొడుకులు లేకపోయినా తద్దినాలు పెట్టేందుకు వీళ్లున్నారు. దుర్భిక్షంలో అధికమాసంలా— నరసింహం భార్య (మళ్లీ) నెల తప్పింది. ఆమె నీమధ్యే పుట్టింటికి పంపేడు నరసింహం ఇంటికి కరంట్ అవసరం లేదు. పగలు సూర్యుడు—రాత్రి చంద్రుడు— చుక్కలే ఆధారం.

నరసింహం కాళ్ల చెప్పులు అరిగేలా రోజల్లా తిరిగి, మిరపకాయతిన్న కాకిలా పార్టీల దగ్గర అరచి అరచి కుక్కర్లమ్మితే కంపెనీవాళ్ళు నెలైసరికి నరసింహాని కిచ్చేది మూడేభై లు....

ఇదీ నరసింహం జీవిత కథ మేష్టారూ!...

* * *

చెప్పండిసార్... కుర్చీలోంచి ముందుకు వంగుతూ అన్నాడు నరసింహం... రావుగారు ఇబ్బందిగా కుర్చీలో కదిలేరు

"మీరు చెప్పింది బాగానే వుంది... మీ కుక్కర్లు..."

"సార్— హియర్ మీ" రావుగారు మాట్లాడుతుంటే... అడ్డొస్తూ అన్నాడు. "ఇంతకీ మీ యింట్లో వంట దేనిమీద చేస్తారు?"

"కర్రపొయ్యిమీదండీ" నవ్వుతూ అంది రావుగారమ్మాయి.

ఆమెమాటకు నరసింహం ఖంగు తిన్నాడు.

"వ్హాట్ కర్రపొయ్యిమీదా? మీ లాంటి హైక్లాస్ ఫేమ్లీస్ అలా వంట చెయ్యటం మీక్కాదుసార్ నామోషి— నాకు" అర్చేడు నర్సింహం.

"మా అమ్మాయి— ఒట్టి అల్లరి పిల్ల. మేం వంట కర్రపొయ్యిమీద చెయ్యం. గేస్ పొయ్యిమీద చేస్తాం" నెమ్మదిగా అన్నారు రావుగారు.

"హమ్మయ్య! బతికించేరు" నిట్టూరుస్తూ అన్నాడు నరసింహం.

"సార్! గేస్ పొయ్యిమీద మామ్మూలు గిన్నెల్తో వంట చేస్తే అరవై నిముషాలు పడుతుంది. అదే మా కంపెనీ కుక్కర్తో అయితే..."

"రెండు గంటలు పోతుంది. కదండీ" అంది రావుగారమ్మాయి.

"నెవ్వర్... అలా అవదు బేబీ. ఓన్లీ ట్వంటీ మినిట్స్ పడుతుంది. కుక్కర్లో నాటొక్కే వంటా. బట్ ఆల్‌సో యిడ్లీలు కూడా చేస్కోవచ్చు. మీరే డౌట్ పడక్క

ర్లేదు మా కంపెనీ కుక్కర్లనే కొనండి. బాగా మన్నుతాయ్'' హుషార్‌గా అన్నాడు నరసింహం.

రావుగారు అతనిమాటలకు ఏమీ అన్లేదు. మునిలా మౌనంగా వూరుకున్నారు.

''సార్! చెప్పండి'' ప్రాధేయంగా అన్నాడు.

''మీ కంపెనీ కుక్కర్లకన్నా– 'నలభీమా' కుక్కర్లే బాగా మన్నుతాయని మా వాళ్లు అంటున్నారు'' రావుగారు నెమ్మదిగా అన్నారు.

నరసింహం నిరుత్సాహంగా ''అలాగే అంటారా?'' అని అంతలోనే, ధైర్యం తెచ్చుకొని– ''సార్ మీ వాళ్లకు కావలసిన కుక్కరు అదే 'నలభీమా' కుక్కర్నే కొనండి. నే కాదనను ఏదైనా మీవాళ్ల హైమ్యూ, మీ గ్యాసు ఆదా కావటం నా కోరిక 'నలా' కుక్కరుకొన్నా–'భీమా' కుక్కరు కొన్నా, చివరకు 'నలభీమా' కుక్కరు కొన్నా– నా ద్వారానే కొనండి ఇలా నేను మీచేతకొనిపిస్తే నాక్కొంత కమీషనొస్తుంది. అదెంతోకాదు సార్, ఒన్లీ సిక్స్‌టీ రూపీస్ మీ పేరు చెప్పుకొని మా ఫేమ్లీ అంతా ఓ వారం రోజులపాటు భోజనాలు చేస్తాం. ప్లీజ్'' ఏడ్వలేక నవ్వుతూ అన్నాడు నరసింహం– అతని కళ్లమ్మట నీళ్లు– నోటమ్మట ఎత్తు పళ్లుపైకొచ్చేయ్!

''అలాగే కొందాంలెండి.'' నరసింహానికి మంత్రిలా హామీ యిచ్చేరు రావుగారు.

* * *

ఓ రోజున కాఫీ హోటల్లో రావుగారిని కలేడు నరసింహం. వేళకు వంటవటంలేదనీ, తన భోజనానికి అప్పుడప్పుడూ యిబ్బంది ఔతోందని మాటల సందర్భంలో నరసింహానికి చెప్పేరు రావుగారు.

''యూ డోంట్ వర్రీ సార్– యూ పింప్లీ రైట్ యువర్ ఏడ్రస్–ఐ యాజిలీ ఎరైంజ్ దా కుక్కర్...'' ముక్కు కిందకు జారుతున్న కళ్లద్దాలను పైకెగదోస్కుంటూ అన్నాడు నరసింహం.

'సాయంత్రం మా యింటికి రండి' అన్నారు రావుగారు. అలా ఆరంభమైంది రావుగారికి, నరసింహానికి స్నేహం–

* * *

రావు గారింట్లో వున్న కేలండర్లో ఆరు కాగితాలు చిరిగిపోయేయ్!

ఆఫీసులో పనులు ఎక్కువగా వుంటం వల్ల రావుగారు ఇచ్చిన హామీ మర్చిపోయేరు.

ఓ! చల్లని సాయంత్రం –

రావుగారికి పూర్ణా మార్కెట్‌లో కల్సేడు నరసింహం–''అంతా కులాసాఏనా సార్''

''ఆఁ ... ఆఁ ... అంతా కులాసాగానే వున్నాం...ఏనుంది... మళ్లీ కలుద్దాం'' వెళ్లిపోతున్న రావుగార్ని ఆపి! ''సార్...'నలభీమా' కుక్కర్లు మంచి రకాలు వచ్చేయ్...రండి... వెళ్దాం'' రావుగారి వేపు చూస్తూ.

''నాకు అర్జంటు పనుంది ... మరోసారి వెళ్దాం...''

''ఆల్‌రైట్ సార్ – మీరు వెళ్లండి... రేపీవినింగ్ ఆరింటికి మీ ఇంటికొస్తాను...'' నరసింహం హుషారుగా అన్నాడు.

* * *

సూర్యుడు అస్తమించడం ఆలస్యమౌతాడేమోకాని అన్నమాట ప్రకారం మర్నాడు సాయంత్రం ఆరింటికి రావుగారింటి కొచ్చేడు నరసింహం, ఎలా అయినా రావుగారి చేత 'నలభీమా' కుక్కరు కొనిపించాలన్న పట్టుదలతో...

రావుగారి కుటుంబానికి కుక్కరు ఎలా పన్జేసేది వివరంగా చెప్పాడు నరసింహం. ప్రాక్టికల్‌గా చేసి చూపిస్తానంటే అక్కర్లేదు మా కర్థమైందన్నారు – రావుగారి భార్యా, పిల్లా!

''సార్ ... సార్ ... నాదో రిక్వెస్టు'' అర్థింపుగా అన్నాడు నరసింహం.

''ఏంవిటా రిక్వెష్టు'' రావుగారు అడిగేరు.

''మీకీ నలభీమా కుక్కర్ నా ద్వారా కొంటున్నట్టుగా మీ చుట్టాలకీ – పక్కాలకీ చెప్పకండి సార్ – ఎవరైనా మా ఆఫీసరుకి రిపోర్టు చేస్తే నా ఉద్యోగం పోతుంది...'' ప్రాధేయంగా అన్నాడు నరసింహం...

''ఎవర్కికీ చెప్పంలెండి'' రావుగారి అమ్మాయి అంది.

''ఐతే ఈ కుక్కర్ను ప్రస్తుతానికి పట్టుకుపోయి వచ్చేనెల పస్టుకి తీస్కురండి ... అప్పుడు కొంటాం...'' రావుగారు నెమ్మదిగా అన్నారు – నరసింహం నిర్ఘాంతపోయినా ... అలవాటుగా దిగమింగి వూరుకున్నాడు. వెంటనే తేరుకుని...

''ఆఁ...చెప్పడం మర్చేను సార్ ... మీకో గుడ్ న్యూస్'' అర్చేడు నరసింహం.

''మీ జీతం పెంచారా ?'' నవ్వుతూ అన్నారు రావుగారు.

''కాదార్...మా ఆవిడకు పురుడొచ్చింది ...అబ్బాయి పుట్టేడు'' నవ్వుతూ సంచీ లోంచి స్వీట్స్ పేకట్ తీసి విప్పి రావుగారి కుటుంబానికి తలో స్వీటు యిచ్చి ... తనో స్వీటు నోట్లో వేస్కున్నాడు–నరసింహం.

* * *

రెండు నెలల తర్వాత...

సాయంకాలం ఇంటికి నడిచి వెళ్తే మీ మలబద్ధకం 'మందు' అవసరం లేకుండా తగ్గిపోతుందన్న డాక్టర్ సలహా మీద నడుస్తున్న రావుగారు తక్కుమని ఆగేరు ... ఓ చోట –

కుక్క, దాని గొలుసూ పట్టుకొని వెనకాలే కుక్కలా వస్తున్న నరసింహాన్ని చూసేరు రావుగారు.

''ఏం పంతులూ ఎలా వుంది నీ కుక్కర్ల వ్యాపారం ?'' ఘుందాగా పల్కరించేరు రావుగారు. (అతని కేన్వాసింగ్ విని కుక్కరు కొనని శ్రీ రావుగారు)

''మీరు కొన్లేదుగా ?''

''ఒక్క కుక్కరు అమ్మితేగాని వారం రోజులు భోజనం వుండదన్నావ్ ? నీ పని బాగానే వుందే ? షికారుకి చేతిలో కుక్క వ్యవహారం– ''

''ఆకలేస్తుంది అన్నవాణ్ణి జోకులేసి ఏడ్పించకండి సార్ ... నే నిప్పుడు అమ్మేది కుక్కర్లు కాదు సార్''

''మరేవిటోయ్ ?''

''కుక్కలు''

''కుక్కలా...'' అర్చేరు రావుగారు.

''ఔన్సార్ ... కుక్కలే! టెరియర్ – బుల్డాగ్–అల్సేషియన్...వగైరా ... వగైరా ...పది కుక్కర్లు అమ్ముకునే కన్నా– ఓ కుక్కను అమ్ముకుంటే చాలు...''

రావుగారు మౌనంగా కుక్కవేపే చూడసాగేరు.

'మంచి అల్సేషన్ ... కొంటే బావుణ్ణు' అనుకున్నారు.

''ఏవిటలా ఆలోచిస్తున్నారు ... కుక్క మంచిదే...అల్సేషియన్ కొంటారా ?''

'అదే చూస్తున్నానోయ్ పంతులూ...'

'మీరు అలా ఆలోచిస్తూనే...చూస్తూనే వుంటారు ... ఈ లోగా ఎవడో కుక్కను కొనుక్కుపోయి మీ మీదకే వుస్కొపెడ్తాడు'' అంటూ ముందుకు సాగిపోయేడు గ్రామసింహంతో నరసింహం.

కార్టూన్‌లు పంపేవారికి మనవి

కార్టూన్‌లతోపాటు స్వంత చిరునామాగల స్టాంపులు అతికించిన కవరుపెట్టి సంపాదకుడు, ఆంధ్ర సచిత్రవారపత్రిక, గాంధీనగరం, విజయవాడ—3. అన్న చిరునామాకి టపాలో పంపాలి. వీటి పరిశీలనకు కనీసం 6 మంచి 8 వారాలు పట్టవచ్చును. ఈలోగా, నేరుగా కాని, టపాలోగాని వీటిపై ఉత్తరప్రత్యుత్తరాలకు తావు ఉండదు. కార్టూన్‌లు 'టపా' లో పోయినా, దారితప్పిపోయినా సంపాదకునిబాధ్యత వుండదు. ప్రత్యేక సంచికలకు కార్టూన్‌లు పంపేవారు కవరుమీద ఆ సంచిక పేరు ఉదహరించాలి. ఈకార్టూన్‌లకి కూడా పై నిబంధనలు వర్తిస్తాయి.

—సం.

వారఫలం

20-8-1982 శుక్రవారం మొదలు 26-8-1982 గురువారం వరకు

★మేషం : మీ యుపకార బుద్ధి, కష్టాలకు దారి తీయవచ్చు. అతిగా పరులకు సహాయం చేయటం కూడా తగ్గించుకోవాలి. వ్యాపారంలో ఎలాంటి లోపం లేదు. స్త్రీలకు : సుఖం, ఆనందం, ఉద్యోగావకాశాలు గల వారమే. రాజకీయంగా కొందరకు సదవకాశాలుంటాయి.

★వృషభం : ధన లబ్ధి గల వారం. అప్రయత్నంగా ధనం చేతికి అందే మార్గం ఉన్నది. ఇక తిరిగి రాదనుకొన్న ధనం చేతికి అందవచ్చు. ఉద్యోగం కొందరకు సమకూడే అవకాశం ఉన్నది. స్త్రీలకు : నూతనంగా ఏ రంగంలో చేసే ప్రయత్నాలైనా ఫలిస్తాయి.

★మిధునం : దూర దేశాన్నుండి బాగా కాలవసిన వారు, ఆత్మీయులు యిల్లు చేరగలరు. మీకు నాలుగు విధాలా సహాయం చేకూరగల వారం. రాజకీయంగా కొందరకు సదవకాశా లుంటాయి. గ్రహించాలి. స్త్రీలకు : నూతన విషయాలు తెలిసికోవటం, నూతన విధాల ఆదాయం చేకూరటం కలదు.

★కర్కాటకం : మీకు ఏ పరిశ్రమలో చొరవ ఉంటే అది సఫలం కాగలదు. మీకు రాజకీయంగా అనుకూలతకు ఈ వారం రోజులు ఉపకరిస్తాయి. అదృష్టం తరిమినట్లుగా శుభ సూచనలుంటాయి. స్త్రీలకు : ధన విషయంలో, వృత్తిలో, ఉద్యోగంలో సుగమమైన వారమే.

★సింహం : బంధు మిత్రులతో విరోధం రావచ్చు. కావలసినవారు దూరం కావచ్చు. ఏవేవో లేనిపోని సంకటాలకు దారి తీయగల సన్నివేశాలుంటాయి. పోయిన వస్తువుల భోగట్టా తెలియగలదు.. స్త్రీలకు : అప్రయత్నంగా ధన లబ్ధి, ఆశించిన వ్యవహారాలలో అనుకూలత చేకూరగల వారం.

★కన్య : మీకు ఉద్యోగంలో అనుకూలత సంభవింపకుండా చూచుకోవాలి. అయిన వారితో తగాదా తంటాలు రాకుండా చూచుకోవాలి. నూతన విషయాలు తెలిసికొనే అవకాశం గల వారం. స్త్రీలకు : కొందరకు శుభం జరగటం, కొందరకు ఉద్యోగ ప్రయత్నాలు సఫలం కావటం గమనించదగిన అంశాలు.

★తుల : నాలుగు విధాలా మేలు చేకూరగల వారం. ఏమయినా ఎంత ధనం చేతికందినా, చెప్పరాని విధాన ధనం వ్యయం కావటం కూడా గమనించగలరు. ఉద్యోగంలో అభివృద్ధిని ఆశింపరాని వారం. స్త్రీలకు :వస్తు, వస్త్ర, వాహనం, అమూల్య వస్తు సేకరణకు అవకాశం.

★వృశ్చికం : మీకు బాగా అనుకూలంగా ఉన్న వారు ప్రతికూల పక్షం వహించగలరు. మీరు నిత్యకృత్యంగా చేసే ప్రయత్నాలు ఫలవంతం కావు. మీకు అనవసరంగా నింద నెత్తికెక్కే మార్గమున్నది. బాగా శాంతంగా మెలగాలి గదా! స్త్రీలకు : రాజకీయంగా తృప్తికరం కాకపోయినా ఉద్యోగ రీత్యా మేలున్నది.

★ధనుస్సు : ఎంత కృషి చేస్తే అంత మేలున్నది. ఎంత విదానంగా పనులకు దిగితే అంత అనుకూలత చేకూరనున్నది. ఆదాయం కూడా స్వల్పంగా కనిపించికపోదు. అన్ని రంగాలలో అనుకూలత సాధింపనైన వారమే. స్త్రీలకు : ప్రతి విషయంలో చొరవ ఏర్పడుటకు, ఆదాయం కనిపించుటకు మేలైన వారం.

★మకరం : అన్ని విధాలా మేలు జరిగే వారం. స్థిర చరాస్తులు స్వల్పంగా అభివృద్ధి నందగల వారమే. రచనా విధానంలో ప్రావీణ్యత గల వారికి సదవకాశాలు లభించగలవు. స్త్రీలకు : సుఖసంపదలు, రాజకీయంగా కొందరకు మేలు జరగటం గమనించాలి.

★కుంభం : సులభంగా ఒకా వొక వ్యవహారం సమకూడి, అందు మూలాన లాభించే మార్గం, అవసరాలు తీరే మార్గం ఏర్పడ గల వారం. చాల మందికి చిన్నవో పెద్దవో ప్రయాణాలు తగులుతాయి. స్త్రీలకు : యత్న కార్యానుకూలతకు అవకాశం, స్వల్పంగా ఆదాయం చేకూరగల వారం.

★మీనం : సజ్జన గోష్ఠి, అభిమానులతో సంప్రదింపులు, ఆదాయంలో అభివృద్ధి, కొందరకు రాజకీయంగా మేలు చేకూరే అవకాశం కలగటం గమనింపదగిన అంశాలు. వ్యాపారంలో కూడా ఆశించిన సత్ఫలితాలు అందుకొనుటకు అవకాశం గల వారమే. స్త్రీలకు : ధన లబ్ధి, పరోపకారతకు అవకాశం, ఉన్నత విద్యార్జన ప్రయత్నాలకు అవకాశం గల వారమే.

—విద్వాన్ కోట సత్యరంగయ్య శాస్త్రి *



అవే లక్షణాలు, అయితే రూపం కొత్తది!

క్యాడ్‌బరిస్ బోర్న్‌విటా ఇప్పుడు ఆకర్షణీయమైన ప్యాక్‌లో!

మీ కుటుంబానికంతటికి నచ్చే మజా రుచితో, కోకో, మాల్ట్, పాలు, పంచదార గల ప్రకృతిలోని మంచి లక్షణాలతో, మీకు యిష్టమైన అదే బోర్న్‌విటా-యిప్పుడు కొత్త, ఆకర్షణీయమైన ప్యాక్‌లో!

త్వరపడండి. కొత్త డబ్బా లేదా కొత్త రీఫిల్ ప్యాక్‌లో గల క్యాడ్‌బరిస్ బోర్న్‌విటా తీసుకోండి. బోర్న్‌విటా తయారుచేసుకోండి, తాగండిక.



OBM/7833-TEL.

క్యాడ్‌బరిస్ బోర్న్‌విటా

సీరియల్

కాలం కరిగాక

వలివేటి నాగచంద్రావతి

(గత సంచిక తరువాయి)

ఒక రోజున ఆ సమయమూ వచ్చింది.

ఆ రోజు రాత్రి వాడుక ప్రకారం చీకటి చిక్కబడనిచ్చి అభిసారికలా మురళి దరిచేరింది సోఫియా.

కిటికీ తలుపులన్నీ బంద్‌చేసి తలుపులతోపాటు లోకం కళ్లు కూడా మూసాననే భ్రమలో ఆమెను తమకంగా దగ్గరకు తీసుకున్నాడు మురళి

"మన మీ దాగుడు మూతలిక కట్టిపెట్టాలి." అన్నది సోఫియా అతని కౌగిలికి ఒదుగుతూ.

వాంఛలోని గాఢతను అందుకోబోతున్న మురళి మరో లోకాన ఉన్నట్టుగా, "ఏమిటీ?" అన్నాడు మత్తులో.

"మనం తొందరగా పెళ్లి చేసుకోవాలి డాక్టరు గారూ! ఈ చాటుమాటు ఇంక చాలించుకోవాలి." అన్నది సోఫియా మరోసారి, తన మాట అతనిపై ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తుందో ఊహిస్తూ

నిజమే ఎదురుచూడని ఈ హెచ్చరింపుకి మైమరపులో వున్న మురళి ఒక్కసారిగా ఎవరో గట్టిగా కుదిపినట్టయాడు.

"పెళ్లా?" అంటూ తెల్లబోయాడు. అతని కోరికలోని బిగి కరిగి, కౌగిలి బిగి సడలింది.

"అంతలా ఆశ్చర్యపోతున్నారేమిటి? మనపెళ్లి ఎంత త్వరగా జరిగితే అంత మంచిది. ఇప్పటికే గుసగుసలు రేగాయి. ఇంకా ఆగితే నేను నలుగురిలో తలెత్తుకోలేను." అన్నది సోఫియా, ఇదంతా నీ మూలాన్నే అన్నట్టు గునుపుగా, సడలిన కౌగిలిని తిరిగి తను బిగిస్తూ

చటుక్కున సోఫియాని వదిలేశాడు మురళి. "నా కలాంటి ఉదేశ్యం ఎప్పుడూ లేదు నీకామాట నే నెప్పుడూ ఇవ్వనూ లేదు" అన్నాడు తెచ్చుకోలు గాంభీర్యంతో మొహం గంటుపెట్టుకుని.

కేవలం తనమీద అతనికి రాగరహితమైన కాంక్ష ఒక్కటే అన్నది తెలీంది కాదు సోఫియాకి అయినా అదే విషయం కుండబద్దలు కొట్టినట్టు నిర్ధారణగా మురళి ముఖతా వివరావడం ఆమె అభిమానాన్ని గాయపరిచినట్టయి చిన్నబోయింది మనసు గొంతులో రోషం వుప్పెనగా పొంగింది

"మరెందుకు చేశారు నాతో ఈ స్నేహం?" ఉక్రోషంతో నిలేసింది అతన్ని

దులువుకుపోయే మార్గాలు వెతుకులాడేదు మురళి మంచం మీంచి లేచి అద్దం ఎదటికివచ్చేదు అనుభవాల గడింపులో మనసు మోట పడింది తప్ప ఆ ఛాయలు ముఖాని కంటలేదు లేతగా అమాయకంగా నవనవలాడుతూనే ఉన్నదది.

మురళి ధైర్యం పుంజుకున్నాడు 'ఏం చెయ్యగలదీ సోఫియా?'

"నువ్వే నా స్నేహం అభిలషించావు ముందర ప్రవరాఖ్యుణ్ణి, తృతీయా ప్రకృతినీ కాను గనక కాదనలేకపోయాను అ ది నా తప్పంటావా?" అన్నాడు తనని సమర్థించుకుంటూనూ, నేరమంతా ఆమెపైనే ఆరోపిస్తూనూ.

"నే ననుకున్నది వేరు. మీరు నా మనుషులనీ, నేను మీ కాబోయే భార్యననీ భావించే వన్నప్పగించుకున్నాను" ఈ మాట ఎంతో అభిమానంగా, నిజాయితీగా అన్నది సోఫియా.

"నువ్వేలా అనుకున్నావో నా కనవసరం. నిన్ను పెళ్ళిచేసుకునే ఉద్దేశ్యం నాకు లేనేలేదు" దురుసగా అన్నాడు మురళి

"లేదంటే కుదురుతుందా? నాకిప్పుడుమూడవ నెల" తాపీగా అన్నది సోఫియా.

పదార్థం నోటి విందుగా వున్నప్పుడు పొలమారినట్టు ఉక్కిరి బిక్కిరవుతూ, "ఆ. ." అంటూ నోరావలించేడు మురళి.

"అందుకే చెబుతున్నాను. ఈ సంగతి మా అన్నకి తెలిసిందంటే చాలా గొడవవుతుంది. ఎవరికీ తెలియకముందే మనం వివాహబద్ధులం కావాలి" 'నీ మేలు కోరే సుమా ఈ సలహా' అన్నట్టు మొహం పెట్టింది సోఫియా.

"ఉహూ. అది అసంభవం" మురళి మొహం వివర్ణమయింది

"అసంభవమా? మరి నా బతుకునేం చేద్దామనుకుంటున్నారు?" సోఫియా స్వరం షడ్జమ స్థాయిని దాటింది

'చీకటి వేళ వూరూ నాడూ నిద్రవశమై వుంది ఈ కేకలకి నలుగురూ లేచి వింటే నో' చెమటలు పట్టాయి మురళికి

"అంత గట్టిగా మాట్లాడకు దయచేసి నీకు ఎంత కావాలన్నా డబ్బిస్తాను మందులు రాసిస్తాను ఎబార్షనయిపోతుంది నా మాట విను" అంటో కాళ్లబేరానికి వచ్చేశాడు

సోఫియా చలించలేదు మదురు చిట్లించి తల అడ్డంగా వూపింది

"వీల్లేదు ఆ బిడ్డ నాక్కావాలి." అన్నది అతనివంక నిరసనగా చూస్తూ "మీ మగబుద్ధి పోనిచ్చుకున్నారు కాదు మీకు ఆనందానుభవ మొక్కటే చాలును నేనాడదాన్ని నాకా ఆనందపు ప్రతిరూపం కూడా కావాలి మీరు న్యాయం ఆలోచించండి డాక్టరుగారూ – లేకపోతే నేను మా అన్ననే ఆశ్రయించాలిసొస్తుంది." అన్నది.

మురళి గుండె వేగంగా కొట్టుకుంటోంది. "ఇప్పుడు మీ అన్న సంగతెందుకూ?" అన్నాడు తడబాటుగా.

"మీరు సజావుగా నాతో పెళ్లికి అంగీకరిస్తే మా అన్న జోక్యం మనమధ్య వుండదు. లేకపోతే అతను రంగంలోకి దిగక తప్పదు. మా అన్న పనే తప్ప మాటలతో చెప్పదు – తరవాత మీ ఇష్టం" బెదిరింపుగా అని లేచింది సోఫియా.

నోట తడి ఆరి మాటలు రాక కళ్లప్పగించి నిలుచుండిపోయిన మురళిని ఆ అవస్థలోనే వుంచి, తేల్చుకునే వంతు అతనికే వదిలి వెళ్లిపోయింది సోఫియా.

తల తిరిగిపోతోంది మురళికి. ఈ మాదిరి పరిస్థితి ఎదుర్కోవాలిసొస్తుందని కల్లోకూడా అనుకోలేదతను

తను అనుకున్నది వేరు. వాడకట్టు వదిన; నలుగురితోపాటు ఆఘ్రాణించి వదలవచ్చునని అనుకున్నాడు అదీ ఉచితార్థంగా కాదు – చీర అంటే చీర, వాచీ అంటే వాచీ, ఆమె ఏది కోరితే అది కాదనకుండా సమర్పిస్తూనే వున్నాడు ఆమె అందించే సౌఖ్యానికీ ఈ చిరుకానుకలతో ఎప్పటి కప్పుడు చెల్లువేసేస్తూనే వున్నాడు మరి సరదాకు చెయివేస్తే శాశ్వతంగా అతుక్కుపోయినట్టు ఇంకా ఏమిటీ తంటసం తనకి.

మురళి అస్తిమితంగా పీలవుతూ సిగరెట్ వెలిగించి పచార్లు చేయసాగాడు

● అన్నో రౌడీ అట. ఈ శూర్పణఖ వెళ్లి తనమీద కతన్ని ఉసిగొల్పుతుంది కావును. అల్లరి పెడతాడేమో? అంతటితో పోనిస్తే అదృష్టమే కాలూ చెయ్యీ విరిచేస్తే ఎవరు గతి ఇక్కడ తనకి?

జరిగిన కథ–11 : కేశవరావ్, కామేశ్వరమ్మగార్ల ఏకైక పుత్రుడు మురళి – రంగనాథం, రాజ్యలక్ష్మమ్మగార్ల ఆఖరి సంతానం మీనాక్షిని మాయమాటలతో మోసపుచ్చి తన కోర్కెను తీర్చుకొంటాడు గర్భం పోగొట్టటానికి చేయించిన నాటు వైద్యం మీనాక్షి ప్రాణాల్ని హరిస్తుంది. రంగారావుగారి ఏకైక పుత్రిక హిమబిందు మనసులో స్థానాన్ని సంపాయిస్తాడు మురళి ఫ్రెండ్ రామకృష్ణ స్కూటర్‌మీద ఎక్కి అతన్ని అనుకొని కూర్చున్న బిందును చూసిన మురళి ఆమెను తీవ్రంగా విమర్శిస్తాడు. ఆ తరువాత వారిద్దరు విడిపోతారు. మురళి ఓ పల్లెటూర్లో గవర్నమెంట్ డాక్టర్‌గా పనిచేస్తుంటాడు. వయసు తాకిడికి తట్టుకోలేక అక్కడే నర్స్‌గా పనిచేస్తున్న సోఫియాతో కోర్కెలు తీర్చుకుందామనే దురుద్దేశంతో పొత్తు పెట్టుకొంటాడు సోఫియా మరో ఉద్దేశ్యంతో అతనికి తన సర్వస్వాన్ని అర్పించడమే కాకుండా ప్రచారం కూడా చేస్తుంది. రౌడీగా చలామణీ అవుతున్న అన్న థామస్‌కు తన పథకం వివరిస్తుంది.

ఎవరితో చెప్పుకోవాలి ? తను ఇక్కడికొచ్చి ఎన్నాళ్లో కాలేదయ్యే — కష్టం చెప్పుకునేటంత సన్నిహితు లెవరున్నారని? చెప్పుకున్నా ప్రయోజనం వుండదేమో? 'నీతోపాటు మా కీళ్ళూ విరిచేస్తాడు, వాడి జోలికి వెడితే' అని తప్పించుకుంటారేమో ? లేకపోతే కోరి ఎవరుమటుకు తనకు మద్దతొచ్చి అటువంటి గూండా మనిషితో విరోధం తెచ్చుకుంటారు ?

చఛ ఇవన్నీ ఈ సోఫియాతో సంపర్కం అంటించుకోకముందే ఆలోచించుకోవాల్సింది ఎంత పొరపాటు జరిగిపోయింది

ఏమిటో కాలేజీ ఆడపిల్లల వెంటపడేటప్పు డయితే ఆ పిల్ల వెనకన తను చేసే అల్లరికి ప్రతిఫలంగా దేహశుద్ధి చేయగల అన్నగార్లు లేరుగదా అని పొరజూసుకోవాలి అంతేగానీ ఒక ఆడదానికి ఒక మగవాడు అనే నియమం లేని మనిషితో మెలిగేటప్పుడు కూడా ఆ వెనకా ముందూ చూపు వుండాలనేది తోచుబాటు కాలేదు

కాకపోతేమటుకు పదిమందితో చేయి కలిపి చెడిన మనిషి నా దగ్గరి కొచ్చేసరికి ఈ దబాయిం పేమిటి? ఈ బలాత్కారమేమిటి? ఈ గొప్పేమిటి? కావాలని కథ నడిపి చేస్తూన్న తంత్రం కాకపోతే

మురళి చివరంటా కాలిన సిగరెట్ పీకని కిటికీ లోంచి బయటకు గిరాటేసి ఉస్సురంటూ పడక్కు ర్చీలో కూలబడ్డాడు

ఏం చెయ్యటమిప్పుడు? ఆ అన్నకి దడిచి సోఫి యాని పెళ్లాడ్డమా? రామ రామ కులం, మతం మాట అటుంచు, ఆదర్శం అని పోజు పెట్టచ్చును కానీ చూమ్తూ చూస్తూ తిరుగుబోతు అని పేరు గడించిన ఆడదానికి పుస్తె ముడెయ్యటమెలాగు?

"నెనే మెరగను నేను వాళ్లకి అందలేదన్న అక్కసుకొద్దీ వేసిన నిందలు అవన్నీ" అంటుంది సోఫియా ఆ మాటలో నిజమెంతో ఎవరికి తెలు సును? తను నిజమే ననుకుంటే మాత్రం అందరూ నమ్మవద్దూ! పడినవాడు పచ్చబొట్టు లాంటిది అది మాసిపోతుందా ?

'ఫలాని డాక్టరు పెళ్లాం పూర్వాశ్రమంలో చిలక్కొట్టుడు పండు ' అని చెప్పుకుంటే తనకెంత నామర్దా, ఎంత తలవంపులు ?

లోకం మాట అటుంచి శీలం విషయంలో అనుమానాస్పదమైన ఒక స్త్రీని పవిత్రమైన అర్ధాంగి స్థానంలో నిలుపుకోవట మెలాగు ? జీవి తాంతం ఈ అగ్గిని గుండెల్లో భరించడమెలాగు ?

తలమీద సమ్మెటలతో మోదుతున్నంత బాధ

మురళి భరించలేనట్టు రెండు చేతులతో తలని అదుముకుంటూ వెనక్కి వాలిపోయేడు

'అయ్యో! ఇప్పుడు తననీ స్థితిలో ఆదుకునే వారెవరు?' తటాలున తల్లి జ్ఞాపకమొచ్చింది మురళికి 'అవును అమ్మ ఇప్పుడే గనక వుంటే ఏదో ఉపాయం చూసేది ఏదో అడ్డంవేసి తనని రక్షిం చేది వెళ్ళిపోవాలి అమ్మ దగ్గరికి పారిపోవాలి ఆవిడ రక్షణలో తలదాచుకోవాలి '

మురళి తటాలున లేచేడు టైము చూశాడు ఇంకొక గంటలో తన వూరివైపు వెళ్లే రైలువుంది ఇక్కణ్ణించి తప్పించుకోడానికి మిగిలిన ఒకే ఒక ఛాన్స్ ఇది. మురళి చకచక విలువైన సామాన్లూ, బట్టలూ మటుకు సూట్‌కేస్‌లో సర్దుకున్నాడు పద్దు చెయ్యకుండా స్టేషన్ దారి పట్టాడు

కడుపులో ఏదో అలజడి ఎవరో తరుము కొస్తున్న భ్రాంతి వెనక్కి వెనక్కి చూసుకుంటూ ఎంతకీ తరగని దూరాన్ని ఎలాగో నడిచి ఎట్లా అయితేనేం స్టేషనుకి చేరుకున్నాడు

రైలు రాడానికింకో పది నిమిషాల వ్యవధి మాత్రం వుంది టికెట్టుకొని ప్లాట్‌ఫారమ్ మీద చీకటిగావున్నచోట నించుకున్నాడు రైలు సరైన టైముకే వచ్చింది దాన్ని చూస్తే తనని ఆదుకునే ఆపద్బాంధవే అనిపించింది మురళికి

'అమ్మయ్య! ఇందులో ఎక్కేస్తే గండం గడిచినట్టే '

మురళి సూట్‌కేస్ పుచ్చుకుని గబగబ నడుస్తూ నాలుగయిదు 'పెట్టెల్లోకి తొంగిచూశాడు తెల్లవార టానికింకా ఝాము పొద్దున్నది పెట్టెలలో జనమంతా ఎక్కడివాళ్లక్కడ ఒరిగి కునుకుతున్నారు కాస్త జాగాకూడా కనబడలేదు మురళికి

'అసలే చిన్నస్టేషను రైలు ఎక్కువసేపు నిలవదిక్కడ జాగారం చేస్తే మాట దక్కదు ముందు ఏదో పెట్టెలో ఎక్కేస్తే నెంపాదిగా చోటుమాట చూసుకోవచ్చును ' అనుకుంటూ ముందున్న కంపార్టుమెంటులో ఎక్కబోయి సర్ప దర్శనమయినట్టు ఉలిక్కిపడ్డాడు మురళి

మెరుపులా వేసిన అడుగు వెనక్కి తీయబోయేడు గానీ అప్పటికే మించిపోయింది



కాలం కరిచాక

బలమైన చేత్తో మురళి భుజాన్ని పట్టి ఆపాడు థామస్. "ఎక్కండి డాక్టరుగారూ మీకోసమే చూస్తున్నాం ఈ పెట్టె మందే ముందు స్టేషన్‌లోనే మనకోసం రిజర్వు చేయించేం లెండి." థామస్ ఒకపక్క బుగ్గ పొంగించి నవ్వుతున్నాడు, 'నీ జాతకం నాకు ముందే తెలుసును' అన్నట్టుగా

మురళి గజగజలాడుతూ లోపలికి వెళ్ళాడు థామస్ సహచరుల్లో పదిమందీ, సోఫియా కూడా ఉన్నారందులో

నవనాళ్ళూ కృంగిపోయాయి మురళికి

ఇక అతని ఇష్టాయిష్టాల ప్రమేయం ఏమాత్రం లేకుండానే ఆ తరవాతి పనులు చకచక జరిగిపోయాయి

వాళ్ళు రమ్మన్నచోటకల్లా, ఆ పదిమంది మధ్యనా అపరాధికిమల్లే పిల్లిలా వెడుతున్న సమయంలోనూ, చర్చిలో ఫాదర్ ఏవేవో చదువుతూ పవిత్ర జలమంటూ తాగిస్తున్న క్షణాల్లోనూ, రిజిస్ట్రాఫీసులో థామస్ పులిలా పక్కనే వుండి సంతకాలు పెట్టిస్తున్నప్పుడూ మురళిపైకి ప్రశాంతంగానే వున్నట్టనిపించినా లోలోన ఎంతగానో పరితపించాడు

తల్లిని తలుచుకున్నాడు, బిందుని తలుచుకున్నాడు, ఆఖరికి మీనాక్షిని కూడా తలుచుకున్నాడు 'అయ్యయ్యో ఒక అమాయకురాలి గొంతు కోశాను ఓ ప్రేమయిక హృదయంలో చిచ్చురగిల్చాను ఇంకా ఇంకా పైకి పాకి ఆకాశంలో వున్న అందలాలేవో అందుకోవాలని నిచ్చనలు వేసి దొరికిన సౌభాగ్యాన్ని కాలనెట్టాను

ఇప్పుడేమయ్యాను ? మరులుగొలిపే రూపు లేదు, మెచ్చదగ్గ గుణం లేదు, ఘనమైన సాంప్రదాయం లేదు, సమాన ఫాయా కాదు. టక్కరితనం మాత్రం పుష్కలంగా వున్న ఈ సోఫియా నన్నూ తానుండే మురిగ్గుంటలోకి ఈడ్చుకుపోతూంటే గుక్కిళ్ళు మింగుతూ చేతకానివాడిలా వెంట నడిచి పోతున్నాను.

'అయిపోయింది వెయ్యి జీవాల్ని తిన్న రాబందు ఒక్క గాలివానతో కూలినట్టయింది నా గతి నాకు ముక్తి లేదిక ' అనుకుంటూ కుమిలిపోయాడు

* * *

మనిషి జీవిత ప్రాంగణంలో నిలబడి తానెన్నుకున్న మార్గాన పయనించబోతూ ఎన్నో అనుకుంటాడు కలలు కంటాడు ముందు ముందు ఆ బాటలో పువ్వులు పరుచుకోవాలని, విశాలం చేసుకోవాలనీ, స్వంతమే చేసుకోవాలనీ—ఇలా ఇలా .. ఇంతలో విధి అతన్ని సుడిగాలిలా చుట్టేసి ఎదురు చూడనీ, ఆశించనీ దుర్గమమయిన మలుపుల్లో అతన్ని దిగవిడిచి, దిక్కుతోచక దిగ్భ్రాంతిగా నిలుచుండిపోయిన అతన్ని పరిహాసంగా చూస్తూ నిష్క్రమిస్తునది. దాని వేడుక అది

ఈ అల్ప మానవుడేం చెయ్యగలడు ? కాస్త చేవగల్లవాడయితే అదే సవాలుగా తీసుకుని విధి విధానాన్ని ఎదిరిస్తూ, ఎదురు దెబ్బలు తగులుతోన్నా,

తంబొప్పెలు కడుతోన్నా లక్ష్యపెట్టక తమ బయలు దేరిన ప్రోవకోసం వెతుకులాడుతోనే వుంటాడు.

ఆ సాహసమూ, తెగువాలేని సగటు మానవు డయితే ఏటి కెదురీదలేక తలఒగ్గి అందిన జీవితానికే అలవాటు పడిపోతాడు.

మురళి పరిస్థితులలో రాజీపడిపోయాడు. డాక్టరయివుండీ ఖర్మ సిద్ధాంతమే అన్నిటికీ మూల మన్న నిర్ధారణ కొచ్చేసి నా ప్రాప్తమింతే అను కున్నాడు విరక్తితో.

అయితే ఆ నిర్లిప్తం, అతననుకుంటున్నట్టు ఎవరి లలాట లిఖితం ప్రకారం వారికి జరుగుతుందన్న ఆలోచనా, వివేకం వూళ్ళో వాళ్లకి లేకపోయాయి.

సోఫియాతో దాంపత్యాన్నయితే ప్రారబ్ధం అని సరిపుచ్చుకోగలిగేడుగానీ, యజ్ఞానికయి మేక అనుకుని వల్లకుక్కని మోసుకుపోతున్న వెర్రి బాపడిని చూసి నట్టు కొందరు తనని కళ్లతో వెక్కిరించినట్టు చూడ్డం, ఇంకొంతమంది తేనె జాడీలోపడి వెళ్లి ఆ జిగురు కాళ్ల కంటుకుపోయి విలవిల్లాడుతున్న ఈగని చూసినట్టు జాలిగా చూడ్డం మురళి భరించలేకపోయాడు.

వెంటనే నాలుగు నెలలు శెలవు పెట్టేశాడు. సోఫియాని తీసుకుని నాలుగు వూళ్ళూ చుట్టేశాడు. తిరిగి వచ్చేసరికి రాష్ట్రం చివరన ఓ మారుమూల ప్రాంతానికి బదిలీచేసినట్టు ఆర్డర్సు వచ్చివున్నాయి. ప్రాణం లేచొచ్చినట్టయి బ్రతుకుజీవుడా అను కున్నాడు.

ఇలా మరో వూరికి మారుతున్నానని ఉత్తరం రాశాడు మురళి తండ్రికి. తన రాక్షస వివాహం సంగతి మాత్రం వాళ్లకి తెలియనీయలేదు.

అది ఏమంత కీర్తికరమైన విషయం గనక అని తనంతట తను బయటపెట్టుకోడానికి నామోషీ పడ్డాడతను. దానంతట అది బయటకొచ్చినప్పుడే రానీమని ఊరుకున్నాడు.

అదీ ఆలస్యం కాలేదు. కొడుకు ఉత్తరం చూసుకుని పరిగెత్తుకొచ్చారు కేశవరావుగారు.

నాలుగు నెలలయి కొడుకు క్షేమ సమాచారాలు తెలీటంలేదు ఒకటి; దానికితోడు 'ఫలానా వూళ్ళో, దగ్గర ఓ పిల్లని వెంబడేసుకుని మీ అబ్బాయి షికార్లు కొడుతోండగా చూశామంటొ' ఎవరో ఎవరో, నామస్తే నామస్తే వూతోన్న నీలి వార్తలు; దానికే ఏమిటా అని బెంబేలెత్తుతోంటే ఎక్కడో దండ కారణ్య మధ్యంలోకి విసిరేశారన్నట్టు దూరానికి ట్రాన్సఫరయినట్టుగా ఇప్పుడీ వార్త.

కామేశ్వరమ్మకి భర్తని బయలుదేరదీసిందాకా ప్రాణమాగలేదు

డాక్టరుగా ఒక హోదా వెలిగిస్తున్నవాడు; ఐదేళ్లబట్టీ ఉద్యోగం మిడుకుతూ పెద్దమనిషి తరహా ఒంటబట్టించుకొన్నవాడు ఇంకా చిన్నంతరంగా అల్లరి చిల్లరగా ప్రవర్తిస్తాడని అనుమానించడం భావ్యంకాదని ఒకపక్క భార్యని మందలించే బయలు దేరినా కేశవరావుగారి మనసు సందిగ్ధంగా వూగులాడుతూనే వున్నది

ఏమో ఆ కృష్ణభగవానుడి పేరు పెట్టినందుకు చిన్నప్పటినించీ ఆ లీలలు చూపిస్తూనే ఉన్నాడు. పుట్టుకతో పుట్టినబుద్ధి ఇప్పుడు మాయమవు తుందనేమిటి? పైగా బ్రహ్మచారి వంద కోతులతో సమానమన్నారు మేమూ దూరాన ఉన్నాము. లంక తగలేసే పనులు ఏం చేస్తున్నాడో ఏమో? విప్ప లేందే పొగవస్తుందా? మళ్లీ ఏ లవ్ ఎఫైర్‌లో పడ్డాడో? లేకపోతే తప్పుడు దార్లేమన్నా తొక్కు తున్నాడా? లేక ఇదంతా 'అదిగో పులంటే, ఇదిగో తోక అనే లోకం ఆల్లేకల్పనా? మధ్యలో అర్ధంతరంగా ఈ బదిలీకి కారణమేమిటి? అనుకుంటూనే వెళ్లారు ఆయన.

తీరా వెళ్లాక, ఇంత కడుపెత్తు పెట్టుకుని సోఫియా కొడుకెంట దర్శన మిచ్చేసరికి తెల్లవారు ఝూమున కన్న దుస్వప్నం యదార్థంగా రూపుకట్టి ఎదట నిలిచినట్టు బిగుసుకుపోయారు కేశవరావు గారు.

మురళి క్లుప్తంగానే అయినా స్పష్టంగా విప్పి చెప్పాడు తండ్రికి తన పరిస్థితి.

తను గడవని గండంలో పడిపోయాడు. పులి లాంటి థామస్ తీక్ష్ణదృష్టి నించి తను తప్పుకో గలగడం అసాధ్యం. అతన్నిగానీ, అతని చెల్లెల్నిగానీ, ఏమార్చాలన్న వూహ మనసులో మెదిలినా చాలును. తను ప్రమాదంలో పడ్డం తథ్యం. థామస్ అన్నాడు తనతో—"కీళ్ళు విరిచి వూపిరి తీసేసి కేసులేకుండా మాఫీ చేసుకోగలను. ఒకవేళ తప్పివచ్చి ఉరికంబ మెక్కవలసివొచ్చినా వెనక్కి తగ్గే వాణ్ణికాను" అని. అంతటివాడే అతను. బ్రతుకు రిస్కులో పెట్టగల ధైర్యంలేదు తనకి

అప్పీలులేని సుప్రీమ్ కోర్టులో యావజ్జీవ ఖైదీగా శిక్షపడినవాడిలా నిస్పృహలోపడిన కొడుకుని, జీవితంలో వేయబోయిన తొలిఅడుగే తప్పటడుగయి సరిదిద్దుకోలేని ఆ పొరపాటుతో ఘోరంగా దగాపడి నిరాశలో మునిగిపోయిన కొడుకుని చూస్తూ చేయందించలేని నిస్సహాయస్థితిలో ద్రవించిపోయేరు కేశవరావుగారు

పదిలంఖణాలు చేసినట్టు నీరసంగా ఇంటికి మరలారు కేశవరావుగారు

భర్త నిర్వికారంగా చెబుతున్న విషయం విని నడుములు విరిగినట్టయి కూలబడిపోయి ఘొల్లుమన బోయేదల్లా "నోరెత్తకు. రచ్చచేసుకోవడటం మనకే చేటు. ఎదిగిన ఆడపిల్ల వున్నది వంశంలో వర్ణ సంకరం వున్నదంటే రేపుదానికి సమంధా లెక్కవు" అన్న భర్త హెచ్చరికకి గొంతు నొక్కుకు వూరు కున్నది కామేశ్వరమ్మ

గొంతెత్తి ఏడ్వడానికిగ్గూడా వీల్లేక లోలోపలే దిగ్గ్రళ్లవలిసిన సందర్భాలుంటయ్యని అప్పుడే విశద మయింది ఆవిడకి.

* * *

కాలం రెక్కలు కట్టుకు పరుగెడుతోంది నాలుగు కాలెండర్లు పాతవయినై.


ఆరోజు కేశవరావుగారి ఇల్లు మండిగాలకి పసుపు కుంకుమలతో, గుమ్మాలు మామిడి తోరణాలతో, గలగలలాడే బంధుజనాలతో అలంక రించుకుని పట్టుచీర కట్టుకున్న పెద్ద ముత్తయ్ దువులా కలకల్లాడుతోంది.


వసంతలక్ష్మిని పెళ్లికూతుర్ని చేస్తున్నారావేళ.

వివాహ ముహూర్తానికయితే ఇంకా నాలుగు రోజుల వ్యవధి వుంది. మంచిరోజు కుదరకపోవటాన ముందరగానే పెళ్లికుమార్తెను చేయాలిసొచ్చింది.

పెరట్లో వసంతలక్ష్మికి అభ్యంగన స్నానం చేయించే ప్రయత్నం జరుగుతోంది. భగభగ మండే పొయ్యిమీద పెద్ద కాగుతో నీళ్లు కాగుతున్నాయి. గుండ్రాయితో కుంకుడుకాయలు కొట్టి గిన్నెలో వేస్తోంది సుబ్బాయమ్మ.

సుబ్బాయమ్మ కామేశ్వరమ్మకి వేలువిడిచిన ఆడబడుచవుతుంది. ఆవిడ విధవురాలు; వెనకన





పిల్లామేకా కామాటం లేకపోటం, జబ్బు సత్తువ మాత్రం మస్తుగా వుంటంవలన తల చెడినప్పట్నించీ బంధుగులపాలిటి కావిడ ఆపద్బాంధవురాలు. వారి వారి ఇళ్లల్లో ఏ విధమైన ఇబ్బందులొచ్చినా, ఏ రకమైన అక్కరలొచ్చినా అవి ఆవిడ లేందే వెళ్లమారవు ఇప్పుడూ అలానే పెళ్లి పన్లకి కామేశ్వరమ్మకి సాయితాగావుంటుందని కేశవరావుగారు వారం రోజుల క్రితం ఆవిణ్ణి పిలిపించారు

స్నానానికి ముందు, "అమ్మ కడుపు చల్లగా— అత్త కడుపు చల్లగా —" అని దీవిస్తూ కుమార్తె తలమీద నూనె పెడుతున్న కామేశ్వరమ్మ ఏవేవో తలపుకు వచ్చి కళ్లు ఒత్తుకున్నది

తొలిచూలు బిడ్డ, ఒక్కగానొక్క కొడుకు, వాడి వివాహం కూడా ఇలాగే తన చేతులమీద అంగరంగ వైభవంగా జరిపించాలని కలలు కన్నది కొడుకు జాతకానికి మహర్దశ ఎత్తించాలని ఎన్ని వ్యూహాలో పన్నింది విధి అనుకూలించక వెక్కిరించింది ఏ ఒక్కటీ సానుకూలపరిచింది కాదు తన కలలన్నీ ఆకాశ హర్మ్యలే అయ్యేయి

కంట చూడకుండానే కొడుకు పెళ్లి అయింది, కోడలూ వచ్చింది, మనుమలూ వెలిశారు ఏం లాభం? ఇలాగా అని పైకి చెప్పుకునే భాగ్యం లేకపోయాక!

ఇంట జరిగే మొదటి శుభకార్యం కోడలుండీ తన భుజం కాచే దిక్కు లేకపోయింది మనవలుండీ నట్టింట నడయాడే యోగం లేకపోయింది. ఏమి దురదృష్టం తనది!

ఒత్తుకున్నకొద్దీ వూరేయి కామేశ్వరమ్మకి కన్నీళ్లు

ఆవిడ కంట తడిపెట్టడం చూసి, "చాల్లేవమ్మా శుభమా అని నెత్తిన నూనె పెడుతూ ఏమిటమ్మా ఆ దుఃఖం? తప్పు వూరుకో." అంటూ మందలించింది సుబ్బాయమ్మ.

"ఏమిటో — అబ్బాయిమీదికే పోతోందమ్మా మనసు తోడబుట్టినవాడు వాడొక్కడేనా — వాడుకూడా లేకుండాపే" ఆవిడన్న మాటకి జవాబిస్తూ గొంతులో దుఃఖం వుండలా అడ్డుపడటంతో పూర్తిచెయ్యలేక ముక్కెగబీలుస్తూ దిగులుదిగులుగా చూస్తూండిపోయింది కామేశ్వరమ్మ.

"బాగుందమ్మా! దూరాభారమా — ఒకళ్లకి రెక్కలమ్ముకున్నాడా—వాడికక్కడేమి ఇబ్బందులడ్డం వచ్చి ఆలస్యం చేస్తున్నాడో? రాకమానుతాడా — వస్తాడూ— ఇవాళో రేపో —" దీర్ఘాలు దీస్తూ కామేశ్వరమ్మని సముదాయయించే ప్రయత్నం చేసి, ఆవిణ్ణింకేం కదిలించినా మాటాడే స్థితిలోలేదని, "అయినా ఉత్తరమన్నా రాయలేదటేవాడూ — ఏమే అమ్మాయ్?" అని వసంతని ఆరా తీసింది సుబ్బాయమ్మ

కన్నీళ్లు రాలుస్తున్న తల్లికేసి బిక్కమొహం వేసి చూస్తున్న వసంత, "ఆ—రాయకేం రాశాడు" అన్నది


"ఏం రాశాడేమిటి?" యాదాలాబంగా అడిగినట్టుండాలని సుబ్బాయమ్మ ఎంత ప్రయత్నం చేసినా ఆవిడ కంఠంలో కూపీ తీసే కుతూహలాన్ని కామేశ్వరమ్మ పసిగట్టనే పసిగట్టింది

గబుక్కున విచారంలోంచి తెప్పరిల్లింది "మాట జారేవు సుమీ!" అన్నట్టు వసంతలక్ష్మిని కళ్లతో వారించింది

మూలగావున్న ముక్కాలుపీట ఇవతలికి లాగి కూతుర్ని కూర్చోమని చెబుతూ, "ఏం వుందీ? మీరు అన్నట్టే వాడికేదో ఇనస్పెక్షనందట ముందు రావటానికి వీలుపడదు లగ్నానికందుకుంటానని రాశాడు" అన్నది గబగబ

తల్లివంక అదోలా చూసి తలవంచుకున్నది వసంత, మొహంమీద పడే నురగకి చెయ్యి అడ్డుపెట్టుకుంటూ

"మరి ఇహనేం?" అన్నది సుబ్బాయమ్మ నమ్మీ నమ్మనట్టుగా



"ఏదో ఉండబట్టలేక చదువు అన్నన్నినాళ్ళూ పరాయి వూళ్లోనే ఉండిపోయాడా — ఆ తరవాత ఉద్యోగమంటూ ఆ వూరూ ఈ వూరూ పట్టుకు తిరుగుతున్నాడా — చిన్నప్పుడు ఏమున్నాడో ఏమో — ఆ తరవాత పట్టుమని పదిరోజులు నా దగ్గరున్నదేవీ వాడు ఇలాంటప్పుడన్నా నాలుగురోజులు ముందొచ్చి వుంటాడనుకుంటే ఇలాగయిందేమా అని—అంతకన్నా ఏం లేదు" అన్నది కామేశ్వరమ్మ ఆవిడ సందేహాన్ని కమ్మేస్తూ

'అమ్మా — నువ్వాతేలేది నాకన్న నాలుగాకు లెక్కువ చదివిందానివి కావూ!' అనుకున్నది సుబ్బాయమ్మ, కామేశ్వరమ్మ చూడకుండా మూతి విరుస్తూ

సుబ్బాయమ్మ చెయ్యి పనిలో ఎంత రాటు తేలిందో, ఆవిడ గుణం మిగతా విషయాల్లో అంత వంకర తిరిగింది

ఎవరెవరి పనులన్నాగానీ, ఎంతెంత మోట పనులన్నాగానీ, నాదే అన్నంతగా నెత్తినేసుకుని ఎంత బాధ్యతతో చొరవ తీసుకుని చేస్తుందో, అంతగానే వారి వారి గుట్టూ మట్టూ లాగటంలో, అట్టే పుట్టే ఆనవాళ్ళు సంగ్రహించడంలో, వాళ్ల రహస్యాలన్నీ తనకు తెలీకపోతే కొంప మునిగిపోతుందన్నంత హైరానాగా రంధి పడిపోతుంది

ఒళ్లు దాచుకోకుండా, నా—నీ అనే భేదం లేకుండా నలుగురికీ ఎలాగయితే శ్రమదానం చెయ్యగలదో, సేకరించిన సమాచారాన్ని కూడా దాచుకోకుండా పదుగురికీ పంచగలదు

ఆవిడకి చాకిరీ—చాడీలూ హాబీలు ఇష్టతమాట వస్తే ఆ రెంటిలో దేనియందూ హెచ్చూ తగ్గూ అని పక్షపాతం లేదు పాపం సుబ్బాయమ్మకి

మొదటికేసు పట్టిన కొత్త సి ఐ డిలా ఒచ్చిన దగ్గర్నించీ ఆవిడకి ఒకటే తహ తహ—మురళి బ్రహ్మచర్యంలోని అంతరార్థమేమిటో కనిపెట్టెయ్యాలని.

ఇక్కడికి రాకక్రితమే మురళి గ్రంధసాంగుడయ్యాడనీ, అంచేతే పెళ్లి వద్దంటున్నాడని, కొందరి నోటా, 'కాదు — ప్రేమాయణమేదో సాగించి అది విఫలమై ప్రస్తుతం వివాహానికి విముఖుడై విరహ గీతాలు పాడుకుంటున్నాట్ట'. అని కొందరి నోటా విన్నది

అట—అట అంటూ చెప్పొకొచ్చిన ఈ రెండు కారణాలూ నమ్మదగ్గవి కావని ఆవిడ అనుమానం అసలు కారణాన్ని మరుగున పడెయ్యడానికే ద్వంద్వ కారణాలు మెలిపించి ప్రచారంలోకి తెస్తారని ఆవిడ థీరీ

సరే ఎటూ వెడుతున్నానుకదా — ఆ రహస్యమేదో ఛేదించి సత్యాన్ని గ్రహించలేక అజ్ఞానాంధకారంలో మునిగున్న వాళ్లందర్నీ వెలుగులోకి తీసుకురావచ్చనే సదుద్దేశంతో వచ్చీ రాగానే కార్యరంగంలోకి దుమికి పరిశోధన మొదలెట్టేసింది.

అయితే ఆవులిస్తే పేగులెక్కపెట్టగల ఆవిడక్కూడా నలుగుడుపడని రకాలయిపోయారు ఆ ఇంట ముగ్గురూను

(ఇంకా వుంది)

(గత సంచిక తరువాయి)



[అయిపోయింది] *

సినిమా విశేషాలు

-జి. వి. జి.

సీతాలులో ఇంటిదొంగ

షావుకారు ఇల్లు...పాలమనిషి కనకం కంగారుగా షావుకారు దగ్గరకొచ్చి, "షావుకారయ్యా! పదేళ్ళుగా మీ ఇంట్లో పాలు పోస్తున్నాను. అమ్మగారుగాని, మీరుగాని పల్లెత్తుమాట అన్నారా? నిన్నగాక మొన్నొచ్చిన పనిమనిషి సీతాలు నామీద ఎంత అభాండం వేసిందో చూడండి. నేను పాలల్లో నీళ్ళు కలుపుతున్నానంట. అందుకు వేరేచోట వాడకం పెట్టుకుంటుందట. ఇదేం న్యాయం చెప్పండి," అని మొరపెట్టుకుంది.

ఇంతలో సీతాలు విసురుగా వచ్చి, "ఏం న్యాయమా? సాధారణంగా పాలవాళ్ళంతా పాలల్లో నీళ్ళు కలుపుతుంటారు. కాని, ఇది నీళ్ళల్లో పాలు కలపడం నేను కళ్ళారా చూశాను. అందుకే వాడకం మార్చేస్తానన్నాను. తప్పా?" అంది.

"కాదు," అంటూ షావుకారు, పాలమనిషి వంక తిరిగి, "ఇదిగో – ఇంక నీ వాడకం మాకు అక్కర్లేదు," అనేశాడు.

అది విన్న గుమాస్తా పద్దు రాసుకుంటూన్న వాడల్లా తల ఎత్తి, "అయ్యగారూ! అదేదో చెప్పిందని పాత పాలమనిషిని పనిలోంచి మానిపించేస్తారా?" అన్నాడు.

సీతాలుకు మండిపోయింది. "నువ్వూరుకో నయ్యా నువో చెప్పొచ్చావ్. అది పాలల్లో నీళ్ళు కలుపుతూంటే, నువ్వు తప్పుడులెక్కలు రాస్తున్నావ్. నిజం చెప్పాలంటే, మీరిద్దరూ తోడుదొంగలే! నిన్న రాత్రి వంట ఖర్చెంత రాశావో చెప్పు!" అంటూ నిలదీసి అడిగింది.

చిక్కుచిక్కుమంటూ, "రాత్రి షావుకారుగారి టిఫిన్ నిమిత్తం పూరీలకు అయిన ఖర్చు పది రూపాయలు," అన్నాడు గుమాస్తా.

"పూరీలకు పది రూపాయలా? షావుకారుగారు రాత్రి టిఫినే తినలేదని నీకు తెలుసా? నిన్న శనివారం. రెండు అరటిపళ్ళు తిని పాలు తాగారు."

షావుకారు "అవునవును," అంటూ గుమాస్తా వంక చురచుర చూశాడు.

గుమాస్తా గుడ్లు తేలవేశాడు. "మర్చిపోయానయ్యా!"


షావుకారు గుండెలు బాదుకుంటూ, "అమ్మో! అమ్మో! ఇంటిదొంగల్ని ఈశ్వరుడు కూడా పట్టలేడంటారు. కాని, నువ్వు పట్టావ్. పొదుపు–పొదుపు అని నేను ప్రాకులాడుతూంటే నా ఇల్లు గుల్ల చేస్తున్నారన్నమాట?. అసలు – నీళ్ళని లాభంలేదు. మా ఇంటిదాన్ననాలి," అంటూ పక్క గదికేసి వెళ్ళాడు.

సీతాలు విజయగర్వంతో గుమాస్తాకేసి చూస్తూండిపోయింది.

మాటకారి అయినా మంచిమనసు గల "సీతాలు"గా జయసుధ నటించిన మణియన్ ఫిలిమ్స్ "సీతాలు" చిత్రాన్ని దుర్గా నాగేశ్వరరావు దర్శకత్వంలో మణియన్, విద్వాన్ లక్ష్మణన్ నిర్మించారు. కథ, స్క్రీన్‌ప్లే : దాసరి నారాయణరావు. మురళీమోహన్, మోహన్‌బాబు, సుమలత, నిర్మల, హరిప్రియ, రావి కొండలరావు, కబీర్‌దాస్, పొట్టి ప్రసాద్, బాలకృష్ణ ప్రభృతులు పాల్గొన్నారు. రాజశ్రీ మాటలు, పాటలు రాశారు. ఎం. ఎస్. విశ్వనాథం సంగీతం, కె. ఎస్. హరి ఛాయ, భాస్కరరాజు శిల్పం, కె. బాలు కూర్పు, డి. దశరథ రామిరెడ్డి సహదర్శకత్వం నిర్వహించారు.



'సీతాలు'లో సుమలత, జయసుధ



'మేఘ సందేశం'లో అక్కినేని



నాగేశ్వరరావు, జయప్రద

నెలవంకలో పన్నాగం

ఫకీరు (విన్నకోట విజయరాం) కృష్ణానది స్నానాల రేవులో దిగాలుగా కూర్చొని ఉన్నాడు. ఇంతలో పడవమంచి దిగివస్తున్న రహీం (జె. వి. సోమయాజులు)కి వినబడేలా అన్నాడిలా: "ఓ మహాతల్లీ! తన కోడి, కుంపటీ లేకపోతే లోకం నిద్ర లేవదనుకుందట... ఆ ఊళ్ళో కాకపోతే నేనెక్కడా బతకలేనని ఓ మహానుభావుడు నన్ను వెలేశాడు. అక్కడికంటే – ఇదిగో ఇక్కడ సుఖంగా బతుకుతున్నాన్నేను."

రహీం ఆగి, ఫకీరును పిలిచాడు. "ఫకీరూ! నేను నిన్ను ఊరొదలి వెళ్ళమంది నీమీది కసితో కాదయ్యా. ఊరి క్రమశిక్షణ కోసం. చోరత్వం – జారత్వం అంటువ్యాధుల్లాంటివి. నీ బుద్ధి మారి, మంచి వైపు మొగ్గు చూపితే – ఏ రోజైనా నువ్వు మన ఊరికి తిరిగిరావొచ్చు," అంటూ తన దారిన తాను వెళ్ళిపోయాడు.

పక్కనే ఉన్న శాస్త్రి (శ్యాం) మెల్లగా ఫకీరు వద్దకు వచ్చి, "ఈ రహీంతో పెద్ద చిక్కొచ్చి పడిందయ్యా. అరక్షణంలో ఓ పెళ్ళి బేరం, ఓ తద్దినం బేరం పోగొట్టాడు," అన్నాడు.

"రాజావారి అండ చూసుకుని వీడు ఎగిరెగిరి పడుతున్నాడు, భాయ్!" అన్నాడు ఫకీరు.

"మరే... ఆ ఇద్దరిమధ్య విరోధం పెట్టి వేరుచేస్తేగాని, నాకు మనశ్శాంతిగా ఉండదయ్యా!"

"వేరుచెయ్యడమే కాదు, పంతులుగారూ! రహీం నన్నెలా ఆ ఊళ్ళోంచి వెళ్ళగొట్టాడో – అతన్నీ అలాగే ఆ ఊరినుంచి వెళ్ళగొట్టించాలయ్యా... చూద్దాం... ఏదో ఓ ఉపాయం దొరక్కపోదు."

జంధ్యాల రచన, దర్శకత్వంలో జాతీయ సమైక్యతను, మత సామరస్యాన్ని ప్రబోధించే మురళీకృష్ణా ఆర్ట్స్ క్రియేషన్స్ "నెలవంక" చిత్రం షూటింగ్ జూన్ 23 మంచి జూలై 25 వరకు జగ్గయ్యపేట సమీపాన ముక్త్యాల గ్రామంవద్ద ముగిసింది. గుమ్మడి, జె. వి. సోమయాజులు, ఈశ్వరరావు, సాక్షి రంగారావు, పి. హెచ్. కృష్ణమూర్తి, పొట్టిప్రసాద్, ధమ్, విన్నకోట విజయరాం, పి. రామ్మోహనరావు, శ్యాం, కె. శివరామరెడ్డి, వీరభద్రరావు, వేలు, రాజ్యలక్ష్మి, తులసి, నాగమణి, సభారంజని, ప్రమీలారాణి, మద్దాలి సుశీల, కొత్త నటులు రాజేష్ కిరణ్ పాత్రధారులు. రమేష్‌నాయుడు స్వరలహరిలో ఇంద్రగంటి శ్రీకాంతశర్మ గీతాలు రాశారు. ఎస్. గోపాలరెడ్డి ఛాయ, తోట తరణి శిల్పం, గౌతంరాజు కూర్పు, యు. ఎస్. వి. పాణి సహదర్శకత్వం నిర్వహించారు. "మన ప్రాచీన జానపద కళ తోలుబొమ్మలాట ఈ చిత్రంలో విశేషాకర్షణ," అన్నారు నిర్మాతలు ఎ. ఎస్. ఆంజనేయులు, ఎం. నరసింహారావు.


కలియుగ దైవం

"రెండు సాంగ్స్, క్లయిమాక్స్ మినహా షూటింగంతా పూర్తయినట్లే. క్లయిమాక్స్‌ను తిరుపతిలో తీయాలనుకుంటున్నాం," అన్నారు అమర్‌నాథ్. ఈయన నేతృత్వంలో డాక్టర్ ఎం. రాధాకృష్ణయ్య సమర్పించే శ్రీ రాఘవేంద్ర ఆర్ట్స్ క్రియేషన్స్ "కలియుగ దైవం" చిత్రానికి ఇటీవల శ్రీనివాసుడుగా రాంబాబు, పద్మావతిగా కె. విజయ పాల్గొన్న సన్నివేశాలను ప్రకాష్ స్టూడియోలో చిత్రీకరించారు. శారద, శరత్‌బాబు, అల్లు రామలింగయ్య, జీవా,మాడా, కవిత, మమత, పండరీబాయి, త్యాగరాజు పాత్రధారులు. మాటలను సముద్రాల, గీతాలను వేటూరి రాశారు. సత్యం సంగీత దర్శకుడు. రంగా ఛాయాగ్రాహకుడు. వేణుగోపాల్ సంకలనకర్త. "దైవాన్ని నమ్ముకున్న ఓ పాత్రకు, నమ్మని మరో పాత్రకు మధ్య సంఘర్షణను ఇతివృత్తంగా తీసుకున్నాం," అన్నారు డైరెక్టర్ రోశిరాజు.

సర్దార్

డిసెంబర్‌నుంచి "సర్దార్" అనే చిత్రాన్ని ప్లాన్ చేసినట్లు దేవికమల్ మూవీస్ అధినేత శేఖర్‌బాబు తెలిపారు. ఈయన కృష్ణంరాజుతో పి. చంద్రశేఖరరెడ్డి దర్శకత్వంలో నిర్మించిన "జగ్గు" చిత్రం త్వరలో విడుదలవబోతోంది.

'బిల్లా–రంగా'లో చిరంజీవి, జయమాలిని



సినిమా

అనంతరాగాలులో అనారోగ్యానికి మందు

రాజీ లాన్స్‌లో ఒంటరిగా కూర్చొని ఆలోచిస్తోంది. మోహన్ దగ్గరగా వచ్చాడు. "రాజీ!"

"నువ్వా, మోహన్!...మురళి—" కంగారుగా రాజీ అడిగేలోగానే మోహన్ చెప్పాడు: "మురళి సంగతి చెబుదామనే వచ్చాను. బాధనే ఆనందంగా, అనారోగ్యాన్నే ఆరోగ్యంగా వాడు భావించుకుంటున్నాడు. చెబితే వినడు. వినాలని కూడా వాడికి తోచదు."

"అతని గురించి నేనూ బాధ పడుతున్నాను."

"అందువల్ల ప్రయోజనం ?"

"అతన్ని ప్రేమించడం తప్ప ఏం చేయమంటావో చెప్పు."

"ఒక్కసారి మురళి దగ్గరికి రా !"

"ఎందుకు ?"

"బలవంతం చేసి హాస్పిటల్‌కి తీసుకెళ్తే, డాక్టరిచ్చిన మందులు వేస్ట్ బాస్కెట్‌లో పడేశాడు. నువ్వొచ్చి, నీ చేత్తో మందిస్తే, తాగుతాడు. మళ్ళీ బతుకుతాడు."

"అలాగే వస్తాను...కానీ—"

"హుం...ఈ కానీ అనే మాట ఎప్పుడు ఎలా పుట్టిందో కాని, మనిషి చేయబోయే ప్రతి పనికీ అడ్డం పడుతోంది—గొంతులో పచ్చివెలక్కాయలాగా."

"అది కాదు...ఇప్పుడు నేనొస్తే ... నిజంగానే తనను ప్రేమించి వచ్చానని మురళి అనుకుని...'!

"ముందు వాడు బతకడం ముఖ్యం. తర్వాత మిగతా సంగతులు ఆలోచిద్దాం."

"సరే...పద !"

"హమ్మయ్య...వాడి ప్రాణానికిక భయంలేదు."

"నాకూ మురళిని బతికించుకోవాలనే ఉంది," అంటూ రాణి, మోహన్‌తో బయలుదేరింది.

రాజీగా రాజ్యలక్ష్మి, మోహన్‌గా మోహన్‌రాం పాల్గొన్న శ్రీ శంకుచక్ర మూవీస్ "అనంతరాగాలు" చిత్రంలో రాజ్యలక్ష్మి, పూర్ణిమ, రోహిణి, భీమేశ్వరరావు తప్ప ఇతర నటవర్గం, సాంకేతికవర్గం ఫిలిమ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన వారే. శుభకర్, మోహన్‌రాం, సుబ్రహ్మణ్యం, మోహన్‌తోపాటు ఈ చిత్ర దర్శకుడు ప్రభాకర్ కూడా ఓ ప్రధాన పాత్ర ధరించారు. కొంపెల్ల విశ్వం సంభాషణలకర్త, వేటూరి గీతాలకు శివాజీరాజా బాణీలు కూర్చారు. ఛాయ ఎస్. ఏక్‌నాథ్, కూర్పు బాలు, శిల్పం చంద్ర నిర్వహించారు. ఆగస్టులో విడుదలయ్యే ఈ చిత్రానికి కె. ఎన్. జి. నాయుడు, వి. ఆర్. ఎన్. రెడ్డి, పటేల్ నిర్మాతలు.



'జగన్నాథ రథచక్రాలు'లో కవిత



"నాతో మద్రాసు వచ్చేస్తావా ? నీ వొంటిమీద బంగారంతో ఓ బడ్జెట్ చిత్రం తీస్తాను!"

"రంగుల కల"

ఓ చిత్రకారుడి జీవితాన్ని పై పేరున సుచిత్రా ఇంటర్నేషనల్ వారు తెరకెక్కిస్తున్నారు. బి. నరసింగరావు ప్రధాన పాత్ర ధరిస్తూ, దర్శకత్వం వహించే ఈ చిత్రంలో సాయిచంద్, కాకరాల, చంద్ర, వి. బి. శంకరరావు, వెంకటరెడ్డి, షేక్ షరీఫుద్దీన్, శేషంరాజు, అమర్‌మోహన్, పి. డి. నాయుడు, ఉష, హరిత, బృంద, హేమలతారాయ్, మద్దూరి విజయలక్ష్మి పాల్గొంటున్నారు. తొలి షెడ్యూల్ హైదరాబాద్, రామప్పగుడి ప్రాంతాల్లో జరిగింది. రెండో షెడ్యూల్ జూలై నెలాఖరునుంచి. దేవీప్రియ, ఎస్.ఎం. ప్రాణ్‌రావు, బి. నరసింగరావు, ఉప్పల నరసింహం స్క్రీన్‌ప్లే రాశారు. బి. నరసింగరావు, ప్రాణ్‌రావు సంభాషణలకర్తలు. దేవీప్రియ, జానపద కవులు రాసిన గీతాలకు పి. పి. వైద్యనాథన్ స్వరకల్పన చేశారు. వేణుగోపాల్ తక్కర్ ఛాయ, డి. రాజగోపాల్ కూర్పు, జి. రవీంద్రనాథ్ నిర్మాణతతో కె. వెంకటేశ్వరరావు నిర్మాత. ★

"తారలను ఎంత హృదయపూర్వకంగా అభిమానిస్తారో నాకు బాగా తెలుసు. ఎందుకంటే నేనూ ఒకప్పుడు 'ఫాన్'నే! గుంటూరులో చదువుకునే రోజుల్లో సావిత్రి, జమున, వాణిశ్రీగార్ల చిత్రాలు ఒక్కటీ వదలకుండా చూసేదాన్ని. ఒకసారి నేను గుంటూరులో "థవ్స్ అప్" అందాల పోటీలో గెలుపొంది, నా అభిమాన తార జమున చేతుల మీదుగా బహుమతి అందుకున్నప్పుడు ఎంతగా ఉప్పొంగిపోయానో!!" అంది సుమలత మైలాపూరు, లజ్ అవెన్యూలో ఎంతో చక్కగా అలంకరించబడి ఉన్న (73వ నెంబరు) అత్యాధునికమైన భవంతిలో. "ఇదివరకు అభిరామపురంలో ఉండేవాళ్ళం. ఈ ఇంటికి వచ్చినప్పట్నుంచీ బాగా బిజీ అయిపోయాను. ఈ ఇల్లు బాగా అచ్చివచ్చింది. దీన్ని కొనే ఉద్దేశ్యం లేకపోలేదు. అసలు ఈ ఇంటికి మారినప్పట్నుంచీ నాకు అభిమానులు మరింత పెరిగారు. ఎన్నో కేంద్రాలలో నాపేర అభిమాన సంఘాలు వెలిశాయి. విశేషమేమిటంటే — విదేశాలలో కూడా ఫాన్‌లు ఏర్పడ్డాయి," అంటూ సుమలత ఇంకా ఇలా వివరించింది :

విదేశాలలో అభిమానులు :

సౌదీ అరేబియానుంచి ఆ మధ్య ఓ అభిమాని ఒక లేఖ రాస్తూ, "మీకు వీడియో సెట్ కొనే ఉద్దేశ్యం ఉన్నట్లయితే, తొందరపడి లోకల్ సెట్ ఏదైనా కొనేయకండి. త్వరలోనే నేను ఓ పనిమీద ఇండియాకు రాబోతున్నాను. వచ్చేటప్పుడు నాతో పాటు మీకో మంచి వీడియో సెట్ తెస్తాను. ఇంకా ఏవైనా ఇండియాలో మీకు దొరకనివి కావాలన్నా — సంకోచించకుండా తెలియజేయండి. తప్పకుండా తెస్తాను," అంటూ రాశారు. అలాంటి ఉత్తరం చదివి ఎవరు ఆనందించకుండా ఉంటారు ? ఇటీవలే, ఈలోగానే మేమిక్కడ వెస్టన్ వీడియో సెట్ కొనేశామనుకోండి. 'శుభలేఖ' చిత్రాన్ని టేప్ చేయించాం. అప్పుడప్పుడు మేమంతా వేసుకొని చూసుకుంటూంటాం.

అభిమానుల అభిప్రాయాలు :

నా అదృష్టవశాత్తు తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో చక్కని చిత్రాల్లో వేషాలు లభించాయి. బాగా చేశాననిపించుకున్నాను. అంచేతే అభిమానులు మరింత పెరిగారేమో! సహృదయులైన ఈ అభిమానులు నేను నటించే ప్రతి చిత్రాన్నీచూసి నా బాగోగుల గురించి నిర్మొహమాటంగా ఎప్పటికప్పుడు తెలియజేస్తూంటారు. అవి నాకెంతో ఉపకరిస్తూంటాయి. అందుకే ఆ ఉత్తరాలన్నిటినీ భద్రంగా ఫైల్ చేసి ఉంచుతూంటాను. 'శుభలేఖ' చిత్రం చూసిన మర్నాడే ఓ అభిమాని "చిరంజీవి గారు ఎంతో చురుకుగా, చలాకీగా కనిపించారు. మీరు కూడా అలా నటించి ఉంటే బాగుండేది," అంటూ తన అమూల్యాభిప్రాయాన్ని తెలిపారు. నిజానికి ఆ చిత్రంలో చిరంజీవిగారిది చాలా చలాకీయైన పాత్ర. నాది ఎం. ఎ. చదివిన ట్యూటర్ పాత్ర. నా పాత్రకు తగ్గట్టు కాస్త గంభీరంగానే ఉండక తప్పదు. డిగ్నిఫైడ్‌గా కనిపించడంకోసమే నాకు కళ్ళజోడు కూడాను. అసలు డైరెక్టర్ విశ్వనాథ్‌గారు నా ఫేస్‌కు తగిన కళ్ళజోడుకోసం నాలుగైదు రోజులపాటు మౌంట్‌రోడ్, జార్జ్ టవున్‌లోని ఎన్నో షాపులనుంచి దాదాపు రెండు వందలకు పైగా కళ్ళజోళ్ళు తెప్పించి, వాటిల్లోంచి నా ఫేస్‌కు మాచ్ అయినది సెలెక్ట్ చేశారు. ఈ విషయం ఎందుకు చెప్పవలసివచ్చిందంటే—ఆ ప్రముఖ డైరెక్టర్‌గారు ప్రతి చిన్న విషయం గురించి ఎంతగా శ్రద్ధ తీసుకుంటారోనని. నిజానికి ఫలిప్ ఆక్టింగ్‌లో ఆయనొక విశ్వవిద్యాలయం. ప్రతి పాత్రనూ స్వయంగా అభినయించి చూపిస్తారు. ఎక్కడా రాజీ పడకుండా అనుకున్న ఎఫెక్ట్ సాధించేవరకు ఎంతగానో శ్రమిస్తారు. అలాంటి సుప్రసిద్ధ దర్శకుల చిత్రాల్లో నటించే అవకాశాలు లభించడం నిజంగా నా పూర్వజన్మ సుకృతం. ఇక 'శుభలేఖ'లో నా నటనను మెచ్చుకుంటూ అనేక ప్రాంతాలనుంచి ఎందరో రాశారనుకోండి. మరో విషయం...'శుభలేఖ' విడుదలైన రోజున మచిలీపట్నంలోని నా అభిమాన సంఘంవారు మహిళా ప్రేక్షకులకు జాకెట్ బట్టలు, కుంకుమ భరిణెలు పంచిపెట్టారట. ఇంతటి సహృదయుల అభిమానానికి విలువకట్టలేం కదా ?

ఉద్యోగ ప్రయత్నం పంపిన అభిమాని

మా అక్కయ్య రేణుక, అన్నయ్య రాజేంద్ర అసిస్టెంట్ సినిమాటోగ్రాఫర్స్‌గా శిక్షణ పొందుతూన్నారు. మా నాన్నగారు స్వర్గీయ మదన్ మోహన్‌గారు కూడా కెమెరామన్. వాళ్ళిద్దరూ కెమెరా వెనుక పని చేస్తూంటే నేను కెమెరా ముందు పని చేస్తున్నాను. చెల్లెలు కృష్ణప్రియ చదువుకుంటోంది. తను మెడిసిన్ చదవాలనుకుంటోందని ఒక పత్రికా విలేఖరితో మాటల మధ్య చెప్పాను. పత్రికలో ఆ విషయాన్ని చదివిన ఓ తిరుపతి అభిమాని ఎం. బి. బి. ఎస్. కోర్స్ అప్లికేషన్ ఫారమ్ ఫీజు చెల్లించి తీసుకొని, మాకు రిజిస్టర్డ్ పోస్టులో పంపుతూ, మా సిస్టర్‌ను వెంటనే అప్లయ్ చేయమని కోరాడు. తర్వాత మా సిస్టర్ తన ఉద్దేశ్యాన్ని మార్చుకొని, ఇప్పుడిక్కడే ఎస్.ఐ.ఇ.టి. కాలేజీలో బి.ఎస్.సి. చదువుతూందనుకోండి ...

మన 'శుభలేఖ' ఎప్పుడు?

సేలమ్ నుంచి ఓ అభిమాని ఇటీవల ఓ ఉత్తరం రాశారు. ఆయన సంపన్నుల కుటుంబానికి చెందిన వ్యక్తి అట. అందగాడట. నన్ను పెళ్ళి చేసుకోవాలని కలలు కంటున్నట్లు తెలియజేస్తూ, 'శుభలేఖ' ఎప్పుడు అచ్చువేయిద్దాం — అంటూ రాశారు. ఇలాంటి ఉత్తరాలు మన రాష్ట్రం నుంచి కూడా వచ్చాయి. చదివి, మేమంతా నవ్వుకుంటూంటాం.

మా ఇంట్లోనూ 'ఫాన్'లు!

మా సిస్టర్స్‌లో రేణుక — రజనీకాంత్ ఫాన్ అయితే, కృష్ణప్రియ — కమలహాసన్ ఫాన్! ఒకసారి వీళ్ళిద్దరూ వీళ్ళ అభిమాన హీరోలకు ఫోటోలు పంపమంటూ రాశారు. రజని దగ్గర్నుంచి మాత్రం రెండురోజులు తిరక్కముందే రేణుకకు ఫోటో వచ్చింది. కృష్ణప్రియకు కమల్ వద్దనుంచి ఫోటోగాని, ప్రత్యుత్తరంగాని రాలేదు. ఇటీవల నేను ఒక పత్రిక కోసం కమల్‌ను ఇంటర్‌వ్యూ చేసినప్పుడు ఈ విషయం గుర్తుచేశాను. "అలాగా ? ఎక్కడో పొరబాటు జరిగి ఉంటుంది. నేను కనుక్కుంటాను," అన్నారాయన. అన్న వారంరోజులకే ఫోటో పంపించేశారు. మా సిస్టర్ పొందిన ఆనందం ఇంతా అంతా కాదు.

మరో తమాషా చెప్పనా ? ఇదివరకు మా ఇంట్లో నాలుగు కోడిపెట్టలు పెంచేవాళ్ళం. వాటిని మా సిస్టర్స్ కమల్, రజని, సుమన్, సుధాకర్ — అంటూ ముద్దుగా పిలిచేవాళ్ళు. సెట్‌లో కాస్త తీరిక దొరికినప్పుడల్లా రజని కుర్చీలో విశ్రమిస్తూ కునికిపాట్లు పడుతూంటారు. అలా అప్పుడప్పుడు మగతగా కనిపించే పెట్టకు రజని అని, చలాకీగా తిరుగుతూండే దానికి కమల్ అని, కాస్త పొడుగ్గా ఉన్నదానికి సుమన్ అని, చురుకుగా కనిపించే పెట్టకు సుధాకర్ అని — పేర్లు పెట్టారు.

అభిమానానికి అవధుల్లేవంటారు. నిజమే కదా ?

పై విషయాలన్నీ చెప్పాక "సహృదయులైన అభిమానుల ఆదరాభిమానాలే మాకు శ్రీరామ రక్ష !" అంది సుమలత.

[జి. వి. జి.]



డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

టి ఎస్. – గూడూరు

నాకు అరికాళ్ళయందు ఆనెలు వున్నాయి నడిచేటప్పుడు నెప్పి విపరీతంగా వుంటుంది వీటికి ఏమి చెయ్యాలి ?

★ ఆనెలను శస్త్రచికిత్స ద్వారా తీసివేయాలి అయితే తీసే సమయంలో బాగా లోతుగా, వేరు పూర్తిగా వచ్చేటట్లు చూడటం అవసరం

తిరిగి ఆనెలు రాకుండా ఆ భాగాలకి వత్తిడి తగలకుండా ఉండే విధంగా పాదరక్షలు వాడటం లవసరం

వై. ఎమ్. – రాజోలు

మా అమ్మగారికి రెండు, మూడు సంవత్సరముల నుండి పగలు రాత్రి గూడా భోజనం చేయగానే కడుపంతా బరువుగా వుంటుంది ఆహారం కొద్దిగా తీసుకున్నా గూడా అలాగే వుంటుంది రాత్రిపూట త్రేనుపులు వస్తాయి మెలకువ వస్తే త్రేనుపులు ఎక్కువగా వస్తాయి గ్యాస్ పోతుంది చాలా మందులు వాడాము మందులు వాడినప్పుడు తగ్గి మరలా ముందువలెనే వుంటుంది దీనికి ఏమి చెయ్యాలి ?

★ బేరియంమీల్ ఎక్స్–రే, ఫ్రాక్షనల్ టెస్టు మీల్ మొదలయిన పరీక్షలు చేయించటం అవసరం వీటి ఫలితాల ననుసరించి చికిత్స చేయవలసి ఉంటుంది కొందరికి మటుకు వయస్సు ప్రాబల్యం వల్ల, ఏ రోగ కారణమూ లేకుండానే ఆహారం జీర్ణం అవటం ఆలస్యం అవుతుంది

తాత్కాలికంగా యూనీఎంజైమ్ మాత్రలు పూటకి ఒకటి వంతున రోజుకి రెండు పూటలుగా తీసుకోవటం, బికోస్యూల్సు వంటి మాత్రలను రోజుకి రెండు వంతున తీసుకోవటం చేస్తే కొంత ఉపశమనంగా ఉంటుంది

హెచ్ ఎస్. – హైదరాబాద్

నాకు చిన్నప్పటినుండి కుడి కన్నుకి 'మెల్ల' వున్నది దీనిని ఎలా నిర్మూలించాలి ? ఆపరేషన్ చేయించాలా ? చేయిస్తే నయమవుతుందా ? ఖర్చు ఎంత అవుతుంది ?

★ మెల్లకన్ను ఎలా ఏర్పడిందనే అంశాన్నిబట్టి ఆపరేషన్ చేయవలసిందీ లేక కళ్ళజోడు ధరించ వలసినదీ తెలుస్తుంది కండరాల పటుత్వం తగ్గినందు వల్లగానీ, నరాలు బాధింపబడినందువల్లగానీ ఏర్పడిన స్క్వింట్‌ని — ఆపరేషన్ ద్వారా సరిచేయగలరు

ఎమ్. ఎస్. డి. – అమీనాబాద్

నా వయస్సు 19 సంవత్సరములు నేను చాలా లావుగా వుంటాను లావు తగ్గటానికి రాత్రిపూట చపాతీలు తినవచ్చా ? దీనివలన వుపయోగము వున్నదా ? లావు తగ్గుటకు వేరే పద్ధతులు ఏమైనా వున్నవా ?

★ లావు తగ్గటానికీ చపాతీలు తినటానికీ సంబంధం లేదనే చెప్పవలసి ఉన్నది లావు తగ్గాలంటే తీసుకొనే ఆహారాన్ని తగ్గించి బాగా శ్రమించి పని చేయవలసి ఉంటుంది వరి అన్నం తిన్నా, గోధుమ లను ఏ రూపేణ తీసుకున్నా ఒకటే! నూనె పదార్థాలు, చాకలెట్లు, ఐస్‌క్రీములూ, దుంప కూరలు మొదలైనవాటిని ఎక్కువగా వాడేవారికి అతి స్థౌల్యం రావటం సహజం


లావు తగ్గటానికి మందులు వాడటం అంత మంచిది కాదు వాటివల్ల ఇతర రకాలైన హాని జరిగే అవకాశం ఉంటుంది

కె. ఎస్. ఎం. – మద్రాసు

నోటిలో అడపాదడపా వచ్చే పుండ్లని ఏమంటారు ? వాటికి కారణం ఏమిటి ? ఎలా నివారించాలి ?

★ నోటిలో అడపాదడపా ఏర్పడే పుండ్లను ఆఫ్తస్ స్టొమటైటిస్ అని అంటారు ఇవి ఎందు వల్ల వస్తాయో నిర్ధారణగా కనుగొనబడలేదు కొందరు రిబోఫ్లేవిన్ కొరతవల్ల వస్తుందని, కొందరు బి–కాంప్లెక్స్ లోపంవల్ల వస్తుందని, మరికొందరు ఇది సైకో సొమాటిక్ రోగమని, మరికొందరు నోటిలో ఏర్పడగల ఇన్‌ఫెక్షన్‌వల్ల వస్తుందనీ అంటారు. ఒక్కో వ్యక్తిలో పైన చెప్పినవాటిలో ఏదైనా ఒక కారణం ఉండవచ్చును

ఒక శాతం సిల్వర్ నైట్రేట్ ద్రవాన్ని ఆ పుండ్లమీద దూదితో తాకించి వెంటనే ఉప్పు నీళ్ళతో నోటిని పుక్కిలించాలి లోనికి బి–కాంప్లెక్స్ మాత్రలు రోజుకి రెండు వంతున వాడవలసి ఉంటుంది



మేము రోజుకు 7,00,000 నోవినో బ్యాటరీలు తయారు చేస్తాము!
అంటే మొత్తం 10,50,000 వోల్టుల గొప్ప శక్తి...



లేక మీ ఇంటికి సరఫరా చేయబడే వోల్టేజీకి 4,200 రెట్లు.


ఆశ్చర్యం గొల్పే ఈ అంకెలు...మిమ్ము దిగ్భ్రమం చేయడానికి కాదు. కాని, మీ జీవితాలలో వెలుగులు నింపడంలో మేము నిర్వహించే పాత్రను గురించి మీకు స్పష్టంగా తెలియ చేయడానికే.
కేవలం ఈ అంకెలను గురించి మాట్లాడంతో మా కథ పూర్తి కాదు...ఎందుకంటే మీరు ముఖ్యంగా తెలుసుకోవాల్సింది మేము బ్యాటరీలను ఎలా ఉత్కృష్టంగా తయారు చేస్తామన్న విషయం ముఖ్యంగా, ప్రపంచ ప్రసిద్ధమైన నేషనల్, జపాన్ వారి సహకారంతో ఇండియాలో అత్యాధునికమైన ఒక ఫ్యాక్టరీలో తయారైనది నోవినో బ్యాటరీ ఫలితం?
ఈ క్షేత్రంలో అగ్రగణ్యులుగా గుర్తించబడిన వారి సాంకేతిక జ్ఞానం మాకు లభ్యమయింది
ముడి పదార్థాలను ఎన్నుకొనే దశ నుండే ప్రారంభ మవుతుంది మా అత్యంత కఠోర నాణ్యతా నియంత్రణ.
ఇది ఒక ప్రత్యేకతే మరి తయారీలో దాదాపు 35 ముడి పదార్థాలు మరియు 117 వేర్వేరు భాగాలు ఉపయోగించబడుతాయి ఇందులో ప్రతిదీ ఖచ్చితమైన ప్రమాణాలకు సరితూగేదే ఎసెంబ్లీ లైనులో మా 67 టెస్టింగ్ పాయింట్లు 1100 కంటే ఎక్కువ నిర్దుష్ట అంశాలను పరీక్షిస్తాయి ప్రతి ఒక బ్యాటరీ విడిగా పరీక్షించబడుతుంది. దేశంలోని అత్యంత అధునిక పద్ధతులను ఉపయోగించి ప్రతి చిన్న విషయంలో జాగ్రత్త తీసుకోబడుతుంది.

కాని, మాకు మరింత ప్రత్యేకతను చేకూర్చేది కలిసికట్టుగా పనిచేసే మా విశేషజ్ఞుల బృందం వీరు శక్తి సంపన్నమయిన లాభాలతో కూడిన అత్యంత ఉత్కృష్ట బ్యాటరీలను తయారు చేయడానికి దీక్ష పూని పని చేస్తున్నారు

ఇవి ఎక్కువకాలం మన్నుతాయి.
నిల్వ వుంచినా ఎక్కువకాలం పనిచేస్తాయి
లీకేజి లేకుండా వుండేలా చక్కగా సంరక్షింపబడినవి. ఏ ఇతర బ్యాటరీతో పోల్చినా ఇవి ఏకరీతి నాణ్యత కల్గివున్నాయి.

మేము రోజుకు 7,00,000 నోవినో బ్యాటరీలు ఎలా తయారు చేసామో, ప్రతి బ్యాటరీ ఎలా అనేక పరీక్షలకు గురి అవుతుందో తెలియజేశాం. కాని ఇది ఎలా గొప్ప కాంతితో పని చేస్తుందో మీరు స్వయంగా చూడాల్సిందే మరి!

లఖన్‌పాల్ నేషనల్ లిమిటెడ్
బరోడా, గుజరాత్
నేషనల్ జపాన్ వారి సహకారంతో ఒక ఉమ్మడి సంస్థ.



నోవినో
మరింత మేలైన బ్యాటరీ.

SISTA S-LNL-243/82 TEL

కొత్త సీరియల్: దాంపత్య సంగీతం

శ్రీమతి కళ్యాణి సోమరాజ్

జీవితం ఒక్కసారి వెనక్కి తిరిగితే బాగుండని చాలామంది అనుకుంటారో లేదో నాకు తెలియదు కాని నేను మాత్రం చాలాసార్లు అనుకొనేదాన్ని.

కాని గతించిన కాలం తిరిగిరాదని జగమెరిగిన సత్యం. నా లోపాలు, నేను జీవితంలో వేసిన తప్పటడుగులు తెలుసుకొనేసరికి 'కళ్ళెం' లేని కాలం చాలా ముందుకు జరిగింది.

* * *

అవి నేను ఎమ్. బి. బి. ఎస్. ఆఖరి సంవత్సరం చదువుతున్న రోజులు. పరీక్షలు ఇంకా రెండు నెలలు లేవు. సహజంగా చదువులో క్లాస్‌లో అందరికంటే మిన్నగా వుండే నేను, భయపడాల్సిన పనిలేదు. కాని 'పరీక్షలు' అన్న భయం నన్ను కూడ ఆవరించేది అప్పుడప్పుడు

చేతిలో 'యానాటమీ' బుక్ వుంచుకుని సాయంకాలపు అందచందాలని ఆశ్వాదిద్దామని, తోటలోకి అడుగు పెట్టాను. మాలి అప్పుడే 'లాన్' అంతా తడిపినట్లున్నాడు, కుచ్చెళ్ళకి చల్లగా తగులుతోంది పచ్చని గడ్డి. జినియాలు, డాలియాలు నీట. తుంపుర మధ్య 'జలకన్యల్లా' గాలికి వూగుతున్నాయి.

ఒకప్రక్క 'శారద' శ్రద్ధగా పెంచుతున్న గులాబి తోట రకరకాల పువ్వులతో మత్తెక్కించేలా వుంది నిన్నో, మొన్నో విచ్చిన పూలు గాలి తాకిడికి రేకలు రాల్చి పుప్పొడితో మిగిలివున్నాయి. లిల్లీ చెట్లకి నీటిపారుదల సరిచేస్తున్న తోటమాలి నా రాక గమనించి, లేచి నిలబడ్డాడు.

"అమ్మా! మీకోసం ఎవరో అబ్బాయిగారు వచ్చారు ఇందాక. లోపలికి రమ్మంటే మళ్ళీ వస్తాలే, అని వెళ్ళారు."

"మరి నాకొచ్చి చెప్పలేదేం "

"అప్పుడు మీరింకా ఇంటికి రాలేదు "

ఈ రోజు లైబ్రరీలో పుస్తకాలు ఇచ్చేద్దామని లైబ్రరీకి వెళ్ళటం గుర్తొచ్చింది నిజమే ఈ రోజు తను చాలా ఆలశ్యంగా వచ్చింది ఇంటికి

"పేరు చెప్పలేదా ?"

"లేదమ్మా !"

"రవిబాబా !"

"కాదమ్మా" తోటమాలి ఒకసారి బుర్ర గోక్కుని "ఆర్ని నేనింతవరకు మనింట్లో చూడ లేదమ్మా !" అన్నాడు

"సరేలే, నువ్వు వెళ్ళు "

మళ్ళీ ఆలోచనలు ఆ అగంతకుని మీదకు ప్రాలాయి ఎవరతను ? ప్రకాశ్ ఏమో ! నా నోట్సు తీసుకొని చాలా రోజులైంది తిరిగి ఇవ్వటానికి వచ్చాడేమో ! ఉహు అతనైతే మాలి గుర్తించగలడు అతను కాదేమో ! కుమారా ! అతనికి తన ఇంటి అడ్రస్ తెలియదే, అతనితో తనకు ఘాఢమైన పరిచయం వున్నా అతన్నేనాడు ఇంటికి రమ్మని తను ఆహ్వానించలేదు ఫోర్త్ ఇయర్‌లో కుమార్ క్లాస్ తీసుకొనేవాడు. అప్పుడతను ఎమ్ ఎస్. ఫైనలియర్ చదువుతున్నాడు అర్ధంకాని చాలా విషయాలు అతను ఓపిగ్గా తనకు వివరించేవాడు ఇప్పటికీ తనకేదైనా డౌట్స్ వుంటే కుమార్ దగ్గరకు వెళ్ళటానికి తను వెనుతీయదు అతను ఎమ్ ఎస్ ఫస్ట్ ఛాన్స్‌లో పాసౌక పోవటం అందరితోపాటు తను ఆశ్చర్యపోయింది నిజానికి కుమార్‌కి ప్రాక్టికల్స్‌లో మంచి నేర్పు, పేరు వున్నాయి ప్రొఫెసర్ దగ్గరనుంచి అతన్ని మెచ్చుకోవటం వింది

ఒక్కసారి తోటలో లైట్లన్నీ వెలిగాయి. ఆలోచనల్లో చాలాకాలం వృధా చేసుకున్నానేమో అనుకుంటు ఇంట్లోకి పరుగుతీసాను

మేడ మెట్ల దగ్గర వంట మామ్మగారు నిలేసింది "ఏం కూర చేయమంటారు" అంటూ.

సహజంగా ఇంటి విషయాలన్ని శారదే చూసుకుంటుంది అమ్మ పోయినప్పటి నుంచి ఇలాంటి వ్యవహారాలన్ని చూస్తూ వుండబట్టి ఏమో, నాకంటే అది వయసులో చిన్నది అయినా మంచి ఆరిందా అయింది బహూశ అదింకా సంగీతం క్లాస్ మంచి వచ్చి వుండదు అనుకుంటూ,

"ఏదో ఒకటి చేసేయ్యండి " అన్నాను కొంచెం విసుగ్గా మొఖం పెట్టి ఆవిడింకేం మాట్లాడలేదు.

ఏడు గంటలు దాడు తుండగా, "సామజ వర గమనా.. అని పెద్దగా పాడుకుంటూ నా దగ్గర కొచ్చింది శారద.

"ఈ రోజు పంచ రత్న కీర్తన మొదలు పెట్టారే మాస్టారు ఆయన పాడుతుంటే ఎంత బాగుందను కున్నావ్ " శారద మొదలు పెట్టిందంటే ప్రవాహంలా అలా చెప్పకు పోతూనేవుంటుంది. సంగీతం అంటే నాకే మాత్రం ఇంట్రస్ట్ లేదని శాదకు తెలుసు అయినా పట్టించుకోదు

"నీ పరీక్ష లెప్పుడు ?" అన్నాను పుస్తకంలోంచి తలెత్తకుండానే.

"అబ్బ పరీక్షల గొడవెందుకే ఇప్పుడు ఆ వెధవ బి ఏ. ఎలాగో పాసౌతాలే" అంది గారంగా.

"నాన్నగారు నీకు చదువు చెప్పించి తప్పపని చేసారు. హాయిగా సంగీతమే నేర్పిస్తే సరిపోయేది "

"నిజం అక్కా ! నేను అదే అనుకుంటాను. ఈ చదువు మూలంగా బొత్తిగా సంగీత సాధనకే టైమ్ కుదరటంలేదు" శారద నిశ్చింతగా అనేస్తుంటే నవ్వు, కోపం వచ్చాయి

"సరే, నన్నైనా చదువుకోనీయ్ !" అన్నాను కోపం దాచుకోలేక

"నువ్వుత్త పుస్తకాల పురుగువి" అంటూ వెళ్ళిపోయింది

శారదకి చదువుమీద ఏ మాత్రం శ్రద్ధ లేదు.



పరీక్షలు పదిరోజుల్లో వున్నాయంటే గబగబ పుస్తకాలన్నీ ముందేసుకు కూర్చుంటుంది. అంత వరకు చదువు సంగతి పట్టించుకోదు సంగీతమో, ఫ్రెండ్సో, సినిమాలో, షాపింగో ఎప్పుడూ క్షణం తీరుబడిలేని దానిలా చాలా బిజీగా వుంటుంది అమ్మ వుంటే దాన్ని కాస్త అదుపు ఆజ్ఞలో వుంచేదేమో! మా దురదృష్టం శారద చిన్నప్పుడే అమ్మ గుండెజబ్బుతో చనిపోయింది అప్పటినుంచి నాన్నగారు తల్లీ, తండ్రి తానే అయి మమ్మల్ని పెంచారు చాలామంది బంధువులు నాన్నగారిని రెండో పెళ్ళి చేసుకోమని బలవంతపెట్టేవారు కాని నాన్నగారు నిర్మొహమాటంగా నిరాకరించేవారు

"నా ఆస్తిపాస్తులు చూసి మళ్ళీ నన్ను పెళ్ళి చేసుకోటానికి ఆ అమ్మాయి సిద్ధపడచ్చు కాని, పిల్లలిద్దరికి తల్లి స్థానం ఇవ్వటానికి ఆమె మానసికంగా సిద్ధపడకపోవచ్చు నా పిల్లల్ని చూసుకుంటూ, నా మిగిలిన జీవితం గడిపేస్తాను నా కింకే జంజాటన వద్దు" అనేవారు

బంధువులు నచ్చచెప్పలేక విసిగి ఆ ప్రసక్తి ఎత్తటం మానేసారు

అమ్మ వుంటే ఎలా వుండేదో తెలియదు కాని నాన్నగారి ఆపేక్షలో మాకే లోటు తెలిసేది కాదు దాని మూలంగా శారద కొంచెం గారాబంగా తయారైనా, నాకు ఊహ తెలిసాక, పరిస్థితులు అర్థం చేసుకోవటం వచ్చాక, నాన్నగారిని దేనికీ విసిగించేదాన్ని కాదు

2

"స్వాతీ! స్వాతీ!" హాస్పిటల్ కారిడార్ మలుపు తిరగబోతున్న నేను ఆగిపోయాను, ఎవరో నన్ను పిలుస్తున్నట్లనిపించి.

వెనక్కి తిరిగి చూస్తే కుమార్!

"ఏమిటి మేడమ్ అంత పరధ్యానం"

"సారీ! కేస్ గురించి ఆలోచిస్తూ పోతున్నాను"

"నిన్న సాయంకాలం మీ ఇంటికి వచ్చాను."

"అరె నువ్వా! ఇంతకీ ఇల్లెలా తెలుసుకున్నావ్!"

"ఓ అందమైన అమ్మాయి అందులోను డబ్బున్న అమ్మాయి ఇల్లు తెలుసుకోవటం కష్టమా!" నవ్వుతూ జోక్ చేసాడు.

"అది సరే నిజం చెప్పు. ఎలా వచ్చావ్?"

"కాంట్రాక్టర్ రామనాధంగారి ఇల్లంటే ఆ మాత్రం ఎవరైనా చెబుతారు"

"మరి వచ్చిన వాడివి అలా వెళ్ళిపోయావేం? ఇంట్లోకి రాకుండా!"

"ఏం చేయను, వీధిలో సింహాల్లాంటి రెండు కుక్కలు కాపలా వున్నాయి. ఎందుకైనా మంచిదని వచ్చేసాను"

"సరేలే. అవి ఎప్పుడూ కట్టేసే వుంటాయి."

"వూరికే అన్నాను నువ్వు లేవు. నువ్వు ఇంట్లో వున్నప్పుడు రావచ్చని"

"ఇంతకీ ఎందుకొచ్చినట్లు?"

"నిన్ను మా ఇంటికి తీసుకెళ్ళటానికి."

అతనివైపు చిత్రంగా చూసాను

"ఔను స్వాతి. నువ్వు వస్తావని మూడుసార్లు

దాంపత్య సంగీతం

నుంచి మోసం చేస్తున్నావు ఈసారి నేను దగ్గరుండి తీసుకెళ్ళ దలుచుకున్నాను"

నేనేం మాట్లాడలేదు కుమార్ నిజానికి చాలారోజుల నుంచి వాళ్ళింటికి రమ్మంటున్నాడు నేనే, ఏదో ఓ సాకు చెప్పి తప్పించుకుంటున్నాను చిన్నప్పటినుంచి ఎవరింటికి వెళ్ళే అలవాటు నా కంతగా లేదు ఇల్లు, కాలేజి

"ఏమిటి ఆలోచిస్తున్నావ్! ఎలా తప్పించుకోవాలనా?"

"ఛ! అదేం కాదు వస్తాను రేపు సాయంకాలం"

"నమ్మకమేనా?"

"అబద్దాలాడే అలవాటులేదు"

"సరే చూస్తాను"

* * *

మరునాడు సాయంకాలం అనుకున్నట్లుగానే కాలేజి దగ్గర సిద్ధమైయ్యాడు కుమార్! అంతకు ముందే నా కారుని ఇంటికి పంపించి, అతని కోసమే వెయిట్ చేస్తూ కారిడార్లో తిరుగుతున్నాను

కుమార్ బైక్ హిమాయిత్ నగర్ వైపు పరుగు తీసింది బైక్ మీద కూర్చునే అలవాటు అంతకు ముందు నాకు లేదేమో, ఎక్కడ పడిపోతానో అన్నట్టు భయం భయంగా కూర్చున్నాను

"స్వాతి!"

"ఏమిటి?"

"బైక్ మీద వున్నావో లేదో అని"

"నీ జోరు చూస్తే నా కలాగే వుంది కాస్త నెమ్మదిగా పోనీయ్ బాబు భయంగా వుంది"

ఈ బైక్స్ వున్నాయి చూసావా, స్పీడ్గా పోకపోతే నడవమని మొండికేస్తాయి అందులో అమ్మాయిలు వెనక్కూర్చుంటే వాటికి చాలా ఉషారు"

"అయితే ఇక్కడ ఆపేయ్. నేను ఆటోలో వస్తాను."

మాటల్లో పెట్టి అతను చాలా త్వరగా గమ్యం చేర్చాడు బైక్ ఒక చిన్న ఇంటి ముందు ఆగగానే, ఓ స్త్రీ తలుపు తీసి మమ్మల్ని చూసి నవ్వింది. వయసు ముప్పై అయిదు, నలభై మధ్య వుండచ్చు. కుమార్ వదిన కాబోలు అనుకున్నాను అతను అన్న, వదినల దగ్గరుండి చదువు కుంటున్నట్లు రెండు మూడుసార్లు చెప్పినట్లు గుర్తు వచ్చి

"మా వదిన" లోపలికి రాగానే కుమార్ పరిచయం చేసాడు.

"ఈమే వదినా స్వాతి. ఇంటికి వస్తానని రాకుండా చాలా సార్లు మోసం చేసినావిడ"

"మా కుమార్ కబుర్లు అలాగే వుంటాయ్. రాస్వాతి!"

నేను ఆమె చూపించిన కుర్చీలో కుర్చున్నాను.

"వదినా! స్వాతికి కొంచెం మొహమాటం... ఆవిడ బదులు కూడ నువ్వే మాట్లాడాలి"

"మా కుమార్ ఇంట్లో వుంటే ఒకటే సందడి"

"అసలతను డాక్టర్ ఎలా అయ్యాడా అని ఆశ్చర్యంగా వుంటుంది. ఏ టీచింగ్ ప్రొఫెషన్కో వెళితే బాగా రాణించేవాడు, ఆ వాగ్ధోరణితో"

"చూసావా, వదినా! నేనెక్కువ వాగుతానంటోంది."

"టీకి నీళ్ళు పెట్టాను ఊ. త్వరగా మొహం కడుక్కుని రా!"

కుమార్ వెళ్ళగానే, "ఇప్పుడే వస్తాను" అంటూ కుమార్ వదిన లోపలికి వెళ్ళారు నేను మెల్లగా కుర్చీకి జారగిల పడి గదిని పరిశీలించసాగాను. ఆ గదిలో సోఫాసెట్ మినహాయించి ఖరీదైన సామాను పెద్దగాలేదు గోడలకి బుద్ధుడి ఫోటో, దానికెదురుగా గీతోపదేశం చెక్కిన చెక్క పెయింటింగ్ గుమ్మాలకి కర్టెన్స్, వున్నంతలో పరిశుభ్రంగా వుంది ఇల్లు పనిమనుషులు అస్తమానం మా ఇంటిని సర్దటం వలన కాబోలు మా ఇల్లు ఎప్పుడు అతిధులను ఆహ్లాద పరిచేలా వుంటుంది దానికి తోడు శారద రోజుకో గంట అయిన, ఇంటి అలంకరణలో మునిగిపోతూ వుంటుంది గోడలకు వేసే పెయింటింగ్స్ దగ్గర నుంచి, గుమ్మాలకు కట్టే కర్టెన్స్ వరకూ మ్యాచ్ అయ్యాయో లేదో అని ఆరాటపడుతూనేవుంటుంది. తోటలో తాజా పూలు కోసుకువచ్చి తెల్లవారుతుండగానే కుండీల్లో అందంగా అమురుస్తుంది. శారద బహుశ మంచి గృహిణి అవుతుందేమో! అనుకుంటే నవ్వు వచ్చింది

"ఏమిటి, నీలో నువ్వే జోక్ వేసుకొని నవ్వేసుకుంటున్నావ్!" అంటూ కుమార్ వచ్చాడు

"ఏం లేదు"

ఇంతలో కుమార్ వదిన రెండు ప్లేట్స్ నిండా కారపూస, పూతరేకులు తెచ్చి మా ముందుంచారు

"ఇవన్నీ ఎందుకండీ?" నసుగుతూ అన్నాను.

"తింటానికండి" అంటూ నన్ను అనుకరిస్తు అన్నాడు కుమార్

"పూతరేకులు ఇవి ఎప్పుడైనా తిన్నావా?" అన్నారు కుమార్ వదిన

"ఆఁ నాన్నగారి ఫ్రెండ్ ఒకాయన రాజమండ్రి నుంచి వచ్చినప్పుడల్లా తీసుకొస్తారు"

"ఆఁ వదినా! నువ్వు కూర్చో మిగిలినవన్నీ నేను తీసుకొస్తాను" అంటూ ఆవిడను బలవంతంగా కూర్చోపెట్టి తను లోపలికి వెళ్ళాడు కుమార్.

"కుమార్ ఇంట్లో వుంటే నన్నొక్క పని చేయనివ్వడమ్మా!"

"మీ పిల్లలు స్కూల్ కెళ్ళారా?" అన్నాను చుట్టూ చూస్తు.

"నాకు పిల్లల్లేరమ్మా అన్నీ మాకు కుమారే! మా అత్తగారు, మామగారు పోయినప్పటినుంచి కుమార్ మాదగ్గరే అలవాటైపోయాడు కాబట్టి పిల్లల్లేని లోటు నేనంతగా ఎరగను."

ఆవిడ ఇంకా ఏదో కబుర్లు చెబుతూ, మధ్య మధ్య మా ఇంటి విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆవిడ దగ్గర సెలవు తీసుకుని బయట పడేసరికి బయట చాలా చీకటి పడింది. నేను ఆటోలో ఇంటికి వెళ్ళిపోతానంటే కుమార్ ఒప్పుకోలేదు.

దారిలో బైక్ టాంక్ బండ్మీద నిలిపేసాడు.

"మళ్ళీ ఇక్కడ కెందుకు? అసలే పొద్దు పోతేనూ" అన్నాను విసుగ్గా.

"ఇప్పుడే ఇంటికెళ్ళి ఆ పాడు పుస్తకాల్లో తల

దూర్చాలా ! ఫరవాలేదు. ఒక అరగంట ఇలా చల్ల గాలి పీల్చి వెళితే ఒంటికి మంచిది'' అంటూ అతను అక్కడే ఖాళీగా వున్న ఓ సిమెంట్ బెంచీ మీద కూర్చున్నాడు.

నేను అలాగే బైక్ పట్టుకుని నిలబడ్డాను, కుమార్ మొండి వైఖరిని తిట్టుకుంటూ.

''అదెక్కడకు పోదులే. నువ్విటురా !''

అంటూ కూర్చున్న చోటు నుంచే పెద్దగా. అన్నాడు.

''నీ బైక్ పోయినా నాకేం ఫరవాలేదు. నా టైమ్ పాడౌవుతోంది'' అన్నాను చిరాగ్గా.

''నీలాగా వీడేమైనా భాగ్యవంతుడనుకున్నావా ! ఒక బైక్ పోతే, మరొకటి తేలిగ్గా కొనుక్కోవటాడికి. ఔను. అంత పెద్ద భవంతిలో వుండే అమ్మాయిలా వుండవే. నిన్ను చూస్తుంటే ఆ ఇంట్లో అద్దె కుండే అమ్మాయను కుంటారు.''

''ఎవరేమనుకున్నా నాకేంకాదు. మన డాబు దర్జాలు చూపించటానికి కాలేజికి రానఖ్కర్లేదు.'' విసురుగా వచ్చి అతని పక్కన కూలబడ్డాను.

''నువ్వు కోపంలో మరీ అందంగా వున్నావ్. ఈ విషయం ఎవరూ చెప్పలే నీ కింతకుముందు.''

''నీలాంటి వాళ్ళెవ్వరు తగల్లేదు ఇంకా !''

''అయితే అదృష్టవంతుడి నన్నమాట''

కుమార్ మాటలు పట్టించుకోనట్లుగా నా గోళ్ళు చూసుకుంటూ కూర్చున్నాను.

''మీ లేడీస్ ఎందుకంత పెద్ద పెద్ద గోళ్ళు పెంచుతారు ?''

''నీలాంటి వాళ్ళనుండి రక్షించుకోటానికి !'' అన్నాను.

''నిజమా ! నా కి ం త వ ర కు తెలియదు ఆ విషయం.''

''ఇంతకీ ఇక్కడనుండి కదిలేది వుందా !''

''ఆ వెన్నెల చూడు ఎలా వుందో. నీటిలో స్నానం చేస్తున్నట్లు. ఇదే ఏ కృష్ణశాస్త్రి చూసాడనుకో...''

''ఆయన లేరు.''

''తెలుసులేవోయ్. నీ మనసేం స్పందిం చటంల్లా.''

ఇంతలో ఆటో ఒకటి ఖాళీగా పోతోంది. అది గమనించి, ఒక్క ఉదుటన లేచాను. ''నేను వెళుతున్నా'' అని ఒక్క మాట అనేసి గబుక్కున ఆటోలో కూర్చున్నాను.

''అదేం – కారు పంపేసి ఆటోలో వచ్చావ్ ?'' అంది హాల్లోనే ఎదురైన శారద.

శారదకి ఎలా చెప్పాలో అర్థంకాక, ''ఫ్రెండింటి కెళ్ళాలే'' అన్నాను. శారద మేకప్ చూస్తే ఎక్కడికో బయల్దేరినట్లనిపించింది. అది కట్టుకున్న అమెరికన్ షిఫాన్ చీర మాటిమాటికి సరిచేసుకుంటూ, వీధి వైపు చూస్తోంది.

''ఎక్కడికైనా బయల్దేరావా ?''

''నాన్నగారు రవీంద్రభారతిలో ఎమ్. ఎల్. వసంతకుమారి పాటకచ్చేరి వుంది, రెడీ అవమని ఫోన్ చేసారు. చూడు ఇంకా రాలేదు? మర్చేపోయారో ఏమిటో !'' అంది ఖంగారుగా.

''ఫోన్ చేసిన మనిషి ఎలా మర్చిపోతారు. వస్తారులే'' అంటూ ధైర్యం చెప్పి నా గదికి వచ్చేసాను.

ఆ రాత్రి పడుకోబోతున్నప్పుడు కుమార్ని అలా వదిలి రావటం గుర్తువచ్చి నవ్వు వచ్చింది. ''అతను ఏమి అనుకోడు కదా !'' అన్న ఆలోచనల మధ్య నిద్రలోకి జారాను.

* * *

మరునాడు కుమార్ని కలవలేదు. ఆ తరువాత రెండు రోజులకు హాస్పెటల్లోనే కలుసుకున్నాం ఇద్దరం. అతను మామూలుగానే 'విష్' చేసాడు.

రోజులు చాలా త్వరగా ముందుకు దూకుతున్నాయేమో అన్పించేది నాకు మటుకు. స్టడీహాలీడేస్ ఇచ్చారు. అర్థంకాని విషయాలేమైనా వుంటే కుమార్ని కలుసుకునేదాన్ని. ఒక్కొక్కసారి నన్ను చూడటానికి అతనూ వచ్చేవాడు. అతను ఓపిగ్గా తెలియని విషయాలు విడమర్చి చెబుతుంటే– 'సరదాగా ఏమి పట్టించుకోనట్లు వుండే ఇతనిలో ఇంత టీచింగ్ కెపాసిటీ వుందా !'– అని నాలో నేనే ఆశ్చర్యపోయేదాన్ని.

ఏళ్ళు, యుగాలే తనలో కలిపేసుకున్న కాల వాహినికి రెండు నెలలు ఒక లెక్క కాదు. పరీక్షలు, ఆ తరువాత ప్రాక్టికల్స్ అయ్యాయి. అన్నీ బాగా చేసానన్న తృప్తితో మనసు హాయిగా వుంది.

ఆ రోజు చాలా ఆలశ్యంగా నిద్రలేచి క్రిందకు దిగివచ్చాను. హాల్లో పచార్లు చేస్తున్న నాన్నగారు నన్నుచూడగానే, ''పది గంటలకల్లా రెడీగా వుండమ్మా ! సురేంద్ర వస్తున్నాడు. ఎరోడ్రోమ్ కెళదాం.'' అనేసి వెళ్ళిపోయారు.

'హతోస్మి !' అనుకుంటూ నేను మేడ మెట్ల మీద కూలబడ్డాను. సురేంద్ర కెనడా వెళ్ళి ఐదేళ్ళు దాటింది కాబోలు. అప్పుడే అతని చదువు పూర్తి అయిందా ! పరీక్షల అలసట ఇంకా తీరనేలేదు. మనసుకు మరో దెబ్బ.

షుమారు ఐదేళ్ళ క్రితం సంఘటన మనసులో మెదిలింది.

* * *


సురేంద్ర ఇంకా రెండు మూడు రోజుల్లో 'కెనడా' వెళతాడనగా, నాన్నగారు ఘనంగా సెండాఫ్ పార్టీ ఏర్పాటు చేసారు తమ ఇంట్లో. తనప్పుడు మెడిసిన్లో చేరిన మొదటి సంవత్సరం. సురేంద్ర తండ్రికి, నాన్నగారికి బిజినెస్ రీత్య వున్న స్నేహం తప్పించి మరో బంధుత్వం ఏమి లేకపోవటంతో, అంత గ్రాండ్గా నాన్నగారు పార్టీ ఎందుకిస్తున్నారో తను అర్థం చేసుకోలేకపోయింది.


నాన్నగారు పార్టీ ముగియగానే, ''సురేంద్ర తిరిగి వచ్చాక మా అల్లుడ్ని చేసుకోవాలనుకుంటున్నాను,'' అని స్నేహితులందరితోను చెప్పారు. సురేంద్ర, అతని తల్లిదండ్రులు ఈ విషయం ఇంతకు ముందే తెలుసున్నట్లుగా సంతోషం వెలిబుచ్చారు. అప్పటికప్పుడు తన ప్రమేయం ఏమీ లేకుండా తాంబూలాలు పుచ్చుకోవటం కూడ జరిగిపోయింది. సురేంద్ర బొమ్మలా కూర్చుండిపోయిన తన దగ్గరకొచ్చి తన వుంగరం తీసి తొడుగుతున్నప్పుడు కూడా తాను విరాగిలా కూర్చుండిపోయింది. ఏం మాట్లాడలేదు. అప్పుడు మెడిసన్ చదివి డాక్టర్ కావాలని కాంక్ష తప్పించి, వివాహం మీద, గృహిణి కావాలనికాని తను తలపోయనేలేదు. అన్ని విషయాల్లో తమని సంప్రదించందే ఏ నిర్ణయం తీసుకోని నాన్నగారు, ఈ విషయంలో తన ప్రసక్తి లేకుండా ఎందుకిలా ఖాయం చేసారో అప్పటికి ఇప్పటికి అర్థం కాదు తనకు.

''ఏమిటక్కా ! ఇంకా అలా కూర్చున్నావ్. బావ వస్తున్నాట్టా. లే. లే, త్వరగా తయారవు'' అంటూ శారద తుఫాన్లా వచ్చింది. ఆ రోజు నే కట్టుకోబోయే చీర దగ్గర నుంచి, పెర్ఫ్యూమ్ వరకు శారదే సెలెక్ట్ చేసింది.

''అక్కా ! మెడ బోసిగా ఏం బాగాలేదు. నా పొగడాల సెట్ ఇవ్వనా ?''

''వెళ్ళేది పేరంటానికి కాదుగా !'' అన్నాను చికాకును అణుచుకుంటూ.





"అబ్బా! అలా చిర్రు బుర్రులాడకు. స్మైల్ ప్లీజ్. అయినా ఇవన్నీ బావని చూసేవరకేలే!"

"సురేంద్ర అను. వరసలు కలపటం నా కిష్టంలేదు."

"అక్క భర్త బావకాక ఇంకేమవుతాడు" శారదతో వాదన అనవసరం అనుకుంటూ క్రిందకు దిగి వచ్చేసాను.

మేము వెళ్ళేసరికి ఆలస్యం అయింది కాబోలు, సురేంద్రవాళ్ల అమ్మా, నాన్నతో కార్లో ఎక్క బోతున్నవాడల్లా మమ్మల్ని చూసి వెనక్కి వచ్చాడు.

"అరే చాలా పెద్దదానివైయ్యావే" అంటూ ముందుగా నన్ను చూసి పలకరించాడు.

నన్ను చూసి శారదనుకుంటున్నాడేమో అన్పించి "నేను స్వాతిని" అన్నాను చిన్నగా.

"ఐ నో యూ ఆర్ స్వాతీ!"

సురేంద్రలో చాలానే మార్పు కనిపించింది. కెనడా వెళ్ళేముందు సన్నగా పీలగా వుండేవాడు. ఇప్పుడు అక్కడ వాతావరణానికి పుష్టిగా, తెల్లగా వున్నాడు. జుట్టు కొంచెం పలచబడింది. ఫారెన్ రిటర్న్డ్ అని చూసేవాళ్ళకు తెలియాలని చాలా తాపత్రయ పడ్డట్టనిపించింది. ముఖ్యంగా ఆ నవ్వు, మాట తీరు మారింది. ప్రతిదానికి స్టైల్‌గా తలవాల్చి 'యా' అంటం. అతనక్కడ చదువు కున్నాడో ఓపిగ్గా ఫ్యాషన్స్ నేర్చుకున్నాడో తెలియ లేదు నాకు.

సురేంద్ర తరువాత నాన్నగారితోను, శారదతోను మాట్లాడుతుండగా మెల్లగా కార్లో కూర్చున్నాను.

"అదేం బావను చూడగానే సినిమాలో హీరోయిన్‌లా ఒక్కసారి గంతేసి చుట్టేస్తావను కున్నాను..." శారద మాటలు పూర్తవకుండానే,

"ఉష్ అరవకు" అన్నాను చిరాగ్గా.

"బావ సాయంకాలం వస్తాట్టా!" అంది అదేం పట్టించుకోకుండా.

"ఏమ్మా! అతనితో ఒక్క మాట అయినా మాట్లాడకుండా వచ్చేసావ్!" అని అడిగారు నాన్నగారు కారు స్టార్ట్ చేస్తూ.

"ఐదేళ్ళ తరువాత ఒక్కసారి చూస్తే ఏం మాట్లాడాలో తెలియలేదు నాన్నా" అన్నాను బయటకు చూస్తూ.

నాన్నగారు సురేంద్ర గురించి ఏవేవో చాలా చెబుతున్నారు. శారద మధ్య మధ్య ప్రశ్నలు వేస్తూ ఉషారుగా వింటోంది. నా కవేమి చెవులో పడటం లేదు. ఇంటికి వెళ్ళాలని లేదు. ఏ స్నేహితురాలి ఇంటికో వెళ్ళి సాయంకాలం వరకు గడపాలని వుంది. కారు టాంక్‌బండ్ చివర్లోకి రాగానే,

"నాన్నగారు. ఒక్కసారి కారు ఆపండి!" అన్నాను.

ఆయన ఖంగారుగా సడన్ బ్రేక్ వేసారు.

"ఏం లేదులేండి. ఇక్కడ నా ఫ్రెండ్ రమణి వాళ్ళిల్లు వుంది. ఒకసారి కలుసుకొని మెల్లగా ఇంటికి వస్తాను." అని చెప్పి దిగిపోయాను.

రమణి వాళ్ళిల్లు చిక్కడపల్లిలో వుంది. ఎప్పుడైనా తోచనప్పుడు వెళితే అది మంచి కాలక్షేపం ఇస్తుంది. నేను వాళ్ళింటికి వెళ్ళేసరికి, తలుపు తాళం వేసి వుంది. ప్రక్కవాళ్ళ నడిగితే, "నిన్ననే బెంగుళూర్ వెళ్ళారు అంతా" అని చెప్పారు.


'ఈ రోజు బాగాలేదు.' అనుకుంటూ బస్‌స్టాప్ వైపు నడిచాను. రోడ్డు క్రాస్ చేస్తూండగా, కుమార్ బైక్‌మీద వెళుతూ కన్పించాడు. అతను నన్ను చూసి, బైక్‌ని వెనక్కి త్రిప్పి నా చుట్టు ఒక ప్రదక్షణం చేయించి ఆపాడు!


"నీ బైక్‌కి అమ్మాయిల్ని చూస్తే ప్రదక్షణాలు చేయాలని కూడా అనిపిస్తుందా?" అన్నాను, చిలిపిగా.

"అందర్నీ చూస్తేకాదు – అందమైన అమ్మాయిల్ని చూస్తేనే. ఇంతకీ ఏమిటి చాలా స్పెషల్‌గా కనిపిస్తున్నావ్ ఈ రోజు. నీ శకటం ఏది. ఇలా ఈ బాటను రావటానికి కారణం ఏమిటి?"

"స్నేహితురాలింటికి వచ్చాను. అది లేదు.

"మొండి ఘటం" లో చిరంజీవి, రాధిక




మీ స్నానమునందు ఒక క్రొత్తదనము నిచ్చు
సబ్బు- ప్రేమ్
క్రొత్త
సుకుమారమైన మీ చర్మ సౌందర్యమునకు ప్రేమ్.
దీని పరిమళము స్వచ్ఛమైన నురగ మీ శరీరమును
ఆహ్లాదింపజేయును
మీ శరీరమునకు మృదుత్వమునిచ్చు సబ్బు-ప్రేమ్.
Imageads-M-1564
NEW
Prem
REFRESHING SOAP
PREM
జయలక్ష్మి
గుంటూరు వారి తయారీ
ప్రేమ్ - తాజాతనము నందించు సబ్బు.

సీరియల్

ధర్మో రక్షతి రక్షితః

ఆకెళ్ళ వెంకట సూర్యనారాయణ

(గత సంచిక తరువాయి)

6

పరమేశ్వరశాస్త్రి వివాహం, గౌతమశాస్త్రి ఉపనయనం జరిగిపోయాయి. బంధువులు పెళ్ళి హడావిడిలో ఒళ్ళుహూనం చేసుకుని ఎవరిళ్ళకువాళ్ళు చేరుకున్నారు.

కృష్ణశాస్త్రి భార్య తాయారు, పిల్లలూ ప్రయాణం కట్టేరు శ్రీరామశాస్త్రి చిన్న చెక్క పెట్టెలో పుస్తకాలూ, రెండుజతల బట్టలూ పెట్టుకుని బాబాయితో వెళ్ళడానికి సిద్ధంగావున్నాడు.

"అన్నయ్యా ! మరి నేను వెళ్ళొస్తా!"

"మంచిదిరా "

"మరి శ్రీరామ్‌ని తీసుకెళ్ళడం.. "

"అలాగేచేయి. వాణ్ణి బళ్ళో చేర్పు. ఏనాడు వాడికి చదువుమీద శ్రద్ధ తగ్గితే ఆనాడు వాణ్ణి పంపించేయి "

గుమ్మంలో నిలబడి ఆశగా తండ్రి ముఖంలోకి చూస్తున్న శ్రీరామ్ ముఖం వికసించింది.

లలితాంబ కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ తాయారు చేతులు పుచ్చుకుని,

"కుర్రాడు చదువుకుంటానంటున్నాడని — వాడి ఉత్సాహాన్ని భంగం చేయలేక పంపుతున్నాను. వాడ్ని నువ్వు "

"నా కడుపులో పెట్టుకుని చూసుకుంటాను. సరేనా. వాడు నాకు పైవాడా అక్కయ్యా..." అంది తాయారు.

అంతా బయటికొచ్చేరు,

అరుగుమీద కూర్చున్న సోమిదేవమ్మ...

"ఒరేయి కృష్ణుడూ. ." పిలిచింది.

"ఏమ్మా !" అంటూ తల్లి దగ్గరకొచ్చాడు కృష్ణశాస్త్రి.

"ఒరేయ్ . నా కడుపున వెర్రికాయగా పుట్టేడు యజ్ఞన్న వాడికి లోకజ్ఞానం లేదు. ఆ మీనాక్షికి నువ్వే పుణ్యం కట్టుకుని రెండు అక్షింతల గింజలు వేయించాలి "

"అలాగేనమ్మా. తొందరేముంది ? కొంచెం ఖర్చు సర్దుకుని అలాగె చేద్దాం" అన్నాడు.

"దాని పెళ్ళి ... నేను కళ్ళతో చూస్తానో లేదోనని నా బెంగ" ..అందామె.

"తప్పకుండా చూస్తావు. నేను వెళ్ళొస్తానమ్మా!" తల్లికి పాదాభివందనం చేశాడు కృష్ణశాస్త్రి. శ్రీరామ్ కూడా తల్లికి, తండ్రికి, మామ్మకి పాదాభివందనం చేసి బాబాయిని అనుసరించేడు

పరమేశ్వరుడు అరుగుమీద కిటికీదగ్గర కూర్చుని వున్నాడు. అటుగా వచ్చిన సుబ్బలక్ష్మి —

"ఇదిగో .. ఇలారా. ." అంటూ పిలిచింది.

గృహప్రవేశం అయిన తరువాత ఆడపెళ్ళివారు సుబ్బలక్ష్మిని తీసుకుని వెళ్ళబోయేరు కాని గౌతమశాస్త్రి ఉపనయనం నిశ్చయం కావడంతో వాళ్ళ ఊరికి వర్తమానం పంపి ఆగిపోయారు.

"ఎందుకూ ?" అరుగు దిగకుండానే అడిగేడు పరమేశ్వరుడు. ఆమె అరుగు దగ్గరున్న పూలమొక్క దగ్గర నిలబడివుంది

"ఇలారా సమంది " బిగ్గరగా పిలిచిందామె

తమ్ముడిని, మరదల్ని పంపించి గుమ్మంలో నిలబడిన దీక్షితులుగారు, లలితాంబ అది చూశారు ఆ బాల జంటను చూసి నవ్వుకుంటూ నిలబడ్డారు.

"ఏం ? నేను రాను "

"రమ్మంటే నీక్కాదూ ?" అందామ్మాయి.

దీక్షితులుగారు లలితాంబకేసి చూశారు క్షణంలో మనోభావాన్ని గ్రహించిందా అర్ధాంగి. దీక్షితులుగారు లోపలికి వెళ్ళిపోయారు.

లలితాంబ కోడలి దగ్గరకెళ్ళి, "చూడమ్మా. . అతను నీ భర్త ఇలారా.. అలారా అని పిలవకూడదు గౌరవంగా సంబోధించాలి" అంది.

"పువ్వులండీ . అందటంలేదు."

"ఆవిడని అత్తయ్యా అని పిలవాలి" వెనక నుంచి వచ్చిన తల్లి అంది. వ్యక్తురాలైన తరువాత ఉత్తరం రాస్తామని, పెళ్ళికూతుర్ని తీసుకుని ఆ పూటే తల్లి, తండ్రి మలికిపురం వెళ్ళిపోయారు.

7

దీక్షితులుగారు నిత్యాగ్నిహోత్రాలూ, మిగిలిన కార్యక్రమాలూ యథావిధిగా ముగించుకుని బయటికొచ్చేరు. ఏకాదశి ఉపవాసం. ఆయన బయటికొచ్చేసరికి గుమ్మంముందర ఎండపొడలో కూర్చునుంది సోమిదేవమ్మ.

"ఏమిటమ్మా ! ఎండలో కూర్చున్నావు ?" అంగవస్త్రం . గుమ్మంముందున్న కొబ్బరితాడుమీద ఆరేస్తూ అడిగారాయన — సోమిదేవమ్మ మాట్లాడలేదు

"అమ్మా ! అమ్మా !!" అంటూ మరో రెండుసార్లు పిల్చినా ఆమెలో కదలికలేదు.

దీక్షితులుగారి కేదో అనుమానం తోచింది. ఆమెను తట్టి కుదిపేరు. మరుక్షణంలో గ్రహించేరు ఆమె శివసాన్నిధ్యం చెందిందని.

కళ్ళనీళ్ళు ఉబుకుతూంటే అక్కడే కూలబడిపోయారు. ఎంతో గంభీరంగా కనిపించే ఆయన పసిపిల్లవాడయిపోయారా క్షణం

లలితాంబ పరుగెత్తుకొచ్చింది. పిల్లలు చుట్టుముట్టేశారు. ఏడుపులు, పెడబొబ్బలతో ఆ యిల్లు మార్మోగిపోయింది.

ఊరంతా కదిలివచ్చి భౌతికకాయాన్ని దర్శించుకున్నారు కృష్ణశాస్త్రికి, కూతుళ్ళకూ.. అందరికీ కబుర్లు వేరాయి. వాళ్ళు వచ్చేశారు.

శుభకార్యానికి వేసిన పందిరి ఇంకా విప్పలేదు. తను అనుకున్న పనులు నెఱవేర్చిన తృప్తితో సోమిదేవమ్మ కన్ను మూసింది,

పచ్చటి తాటాకు పందిరి క్రిందనే ఆ పుణ్యమూర్తికి పాడె కట్టేరు

దీక్షితులుగారు మౌనులయ్యేరు. శేషాద్రి ముందుకొచ్చి వ్యవహారం చూస్తున్నాడు శివరామయ్య కావలసిన డబ్బు ఇస్తున్నాడు.

ద్వాదశి ఘడియల్లో దహనక్రియ జరిగిపోయింది. పన్నెండు రోజుల కర్మకాండ శాస్త్రోక్తంగా జరిగిపోయింది గోదాన, భూదాన, సువర్ణ దానాలు; సంతర్పణలు ముసలామె కర్మ మరో పెళ్ళిలాగే జరిగిపోయింది.

ఆమెతో ఒక తరానికి . కొన్ని నమ్మకాలకీ ఆచారాలకీ గత ధార్మిక వ్యవస్థకూ కూడా అంత్యక్రియలు జరిగిపోయాయి.

జరిగిన కథ — 2 : యజ్ఞన్న దీక్షితులు సనాతనుడు. ఆయన భార్య లలితాంబ. వారి సంతానం పరమేశ్వరశాస్త్రి, శ్రీరాముడు, గౌతమశాస్త్రి, మీనాక్షిలు. పరమేశ్వరశాస్త్రి తండ్రివద్దనే వేదాధ్యయనం చేస్తుంటాడు. శ్రీరాముడు అమలాపురంలో చదువుకొంటానంటాడు. దీక్షితులు పెద్దకుమారుడు పరమేశ్వరశాస్త్రికి, ధూళిపాళ సోమయాజులు ప్రథమ పుత్రిక సుబ్బలక్ష్మికి బాల్య వివాహం జరిపిస్తారు. గృహప్రవేశం అనంతరం నవిలో నవిగా గౌతమశాస్త్రికి ఉపనయనం కూడా జరిపించేస్తారు దీక్షితులుగారు.

భాగం - 2

శ్రీరామ్ రోడ్డు వారన బస్ దిగేడు కిళ్ళీ కొట్టు దగ్గర నిలబడిన ఇద్దరూ శ్రీరామ్‌ని కొత్త ముఖం ఎవరన్నట్లు చూశారు శ్రీరామ్ వాళ్ళని చూస్తూ రోడ్డు పట్టాడు. చేలు భారంగా వంగి నిండు చూలాళ్లా వున్నాయి. మట్టిరోడ్డుమీద ముందు వెళ్ళిన బళ్ళ జాడల్లో నీళ్ళు నిలిచి నడవటానికి ఇబ్బంది పెడుతోంది.

'ఈ ఊరు మారదు. ఈరోడ్డు మారదు'

ఆరేళ్ళుగా ఎప్పుడైనా శలవులకి వచ్చి పోయేటప్పుడు అనుకునేమాటనే మరోసారి అనుకున్నాడు శ్రీరామ్.

ఊరి మొదలు కొచ్చేసరికి వేణుగోపాలస్వామి ఆలయం పక్కనే చెరువూ, వాటిల్లోని తామర పువ్వులు అందంగా వున్నాయి.

మాధవాచార్యులు గుడి బయటకొచ్చి, గుడి ముందు అల్లరిచేస్తున్న మూకను అదిలిస్తున్నాడు. వాళ్ళు అతన్ని ఎక్కిరిస్తూ పరుగులు తీస్తున్నారు

శ్రీరామ్‌ని దూసుకుంటూ వెళ్ళిపోయే రా కుర్రాళ్ళు మరి కొంచెం ముందుకొచ్చేసరికి నంది సావిడి శేషాద్రి, బుచ్చిరాజు కూర్చుని మాట్లాడు కుంటున్నారు.

"అబ్బాయిగారి చదువెంతవరకూ వచ్చింది ?!" పలకరింపుగా అన్నాడు శేషాద్రి

"ఎస్ ఎస్ ఎల్ సి పాస్ అయ్యేను ఈవేళే రిజల్ట్సు వచ్చేయి నాన్నగారితో చెప్పిపోదామని వచ్చేను" అన్నాడు శ్రీరామ్ సంచీని చేయి మారుస్తూ

"మా కాటంరాజుగాడు ప్యాస్ అయ్యాడా ?" అడిగేడు బుచ్చిరాజు.

"నెంబరు నాకు తెలియదండి"

"సెలవులకు రాలేదనుకుంటాను"

"లేదు ట్రైపు వేర్చుకుంటున్నాను" అన్నాడు శ్రీరామ్.

వాళ్ళు తలూపేరు

వాళ్ళ దగ్గర సెలవు తీసుకుని బయలుదేరాడు


తన వీధికి తిరిగేసరికి గౌతమ్, సుబ్బరాజు చెట్టుక్రింద గోటీబిళ్ళ ఆడుతూ కనిపించేరు

సుబ్బరాజు, బుచ్చిరాజు రెండో కొడుకు గౌతమ్‌కి సహాధ్యాయి ఇద్దరూ పదమూడేళ్ళవాళ్ళే అయినా ఆ ఊరి స్కూల్‌ని వదలకుండానేవున్నారు

అన్నని చూడగానే గౌతమ్ చేతిలో కర్ర జారిపోయింది

"ఏమిట్రా ఈ ఆటలు ? మనబోటివాళ్ళు ఆడాల్సిన ఆటలేనా ?" అడిగేడు శ్రీరామ్

గౌతమ్ మాట్లాడకుండా ఇంటికేసి నడిచాడు



"ఏరా! సుబ్బరాజా నువ్వూ మా వాడితో అయిదో తరగతి మూడేళ్ళు చదువుతూ కూర్చున్నావా ?" అడిగేడు

బుచ్చిరాజు నిక్కరు దులుపుకుంటూ పరిగెత్తాడు

శ్రీరామ్ ఇంటి గుమ్మంలో కొచ్చేసరికి అరుగు మీద శర్మ కుమార్తెతో వామనగుంటలాడుతున్న మీనాక్షి అన్నగారిని చూసీ చూడగానే లోనికి సిగ్గుతో పరిగెత్తింది. ఆమె సిగ్గు పడటానికి కారణం ... ఆమె వేసుకున్న వళ్లోవాటు. ఆమె వ్యక్తురాలయిన తరువాత అన్నగారు రావడం ఇదే అందువల్ల ఆమెకా దుస్తుల్లో అన్నగారిని చూడాల్సి రావడంతో లోపలకు పరుగెత్తింది

"ఏం రత్నం! బాగున్నావా ?" శర్మ కూతుర్ని పలకరించేడు శ్రీరామ్

ఆ పిల్ల సిగ్గుపడి ఒదిగి, తలూపి తవింటికి వెళ్ళిపోయింది

'ఆడపిల్లలకు సిగ్గు ఎంతలో ముంచు కొస్తుంది ?' అనుకుంటూ ఇంట్లోకి అడుగు పెట్టాడు.

కర్రకుర్చీలో కూర్చుని విసనకర్రతో విసురుకుంటున్న దీక్షితులుగారు కొడుకుని చూడగానే ఆశ్చర్యపోయి,

"ఏమిట్రోయ్! చెప్పా పెట్టకుండా ఊడి పడ్డావు ?" అన్నారు

శ్రీరామ్ సెలవులకి రాలేదని ఆయనకు కోపంగా వుంది ట్రైపు నేర్చుకోవడం దండుగని, ఇప్పటికి చదివిన చదువు చాలనీ ఆయన అభిప్రాయం

"రిజల్సు వచ్చేయి నాన్నగారూ నేను మొదటి తరగతిలో పాసయ్యేను." అన్నాడు శ్రీరామ్.

దీక్షితులుగారు ఒక్క ఉదుటన లేచి వంటింటి కేసి తిరిగి,

"ఏమేవ్! శ్రీరాముడు ఉత్తీర్ణుడయ్యేడు." సంబరంగా అరిచేరు

లలితాంబ బయటికొచ్చి, "ఎప్పుడ్రా రావటం ? సెలవులకైనా వచ్చేవుకాదు తాయారూ . పిల్లలు కులాసాగా వున్నారా ?" అంది

"అంతా కులాసాయేనమ్మా నేను పరీక్ష పాస్ అయ్యేను"

"పోనీలే నాయనా. నిన్ను చదివించినందుకు

అయిందనిపించేవు. మీ బాబాయికి చెప్పి ఎక్కడయినా పనికూడా చూసుకో ''

''అప్పుడే ఉద్యోగం ఏమిటమ్మా. నాకింకా పద్దెనిమిది రాలేదు మంచి ఉద్యోగం రావాలంటే ఇంకా పై చదువు చదవాలి'' అన్నాడు.

దీక్షితులుగారు కొడుకు మొహంకేసి చూస్తూ చతికిలపడ్డారు.

''వంట అవుతోందిలే. కాళ్ళు కడుక్కుని రా. రేపు మీ మామ్మ తద్దినం సరిగ్గా వచ్చేవు'' అంది లలితాంబ

''మామ్మ తద్దినం రేపా ? అప్పుడే ఆరేళ్ళయిందా పోయి ? మామ్మ వుంటే ఎంత సంతోషించునో ఈవాళ '' అన్నాడు శ్రీరావ్.

''అన్నయ్యా ! కాళ్ళు కడుక్కుని రా'' అంటూ నీళ్ళందించింది మీనాక్షి

''ఏమిటే ఏమైనా చదువుతున్నావా ? ఇదివరకూ తెచ్చిన పుస్తకాలు చదివేవా ? నిన్ను మెట్రిక్ కట్టిస్తాను.''

''చాల్లే దానికొచ్చిన చదువు'' అన్నారు దీక్షితులుగారు

గౌతవ్ వరండాలోంచి తొంగి చూస్తున్నాడు.

మండువాలో కాళ్ళు కడుక్కుంటున్న శ్రీరావ్ చూశాడు.

''ఒరేయి ఇలా రా ..'' పిలిచేడు.

''ఏం ?'' నెమ్మదిగా ముందు కొచ్చేడు గౌతవ్.

''ఇదుగో నువ్వడిగిన కథల పుస్తకాలు'' పంచతంత్రం కథల పుస్తకం సంచీలోంచి తీసి ఇచ్చాడు శ్రీరావ్

''కథల పుస్తకాలు తక్కువయ్యేయి వెధవకి. మూడేళ్ళుగా అయిదోక్లాసు దాటటం లేదు గాడిద'' అన్నారు దీక్షితులుగారు పుస్తకం తీసుకుని బయటకు పరిగెత్తాడు గౌతవ్

పరమేశ్వరుడు భుజానికి ఎడాపెడా అంగవస్త్రంని కట్టిన మూటవేసుకుని లోపలకు వచ్చేడు.

చిన్న మొలకలుగావున్న జుత్తు, మధ్యనో పిలక, విభూతి రేకలు, సింధూరం, పంచె, పైన ఒక కండువా. చెవులకు కుట్టుపోగులు వేసుకుని

ధర్మోరక్షతి రక్షితః

చంకకింద అరిటాకులు పెట్టుకుని నిలబడిన పరమేశ్వరుణ్ణి చూస్తూ వుండిపోయేడు శ్రీరావ్ అన్న వయసు ఆ ఆకారంలో ఇరవైరెండు ఏళ్ళు కాదని, ఏ నలభయ్యో వుంటాయని అనిపించింది శ్రీరావ్‌కి

అలాగే ఫుల్ పాంటూ, టీషర్టూ వేసుకుని ఊయల బల్లమీద కూర్చుని మాట్లాడుతున్న తమ్ముణ్ణి వింతగానే చూశాడు పరమేశ్వరుడు.

తాను చదువుకోవాలని నిశ్చయించుకున్నందుకు తనను తాను అభినందించుకున్నాడు శ్రీరావ్ లేకుంటే తనూ అన్నలాగే.. చ. .ఛ అనిపించింది

కొన్ని క్షణాలు ఒకరి నొకరి చూస్తూ వుండిపోయేరు పరమేశ్వరుడే ముందు పలకరించేడు

''ఏరోయ్ ! ఎప్పుడొచ్చేవ్ ?'' సంభ్రమాశ్చర్యాలతో కొంచెం గట్టిగానే అడిగేడు పరమేశ్వరుడు

''అన్నగారి వాలకమేకాదు. మాటలు కూడా అనాగరీకంగానే వున్నాయి' అని అనుకోకుండా వుండలేకపోయాడు శ్రీరావ్

''ఇప్పుడే వచ్చాను'' అన్నాడు పొడిగా.

''పరీక్ష ఏమైందిరా ?'' ఆత్రంగా అడిగేడు

''పాసయ్యేను'' నెమ్మదిగా అన్నాడు

''పోన్లే ! గట్టెక్కేశావు'' అన్నాడు భుజం మీద మూటలు దింపుతూ. 'గట్టెక్కటమేమిటి ? తను నీటిలో వున్నాడా ? భావప్రకటన కూడా అలాగేవుంది' అనుకున్నాడు

''ఒసేవ్ ! ఓయ్ ... '' పెడబొబ్బలు పెట్టాడు వంటింట్లోకి పరమేశ్వరుడు

''ఏమిట్రా ! హడావుడి ఈ రోజు ?'' అడిగేరు దీక్షితులుగారు

''వరహాల్రావింట్లో సత్యన్నారాయణవ్రతం చేయించేను.''

ఆయన తలూపి ఊరుకున్నారు.

లోపలనుంచి చేట చేత్తోపుచ్చుకుని వచ్చింది సుబ్బలక్ష్మి. ఆమె వ్యక్తురాలై కాపురానికి వచ్చి ఏడాదయింది. గోచీపోసి — చీర, నుదుటిని కానీ అంత బొట్టు, మెళ్ళో మంగళసూత్రాలు, కడియాలూ వేసుకుని వుంది. కాపురానికొచ్చిన ఏడాదిలో ఆమె ఒళ్ళు చేసింది

వదినగారిని చూసి ఆశ్చర్యపోయాడు శ్రీరావ్. నిండా పదహారేళ్ళులేవు కాని ఆరిందాలా కనపడింది వదిన ఈ వయసుకింకా పట్నంలో వోణీలు వేయటంలేదు. వదినప్పుడే కాపురానికొచ్చి ఏడాదయింది.

''ఏం వదినా కులాసానా ?'' ఆలోచనలు దాచుకుంటూ అడిగేడు.

''ఆఁ ! నువ్వు కులాసాగా వున్నావా ? ఎప్పుడు తిన్నావో ఏంటో వెళ్ళి స్నానం చేసిరా . పట్టుబట్ట ఇస్తాను'' అందామె

ఆమె సమాధానం విని ఆశ్చర్యపోయాడు

ఆమె చకచకా భర్త తెచ్చిన మూటల్ని విప్పింది

బియ్యం, తమలపాకులు, డబ్బులు కలగలిపి వున్న మూటని చేటలో పోసింది

''సత్యన్నారాయణ వ్రతమేమిటి ?'' అందామె బియ్యంలో వున్న ఆకుల్ని, చెక్కల్ని ఎత్తి వేరే పెడుతూ

''చక్కలన్నీ పంచపాత్రలో వేయి'' అన్నాడు పరమేశ్వరుడు — తనూ మూట ముందు చతికిలపడి.

పరమేశ్వరుడు మూటలో వున్న చిల్లరనంతా ప్రోగుచేశాడు వాటిని తీసుకున్నాడు

సుబ్బలక్ష్మి మిగిలిన మూటల్ని విప్పి క్షణంలో వేటి కవి వేరుచేసి వంటింట్లోకి తీసుకెళ్ళిపోయింది.


చిల్లరపైసలు, పంచాంగంలోంచి నోట్లు తీసుకొచ్చి తండ్రి ముందున్న ఊయలబల్లపై వుంచాడు పరమేశ్వరుడు

ఇదంతా విచిత్రంగా చూస్తున్నాడు శ్రీరావ్.

ఉద్ధరించనివ్వండి !

మైలపడిందని
తెలిసికూడ
వ్యవస్థవైపు
పారజూడరు
పుస్తకాలపై పరదాలా
పేరుకొన్న దుమ్మును
అసలే పట్టించుకోరు —
కుళ్ళు కంపుకొడుతున్నా
కులం గిలం కావాలి
చిత్తశుద్ధి లేకున్నా
పెత్తనాలు చెల్లాలి
ఇక బూజుపట్టిన
భావాలను, సమాజాన్ని
వీళ్లేం మార్చగలరు ?
అందుకే ఓల్డీజ్ గోల్డంటూ
ఇలా ఎంతకాలం . ?
ఉద్ధరిస్తారో
ఉద్ధరించనివ్వండి !

— మంతెన సూర్యనారాయణరాజు



తన బాల్యం అంతా ఇక్కడే గడిచింది. తండ్రి ఏనాడూ ఇలాంటి పనులు చేయలేదు.

యాగాలూ, యజ్ఞాలూ చేయించేవాడు. గౌరవంగా పిలిచిన చోటికి ఆశీర్వచనానికి వెళ్ళేవాడు. అప్పుడు తనకెన్నడూ న్యూనత అనిపించలేదు. ఇప్పుడు తన కుటుంబంమీద తనకే చిరాకు కలుగుతోంది.

"నువ్వింకా కూర్చున్నావేంరా ? నువ్వెళ్ళి స్నానం చేసి, సంధ్యావందనం కానీయ్" అన్నారు దీక్షితులుగారు, కొడుకు తనముందు పెట్టిన డబ్బు లెక్క చూస్తూ.

శ్రీరామ్ నిట్టూర్చి లేచాడు.

"సంధ్యావందనం అయిందిరా ?" లోనికి వచ్చిన గౌతమ్‌ని అడిగేరాయన.

"లేదు ఆకలిగా వుంది . రేపు చేస్తా "

"రేపే భోంచేయ్ ! . చెప్పిన మాట వినకుండా తయారవుతున్నావు" గర్జించేరాయన

దాంతో గౌతమ్ నూతి దగ్గరకు పరుగెత్తాడు

శ్రీరామ్ కేంచెయ్యాలో తోచలేదు సంధ్యావందనం ఎప్పుడో మర్చిపోయాడు. గాయత్రీ మంత్రం మాత్రం గుర్తుంది అదీ యజ్ఞోపవీతం మార్చుకునేటప్పుడు చేస్తున్నాడు కనుక

'సరే ! గౌతమ్‌తోపాటు ఏదో చెయ్యి తిప్పేస్తే సరిపోతుంది' అనుకుంటూ పెరట్లోకి నడిచేడు.

"ఏమేవ్ ! ఇలా రా." పిలిచేరు దీక్షితులుగారు

లలితాంబ బయటికొచ్చింది.

"మధ్యాహ్నం పెళ్ళివారొస్తున్నారు ఏం చేశావు ?" ప్రశ్నించారు భార్యని

"తొక్కుడులడ్డు చేసి, పూసదూచేశాను "

"అప్పుడే అయిపోయిందా ?"

ఆమె తలూపింది.

మధ్యాహ్నం పడుకున్న శ్రీరామ్ మండువాలో ఎవరో గట్టిగా మాట్లాడుతున్నట్లయి కళ్ళుతెరిచేడు ఒంగిచూస్తే, మండువాలో నలుగురు కూర్చుని మాట్లాడుకుంటున్నారు తనూ లేచి మొహం కడుక్కుని బయటకొచ్చేడు కాఫీ తాగాలని వుందతనికి. కానీ ఇంట్లో దాని వాసన పడదు

పెళ్ళి చూపులు జరుగుతున్నాయి

మీనాక్షి తల నేలకువంచి కూర్చుంది. కుర్చీలో కూర్చుని వున్నాడో ఇరవై యేళ్ళ కుర్రవాడు చెవులకు పోగులున్నాయి తల నున్నగావుంది మధ్యన బండి పిలక వుంది. పంచె కట్టుకుని పైన మల్లు లాల్చీ వేసుకున్నాడు. అదే అతనికి కురచగావుంది ఊయలమీద కూర్చున్న పెద్దాయన కుండలాలూ, సేలం పంచే కండువా, శాలువా చూడగానే పండితుడిలా వున్నాడు.

"మా అబ్బాయి రెండోవాడు. స్కూల్ ఫైనల్ అయ్యాడు" అన్నారు దీక్షితులుగారు, ఆయనకేసి తిరిగి.

శ్రీరామ్ నమస్కరించాడు

"దీర్ఘాయుష్మాన్‌భవా !" అన్నారా పెద్దాయన తరువాత మీనాక్షికేసి తిరిగి .

"ఏమమ్మా . ఏమైనా పాటలొచ్చా ?"

"రావండీ. మా అమ్మాయి భారత భాగవతాలు మాత్రం చదువుకుంది. వాటి కర్థంకూడా చెప్ప గలదు" అన్నారు దీక్షితులుగారు.

పెళ్ళికొడుకు తల్లికాబోలు, మీనాక్షి దగ్గర కూర్చుని, పట్టేలు చూసే మిషతో మోకాలువరకు పరికిణ ఎత్తి పరీక్షగా చూస్తోంది.

పెళ్ళికొడుకు బెరుగ్గా కూర్చున్నాడు.

శ్రీరామ్‌కా వాతావరణం ఏదో చికాకుగా తోచింది బయటకు నడిచేడు. అతనికి తలనొప్పిగా వుంది. ఆరు సంవత్సరాల అలవాటు ! కాఫీ తాగాలని వుంది. కాని జేబులో డబ్బుల్లేవు. ఉన్న డబ్బులు ప్రయాణానికి సరిపోయాయి. ఇంట్లో దొరకవు ఆలోచిస్తూ బయటికొచ్చేడు.

బయటనుంచి గేటు తీసుకుని ఆదరాబాదరా వస్తున్నాడు పరమేశ్వరుడు. తమ్ముణ్ణి చూడగానే—

"ఏరా ! పెళ్ళివారొచ్చారా ? వాళ్ళకోసం బండి తీసుకుని రోడ్డు కెళ్ళొచ్చేను" అన్నాడు.

"వచ్చేరు" అన్నాడు

"అరె ,రే " అంటూ లోపలకు వెళ్ళబోయాడు

"అన్నయ్యా !" అంటూ పిలిచేడు.

"ఏరా !" మెట్లెక్కుతున్న పరమేశ్వరుడు వెనక్కి వచ్చి అడిగేడు తనెందుకు పిలిచేడో చెప్పడానికి సిగ్గుపడ్డాడు. మౌనంగా వుండిపోయాడు.

"ఏరా ?" రెట్టించాడు పరమేశ్వరుడు

"డబ్బు ఏదైనా వుందిరా ?"

పరమేశ్వరుడు క్షణం ఆశ్చర్యంగా చూసి . అప్రయత్నంగా 'దేనికిరా ?' అన్నాడు

శ్రీరామ్ తల దించుకున్నాడు.

పరమేశ్వరుడు రొంటిని అంటిపెట్టుకున్న చిల్లర తీసి శ్రీరామ్ చేతిలో పోసి "ఇందాకా నాన్నగారి కిచ్చాకా నా దగ్గర ఇంతే వుంది. ఇంకా కావాలంటే నాన్నగారిని అడిగి ఇస్తాను" అన్నాడు.

ఆ చిల్లరకు పసుపు మరకలున్నాయి

సత్యన్నారాయణ వ్రతం చేయించి వచ్చిన మూటలో చిల్లర కదిలింది శ్రీరామ్ కళ్ళముందు.

"చాలు !" అన్నాడు.

పరమేశ్వరుడు హడావుడిగా లోపలకు వెళ్ళిపోయాడు అవన్నీ ఎర్రటి రాగిపైసలు. లెక్కపెడితే... చేతినిండా పసుపు అంటుకుంటోంది. డెబ్బయి పైసలు... చాలు. ఆ పైసలు లెక్కపెట్టుకుంటున్న శ్రీరామ్ మదిలో ఏదో చిరాకు సన్నగా కదులుతోంది.

"బాగా చదవాలి... తను ఉద్యోగం చెయ్యాలి' అనుకుంటూ ఊరి చివరనున్న కాఫీ పాక దగ్గరకు నడిచాడు.

"మీరిక్కడ కాఫీ తాగుతారా ? మీరు బేమ్మలు! మీ నాన్నగారు నన్ను నంపేత్తారు" అన్నాడు పాకవోనరు.

"ఫర్వాలేదివ్వు." అన్నాడు శ్రీరామ్ తను బాగా ఉద్యోగం చెయ్యాలి ఈ ఊహ అతన్ని దొలిచేస్తూనే వుంది.

2

దీక్షితులుగారు భోజనాది కార్యక్రమాలయి ఊయల మీద పడుక్కొన్నారు నెమ్మదిగా వచ్చి కుర్చీలో కూర్చున్నాడు శ్రీరామ్.

ఆయన తలెత్తి కొడుకును చూశారు.

'నాకు 'పోలిటెక్నిక్'లో సీటు వచ్చింది' నెమ్మదిగా అన్నాడు శ్రీరామ్

దీక్షితులుగారు లేచి కూర్చుని "నెలకెంత ఇస్తారు ?" అడిగాడు

"అదేం ఉద్యోగం కాదే ఇవ్వటానికి .! చదువు !"

"చదువు విషయం ఆలోచించద్దని చెప్పేనుగా. అదేదో బైపు వెలగపెట్టావుగా. దాంతో ఏదైనా పని చూసుకుందువుగాని "

"దానికి తగిన వయసు లేదే నాకు .."

"ఇప్పుడు లేకుంటే మరో యేడాదికొస్తుంది. అంతవరకు ఇంట్లో వుండు మరీ తోచకుంటే పరమేశ్వరుడితో వెళ్తుండు "

"ఏమిటి నాన్నగారూ మీరనేది ? ఇంతకాలం చదువుకున్నది— అన్నయ్యతో పౌరోహిత్యాలలో తిరగటానికా ?"

"మరేం చేస్తావు ?"

"నేను పోలిటెక్నిక్ చదువుతాను అది చదివితే



మంచి ఉద్యోగం వస్తుంది బోలెడు జీతం దొరుకుతుంది ''

''ఎఫ్ ఎ చదివితే అంత కంటే ఇంకా పెద్ద పని దొరకొచ్చు కాని మనకు శక్తి వుండద్దా ? ఇప్పటి వరకూ నిన్ను చదివించటమే నేను చేసిన తప్పు వాడి మాట కాదనలేక పెట్టాను. తిండి అంటే వాడు పెట్టేడు పై ఖర్చు నేను సర్దుకోలేదు ? ఇంత పెట్టుబడి పెట్టి మనకా చదువెందుకురా ? మనం పుట్టింది బ్రహ్మణ పుట్టుక. అన్ని జన్మల్లోనూ ఉత్కృష్టమైంది మానవజన్మ దాంట్లో బ్రహ్మణుడుగా పుట్టడం మన పూర్వజన్మ సుకృతం వేదం నేర్చుకో ఇహమూ పరమూ రెండూ వుంటాయి రెండు వేళలా అగ్నిహోత్రాన్ని అర్చించుకో లేదా స్మార్త విద్యలు నేర్చుకుని అన్నకి సాయంగా వుండు ''

''నాకంతగా ఇష్టంలేదు ఇష్టం లేకున్నా గౌతముని రోజూ పారానికి తోలుతున్నారు ''

''నోర్ మూయ్ మరీ పెచ్చుమీరిపోతున్నావు ''

''అదేమిటండీ ? మీరలా అంటారు ?''

''అది కాదు లలితా ఇప్పటికే వీడిమీద చాలా ఖర్చయింది అప్పులు అలాగే వున్నాయి వడ్డీలేని అప్పు కనుక నెగ్గుకొస్తున్నాం ''

''నా గురించి ఏమీ ఖర్చవదండి నాకు క్లాసు వచ్చింది కనక 'స్కాలర్‌షిప్' వచ్చే అవకాశముంది తప్పక బయలుదేరి రమ్మని రాశాడు బాబయ్య ''

''వాడొకడు నీకు మల్లెనేవాడు చదువంటూ పరిగెత్తాడు ఏం సంపాదించి ఒరగబెట్టాడు ? ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వుంది ''

శ్రీరామ్‌కి ఇంకెలా నచ్చచెప్పాలో తోచలేదు. లోపలకు వెళ్ళిపోయాడు లలితాంబ లేచినుంచుని

''మీరేమీ అనుకోనంటే ఒక్కమాట ''

''చెప్పవోయ్ ''

''చూడండి – వాడు చదువుకుంటానుమొర్రో అంటున్నాడు తిండి మరిది పెడుతున్నాడు మనం అతనిమీద అదీ పూర్తిగా వదిలేయలేదుకదా ! ఊళ్ళో దొరికిన ధాన్యం, పప్పులు బస్తాలుకెక్కి పంపుతూనే ఉన్నామాయె పై ఖర్చుకి అదేదో ఇస్తారని వాడే చెప్తున్నాడు ఎవడి ఖర్మ ఎలా వుంటే అలా జరుగుతుంది ఊరుకోండి ''

''నువ్వు మొదటినించి వాడి చదువు విషయం పట్టుబడుతూనే వున్నావు ''

''నేను పట్టుపట్టేది వాడి చదువు విషయం కాదండి పిల్లల ఇష్టానికి అనుగుణంగా చేయమని ''

''వెళ్ళమను'' కోపంగా అన్నారాయన

''ఆ వెళ్ళమనడమే కటువుగాకాక మెల్లిగా చెప్పండి పిల్లల్ని కన్నాంకాని వాళ్ళ తల రాసిందా బ్రహ్మదేవుడే కదా'' అంటోందామె ఇంతలో ''టపా వచ్చిందమ్మా !'' గుమ్మంలోకి వచ్చేడు బంట్రోతు లలితాంబ గుమ్మంలోకెళ్ళి ''శ్రీరామ్ ఉత్తరం వచ్చిందిరా'' అంది

శ్రీరామ్ బయటికొచ్చి ఉత్తరం అందుకుని చదివాడు

''యజ్ఞనదీక్షితుల్ని ఆశీర్వచనం చేస్తూ భద్రాద్రిచేన్లు తెలియచేయునదేమనగా చి॥ సౌ॥ మీనాక్షి మావాడి పక్కన మరీ సన్నగా, పీలగా వుంటుందని మా ఆడవారు భావించటంవల్ల మా అబ్బాయికి మరో సంబంధం చూస్తున్నాము గ్రహించగలరు

ఇట్లు
భద్రాద్రిచేన్లు ''

''పీడాపోయింది '' అప్రయత్నంగా అనేశాడు శ్రీరామ్

దీక్షితులుగారు కళ్ళెత్తి తీక్షణంగా చూశారు పరమశివుడు మూడో కన్ను తెరచినట్లుగా గజగజా వణికిపోతూ గదిలోకి పరిగెత్తాడు

దీక్షితులుగారు మాట్లాడలేదు ఊయల గొలుసుని ఆనుకుని మెడవంచి ఆలోచిస్తూ వుండిపోయేరు


భర్త గంభీర ముద్రను చూసిన లలితాంబ ఇంక మాట్లాడలేదు అక్కడినుంచీ తప్పుకుంది ఇంటి వెనక భాగం దగ్గర కొచ్చేసరికి అగ్నిహోత్రం గదిముందు కూర్చుని చింతపిక్కలాడుకుంటున్నారు మీనాక్షీ, సుబ్బలక్ష్మిను

పిక్క వెళ్ళి గదిలో పడింది కూర్చునే మీనాక్షి వంగి పిక్క తీయబోయింది

''ఒసేవ్ ఏమిటా గదిలో చేయి పెడుతున్నావు ? మీ నాన్నగారు డొక్క చించేస్తారు ఆ గదిలో చేయి పెట్టకు '' అరిచింది లలితాంబ ఉలిక్కిపడి మీనాక్షి, చింతపిక్కని అందుకోబోయిన చేయి వెనక్కి తీసింది వెనక్కితిరిగి, తల్లిని చూస్తూ వుండిపోయింది

(ఇంకా వుంది)

పందెగాలి - ఆదూరి వెంకటసీతారామమూర్తి



వాకిట్లో నందివర్ధనం చెట్టుక్రింద వాలుకుర్చీలో కూర్చొని ఆకాశంలోని పిట్టల్ని లెక్కపెడుతూన్న వెంకటేశంగారు ఎదుటి గోడమీద ఎండ ముదరడంతో ఆలోచన్లకు స్వస్తిచెప్పి గది కిటికీ లోంచి వంటింట్లోకి చూశారు వంటింట్లో సీతామాలక్ష్మి ఉన్న జాడ కన్పించలేదు పెరట్లో నూతి చపటామీద గిన్నెల చప్పుడుమాత్రం విన్పిస్తోంది.

ఉస్సూరుమంటూ మళ్ళీ ఆ పాతకాలపు వాలు కుర్చీలో చేరగిలబడ్డారు ఉదయాన్నే కాఫీకి అలవాటు పడ్డ ప్రాణం గిలగిల్లాడిపోతోంది — ఈనాటిదా యేమిటా అలవాటు ? పాతికేళ్ళనుండీవుంది ఒక్కసారిప్పుడు మానుకోవాలంటే ఎలా ? అదీ యింత వయసొచ్చాక.

''పాతబాకీ చెల్లువేయలేదు రేపట్నించి ఒక్క చుక్కపాలు కూడ పొయ్యలేను నాదీ బతుక్కోసం చేసే యాపారమే'' అని, క్రితంరోజుచెప్పి, అల్లరిచేసి పోయాడు సైకిల్ పాలవాడు.

నిజమే నాలుగు నెలల్నించీ ఒక్క పైసా కూడ యిచ్చిన పాపాన పోలేదు అన్నప్రకారమే యీరోజు పాలు పోసినట్టులేదు వెధవది .తెల్లారకముందే లేచే అలవాటు — వాకిట్లో కూర్చొని ఆకాశంలో వచ్చే వెలుగునీ, ఎగిరే పిట్టల్నీ చూస్తూ ఎంతసేపు గడిపినా తెల్లారలేదు తీరా తెల్లారి, ఎర్రగా ఎండొచ్చాక గుర్తొచ్చింది—పాలవాడు పాలుపొయ్యలేదన్న సంగతి.

గుమ్మంముందు నీళ్ళు జల్లి ముగ్గేస్తోంది భవాని. తల్లిలాగే చీకటింటలేవడం, పనులు చేసుకోడం కూతురికీ అలవాటే

'అమ్మా భవాని' అని పిలిచేరు—భవానీ వచ్చింది.

'అమ్మ ఏం చేస్తోందీ' అడగాలనుకున్నది అడగలేక మరేదో అడిగారు.

'పెరట్లో నీళ్ళు తోడుతోంది నాన్న'

వెంకటేశంగారికా సమాధానం సంతృప్తిని కలిగించలేదు.

పాలవాడిమీద కోపమొచ్చింది — రెండేళ్ళబట్టీ పోస్తున్నాడు వాడికగా ఎప్పుడన్నా బాకీపెట్టడం జరిగిందా ? ఒక్కరెండు నెలలిటూ అటూ అయినా పైసా తేడా రాకుండా లెక్కకట్టి యిచ్చేసేవాడు.

పిల్లలు పెరిగారు — ఖర్చులు పెరిగాయి — ఆదాయం తగ్గిపోవడంతో కొన్ని ఖర్చులు తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్కసారి అరలీటరు పాలు తగ్గించడంతో వచ్చింది అసలు పేచీ.

వెంకటేశంగారి · కడుపులో కరకరలాడ్డం మొదలైంది.

ఇక కుర్చీలో కూర్చోలేక లేచి కిటికీలోంచి లోపలికి చూశారు. పెద్దకొడుకు సుందరం మంచం మీద పడుకొని యేదో పుస్తకం చదువుకుంటున్నాడు.

ఆఖరి పిల్లలిద్దరూ యింకా నిద్రలేవనేలేదు వాళ్ళు లేచాకనే మొదలౌతుంది అసలు అల్లరంతా.

వెంకటేశంగారికి పాల గురించి ఏం చేయడానికీ పాలుపోలేదు ఒకప్పుడు బాగా బతికాడని కాదుగానీ స్కూలు మాష్టరిగా చేసినన్నాళ్ళూ రోజులేవో దొర్లుకుపోయాయి — ఆ సంపాదలోనలోనే కొడుకు బియ్యే చదివేడు కూతురు పదో తరగతి అయిందని పించి అక్కడితో ఆపింది — బియ్యే కొడుకు కనీసం బియ్యపు గింజైనా తేలేని స్థితిలో నిరుద్యోగాన్ని వెలగబెడుతున్నాడు

'మీకేం మా రాజులు రిటైరయ్యే వేళకి కొడుకు అందుకుంటాడు కాలుమీద కాలేసు క్కూచుంటే రోజులెళ్ళిపోతాయి' అనేవారు బంధువులు, చదువులో ఫస్టు మార్కులు తెచ్చుకునే సుందరాన్ని చూసి

సుందరం తెలివైనవాడే గుణసుందరుడే కానీ ఆ విషయం తను గుర్తిస్తే చాలదు—ఏ ఇంటర్వ్యూలో నైనా గుర్తింపుకొస్తే ఫలితముండేది !

మళ్ళీ కుర్చీలో కూలబడ్డారు వెంకటేశంగారు ఎదురింటి కంట్రాక్టరుగారు స్కూటర్ బయట పెట్టి భార్యతో యేదో మాట్లాడుతున్నారు ఆయనకీ తన వయస్సే వుంటుంది కానీ తనలా విశ్రాంతిగా ఒక్కక్షణం కూర్చోరు. ఉదయంనించి అర్థరాత్రి వరకూ ఏదో ఒక పనిమీద తిరుగుతూనే వుంటాడు చాలినంత సంపాదన, ఆరోగ్యం, ఆనందం వీటితో హాయిగా వున్నాడనిపిస్తుంది — ఆరేళ్ళక్రితం తామీ యింటికొచ్చేసరికి వాళ్ళకి చిన్న డాబా యిల్లు వుండేది—ఈ ఆరేళ్ళలోనూ ప్రభుత్వ కంట్రాక్టుల పుణ్యమాని ఆ పక్కనున్న ఖాళీ జాగా కూడకొనుక్కొనిమొత్తం స్థలంలోపెద్దమేడలేపేదు

కష్టపడి నెల జీతాలకు పని చేసేవాళ్ళకు ఆస్తులెలా మిగుల్తాయి ? అద్దెయిళ్ళలో అద్దెకూడ యిచ్చుకోలేని పరిస్థితి ఎదురైందంటే అవదూ ? వెంకటేశంగారికి యింటిగలాయన జ్ఞాపకానికొచ్చాడు చాలా సౌమ్యుడు, ఉత్తముడు, మధ్య తరగతి వాళ్ళ సాధకబాధకాలు తెల్సిన మనిషీను — ఆయన్నట్లా అనుకోడానికి కారణం ఒక్కటే — ఈ ఆరేళ్ళలోనూ దేశంలోని ఎన్నిధరలెలా పెరిగినా అద్దెఒక్కరూపాయి కూడ పెంచలేదాయన అటువంటివాడు నిన్న సాయంత్రంవచ్చిఅతినెమ్మదిగానేచెప్పేడు నిజమేమరి! ఎంత అద్దె డబ్బులతో బతకనివాడైనా నాలుగు నెలల్నించీ అద్దె యివ్వకపోతే కష్టమన్పించదూ ? తనకీ కష్టంగానేవుంది ఇన్నాళ్ళూ మాష్టారూ మాష్టారూ అంటూ గౌరవించడమే తప్ప తనతో ఎప్పుడూ మరోమాట మాట్లాడలేదు—వెధవది డబ్బులేకపోబట్టి చులకనైపోతున్నాడు ఈ యిల్లు ఖాళీచేస్తేయింత మంచి యింటిగలాయన గల యిల్లు యింత చవకలో దొరకొద్దూ ? ఈ యిల్లు కదిలితే వీధిన పడిపోతాడు

వెంకటేశంగారు తల గోక్కున్నారు ఎవరికాళ్ళో పట్టుకుని రెండు నెలల అద్దెయినా యిచ్చేస్తే గాని పరువు దక్కదు

'నాన్నా కాఫీ' అంటూ కాఫీ గ్లాసుతో ఎదురుగా నిల్చుంది భవాని

ఆశ్చర్యంగా చూసి, యేదో అడగాలనుకున్న వాడల్లా దానివల్ల తన అసమర్థతే మరోమారు నిరూపించబడుతుంది తప్ప ఒరిగేదేం వుండదనుకుని ఆ పని నుండి విరమించుకున్నాడు

కాఫీ వేడి వేడిగావుంది రుచిగా కూడ వున్నట్ల నిపించింది. ఒంట్లో కాస్త సత్తువజేరింది

సీతామాలక్ష్మి తనను బాగా అర్థం చేసుకున్న యిల్లాలు తన అవసరాలేమిటో తెల్సుకుని అడక్కుండానే అన్నీ సమకూరుస్తుంది

గుమ్మంలోకి ఎండ బాగా వచ్చేసింది ఎదురింటి రేడియోలోంచి ఏదేదో విన్పిస్తోంది గేదెకి కుడితెంత పెట్టాలో ఏ మొక్కకెంత నీరుపెట్టాలో ఏ జిల్లాలో ఎంతమంది స్త్రీలకి లూపులమర్చేరో

ఎవరిక్కావలివి పొద్దున్నే ?

కుర్చీ మడిచేసి ముందు గదిలోకొచ్చేరు వెంకటేశంగారు ఆఖరి పిల్లలిద్దరూ నేలమీద కూర్చుని హోంవర్కులు చేసుకుంటున్నారు. సుందరంవంక చూడ్డానికి భయమేసిందాయనకు ఎరువుతెచ్చుకున్న ఏ యింగ్లీషు నవలో చదువుతూ వుంటాడు తెలివైనవాళ్ళకి మంచి అవకాశాలు రాక బతుకు తెరువు యేర్పడకపోతే విప్లవకారులగానో, తిరుగుబాటుదారులుగానో మారిపోతారట సుందరం కూడ అలా మారిపోతే తను భరించగలడా ? ఊళ్ళూ దేశాలూ పట్టిపోయి, పోలీసులకు చిక్కి, లాఠీదెబ్బలు తింటూ జైలుశిక్షలు అనుభవిస్తూంటే తను బతికుండే ఆ వార్త వినగలడా? తన కుటుంబ పరువూ ప్రతిష్ట ఏం కావాలి ?

వెంకటేశంగారి దృష్టి ఎదురింటి మేడమీద పడింది కంట్రాక్టరుగారమ్మాయి శారద అప్పుడే లేచిందిలావుంది నైట్ గౌన్లో వుండి బ్రష్‌తో పళ్ళు తోముకుంటోంది శారదకూడ భవానీ యీడుదే కానీ శారదలోవుండే ఆ నవకం, వయసుతెచ్చేపుష్టీ భవానీలో కన్పించవెంచేతో ? శారద మెడిసిన్ చదువుతోంది రేప్పొద్దున్న యే స్పెషలిస్టో అయి, వేలకు వేలు ఆర్జించిపోస్తుంది కన్నవాళ్ళూ సంతోషిస్తారు కట్టుకున్నవాడూ సంబరపడతాడు

లోపల గదిలో దేవుడి ముందు గంటమోగింది వెంకటేశంగారి దృష్టి అటువైపు మళ్ళింది — భార్య పూజ చేస్తోంది ఎట్టి పరిస్థితిలోనూ ఆవిడ దేవుడి ముందు దీపం పెట్టడం మానదు — నూనె ధర ఆకాశాన్నంటి యింట్లో వాడికకే కరువై పోయినా దీపారాధనకి మాత్రం యే లోటూ చెయ్యదావిడ ఇంట్లో ఎవరి కళ్ళలో వెలుగు తగ్గినా ఆ దేవుడి ముందు మాత్రం వెలుగు తగ్గదు — ఆయనే యేదో తమ జీవితాల్లోకి వెలుగు చూపిస్తాడని సీతామాలక్ష్మి ఆశ.

పిల్లలు స్నానాలుచేసి బళ్ళోకి వెళ్ళిపోయారు

సుందరం కూడ తండ్రి ముందునించి ఒక ట్రెండు మార్లు తిరిగాడు · కానీ వెంకటేశంగారు అతగాడిని చూడనట్టే కళ్ళు మూసుకున్నారు రెండురోజుల క్రితం సుందరం అడిగేడు — 'నాన్నా బేంక్‌లో ప్రొబేషన్ ఆఫీసర్ ఉద్యోగ ప్రకటన పడింది. దరఖాస్తు పెట్టనా' అని — తన పిల్లలు తనను అడగందే ఏ పనీ స్వతంత్రించి చేయరని వెంకటేశంగారికి గర్వం

'పెట్టవోయ్' అన్నారేగాని ఆ తర్వాత వినవచ్చే మాటకు తట్టుకోగలడా? లేడా? అనేభయం లోలోపల వుండనేవుంది

'పాతిక రూపాయల పోస్టలార్డరు పంపాలి' అనేసి తలొంచుకున్నాడు సుందరం పరిస్థితుల్ని అర్థం చేసుకుని అడగటం మానెయ్యనూలేదు అర్థం చేసుకోనట్లు ప్రవర్తించనూలేదు అదీ సుందరం పరిస్థితి

డబ్బు కడితే కొడుకు వ్రాత పరీక్షలో తప్ప కుండా సెలక్టు అవుతాడన్న ధైర్యముంది వెంకటేశం గారికి కానీ కడదాంలే అని ధీమాగా చెప్పలేదు ఒకవేళ కట్టినా, వ్రాత పరీక్షలో నెగ్గిన కొడుకు ఏ రికమండేషనూ లేకుండా కేవలం మెరిట్‌లో ఉద్యోగాన్ని సంపాదించుకోగలడా అంటే అది అప నమ్మకమే కాస్సేపేం మాట్లాడలేకపోయారాయన ఆ తర్వాత 'చూద్దాంలే' అన్నారు అప్పటికా పరిస్థితి నుండి తప్పించుకున్నారేగాని తర్వాత సుందరం కన్పించినపుడల్లా అదే తలలో మెదుల్తోం దాయనకు

చెప్పలేసుకుని సుందరం ఎక్కడికో వెళ్ళి పోయాడు ఎంత పైకి కన్పించనీయకపోయినా కన్నందుకు తండ్రి తనకేం చేయలేదన్న ఉక్రోషం వాడిలో వుండే వుంటుంది

నిజంగా తను అసమర్థుడే — రిటైరై ఆర్నెల్లయినా తన పెన్షన్ డబ్బులు తనే తెచ్చుకో లేకపోయాడు

ఆలోచల్లోంచి తప్పించుకునేందుకు పక్కింటి నించి దినపత్రిక తెప్పించుకున్నారు వెంకటేశంగారు.

ప్రేమించినవాడు మోసంచేస్తే ఫేనుకి ఉరి పోసుకు చనిపోయిన ఆడపిల్ల

ఎమ్మే పట్టాని ఏడేళ్ళయిమోస్తూ కుటుం బానికిక భారంకాలేక నిరుద్యోగపర్వాన్నీ, నూరేళ్ళ జీవి తాన్నీ మధ్యలోనేబలవంతంగా ఆపేసుకున్ననిరుద్యోగి .

కడుపుచించుకు పుట్టిన పిల్లలు అన్నమో రామచంద్రా అని ఆర్తనాదం చేస్తుంటే ఒడ్డు తెలీని ఆ సంసార సాగరంలో యిక ఈదలేక విషం మింగి కష్టాలు గట్టెక్కాయనుకున్న మాతృమూర్తి

ఆత్మహత్యలు ఆత్మహత్యలు ఎన్నెన్నో ఆత్మహత్యలు !

ఏ రోజు ఏ పేపరు చూసినా యివే వార్తలు !

అసమర్థుల సమస్యలకు ఆత్మహత్యలే పరిష్కారమా ?

వెంకటేశంగారు బాగా ఆలోచించారు. తనొక్కడూ చచ్చిపోయినంతమాత్రాన తనకుటుంబం యొక్క కష్టాలు ఒక్కమారు గట్టెక్కిపోవు. గట్టెక్కిపోతాయనుకుంటే తను చచ్చిపోవచ్చు. బంగాళాఖాతంలోపడి ఘోరమైన చావు చావొచ్చు తండ్రి చనిపోతే కొడుక్కి ఉద్యోగమిచ్చే సంస్థ లున్నాయిట ఈ బడిపంతులు ఉద్యోగానికిబదులు తను అటువంటి సంస్థలో కళాసీ పనిచేసివున్నా బాగుండేది.

కానీ కుటుంబ చరిత్ర, పరువు ప్రతిష్టలూ, గౌరవ మర్యాదలు?

వీటిన్నే రక్షించుకోవద్దూ ?

ఎదురింటి గేటు చప్పుడైతే అటువైపు చూశారు వెంకటేశంగారు. కంట్రాక్టరుగారి పెద్దబ్బాయి కొత్త స్కూటర్‌మీద వెళ్ళిపోతున్నాడు.

కంట్రాక్టరుగారి యిద్దరి కొడుకులకీ చదువబ్బలేదు. వాళ్ళతో పోలిస్తే సుందరం ఎంతో తెలివైనవాడు. అవకాశం రాకగానీ జిల్లా కలెక్టరై పోగల యోగ్యత లున్నాయి వాడిలో.

భారంగా నిట్టూర్చారు

'నాన్నా వంటయింది—స్నానానికి లేవమంటోంది అమ్మ' భవానీ వచ్చింది.

లేచి తువ్వాలు తీసుకుని పెరట్లోకి వెళ్ళేరు. మాతి చపటా ఖాళీగా వుంది నాలుగు చేదల నీళ్ళు తోడుకుని తలమీంచి పోసుకుంటే ఎంతో హాయని పించింది

"ఒసే పార్వతీ – నేను జయవాణి ఆల్బమ్ చేశాను చూస్తావా" పక్కింటి వాళ్ళమ్మాయి రాజ్యం స్నేహితురాలితో అంటోంది

"ఓ – ఎక్కడివే నీ కన్ని ఫోటోలు ?"

'సంపాదించాను మనసుంటే మార్గమే వుండదా కొన్ని కలర్ ఫోటోలు కొన్నాను కూడ !'

'అబ్బ ! చూపించవే'

'నిన్న రిలీజైన ప్రేమకాపురం సినీమాలోది కూడ సంపాదించాను అందులో ఎంత బావుందను కున్నావ్. ముద్దొస్తూ'

వెంకటేశంగారు స్నానంచేస్తూ ఆ సంభాష ణంతా విన్నారు

రాజ్యానికి సినీమాల పిచ్చి !

ఈ కాలపు పిల్లలు సినీమాలు చూసి పాడై పోతున్నారు.

కానీ తన పిల్లలో ? ఎవరితో పోల్చినా బంగారబ్బొమ్మలు !

సినీమాలూ షికార్లూ ఎరుగరు — అలా పెంచాడు తను !

తన పెంపకంమీద తనకే గర్వం కలిగింది వెంకటేశంగారికి.

స్నానం, భోజనం అయ్యేక సావిట్లో మంచం వాల్చుకుని నడుం వాల్చేరు ఆలోచన్ల మధ్య చిన్న కునుకు పట్టేసింది. మెలుకువ వచ్చేసరికి మూడు. వీధివైపు నీడ ప్రహారీ గోడవరకూ వెళ్ళింది కాసిన్ని మంచినీళ్ళు తాగి, వాలుకుర్చీని వాకిట్లో వేసు కూర్చున్నారు

చేసేపని లేకపోయినా విశ్రాంతిలేదు రోజంతా ఆలోచనలే — పిల్లల్ని గురించీ భవిష్యత్తును గురించీ.

మరో గంటలో ప్రయివేటు పిల్లలొస్తారు

"బాబూ చింతపండు కావాలా" ఎవరో అమ్ముకునేవాడు వీధిగుమ్మంలో నిల్చుని అడుగు తున్నాడు.

"ఒద్దు"

"అమ్మగార్నడిగి సెప్పండయ్యా" వదల్లేదు వాడు నిజానికింట్లో చింతపండు లేదు — కానీ డబ్బులుండొద్దూ కొనడానికి ?

"నాకు తెల్సులేవయ్యా అక్కర్లేదు వెళ్ళు" వాడు వెళ్ళలేదు — గేటు తీసుకుని సరాసరి లోపలి కొచ్చాడు

"బాబూ ! మీరు వెంకటేశం పంతులుగారు కాదా" అన్నాడు అనుమానంగా ముఖంలోకిచూస్తూ.

''పేరు కూడ కమక్కున్నావన్నమాట ! ఏం కావాలి?''

''ఎన్నాళ్లయిందిబాబూ చూసి. గొంతునుబట్టి పోల్చుకున్నాను నన్నెరగరా? రావుఁల్ని పాలెంలో వుండేవాణ్ణిగా ''

ముఖంచూసి పోల్తి పట్టలేకపోయినా వివరాలు చెప్పేసర్కి గుర్తుకొచ్చింది వెంకటేశంగారికి

'నువ్వా రావుఁలూ ఏవిఁటిలా ఈ వూరొచ్చావ్? నీకు పొలం పుట్రా వుండాలిగా అక్కడ?'

'వున్నాయయ్యా. కొడుకులు పిలిస్తేనూ ఒచ్చేసినా '

పాతముచ్చట్లూ, పాలెం సంగతులూ కాస్సేపు మాట్లాడుకుని తృప్తి పడ్డారిద్దరూ

''ఇక్కడ నీ కొడుకు లేం చేస్తున్నారూ ?''

''పెద్దాడిది యాపారం బాబూ బడ్డీ కొట్టుంది కూరలూ, కిరాణా అమ్మతాడు బాగానే సంపాయిస్తున్నాడు రెండోవాడు పదోతరగతి పేసయ్యేడు ఆనక సదవన్నాన్నా అన్నాడు సర్లేకాని నాలుగొందలు మదుపిచ్చినాను యేదేనా యాపారం జేస్కోమని కానీ ఆడికి నిలకళ్ళేదు, ఏడాదిలో నలుగురికాడ నాలుగు రకాలుగా మారేడు సంపాయించే శ్శైండి ఇప్పుడు బేంకీ లోను తీస్కొని సోపాల్తేస్తన్నాడు ఒక్కో సోపా ఆరేడొందలంట—ఇద్దరు పనోళ్ళను బెట్టేడు బాగానే మిగుల్తాది ''

''మరి యిద్దరు కొడుకులూ సంపాదిస్తుండగా నీకెందుకీ వ్యాపారం పాలెంలోని ముక్క చాల్దా?''

''కొడుకుల సంపాదనమీద ఆశపడకూడదు బాబూ ఆళ్ళుండమంటారు తినమంటారు కొత్తల్లో మనకీ బాగానే వుంటది. తరవాత్తరవాత కూకుని తినేవోణ్ణి చూస్తే కొడుక్కైనా కన్ను కుట్టుద్ది. నానీ వూరొచ్చిన కొత్తలో అలాగే కొన్నాళ్ళు కూకొని తిన్నా—కోడలూ మంచిదే కానీ నాకు ముగ్గురు కూతుళ్లున్నారు పెద్దదానికి పెళ్ళిచేసేను ఇద్దరున్నారింకా పెళ్ళికి కొడుకులు నా కెడతారని కూకుంటే కూతుళ్ళ మద్దూ ముచ్చట్లు తీరేదెప్పుడు ? చిన్న కొడుక్కి పెళ్ళి కాలేదు కానీ పైసా చేతికివ్వడాడు ఇక్కడ చింతపండు యాపారం లాభసాటిగా వుంటది నాన్నా అన్నవాడు వాడే—ధైర్యంచేసి, పెట్టుబడెట్టి, కొని అమ్మేను బాగానే మిగిలింది అంతే! నా భార్యనీ, ఆడపిల్లల్నీ కూడదీసుకొచ్చి వేరే పాక అద్దెకు దీసుకుని కాపరమెట్టేను ఎందుకు నాన్నా మరో యిల్లు అన్నాడు పెద్దోడు నీకు తెల్దురా. కా నీ లే అ న్నా ను. వూ రు కు న్నా డు ఆడుట్టి ఖర్చుమనిషి బాబూ. పంకా కొన్నాడు. రేడియో కొన్నాడు. అయ్యెందుకురా ఏ మడి చెక్కో కొనుక్కోమన్నా ఆడి చెవి కెక్కలేదు కోడలిపిల్ల క్కూడ చెప్పి చూసినా. నీ మొగుడిచేత ఏ బంగార ప్పినరో కొనిపించుకో ముందు ముందు పనికొస్తాదీ అని — అబ్బే — దాని మాటా ఆడిన్లేదు — ఆడికే తెలుస్తాదిలెండి. ఇప్పుడా రోజూ కూరిస్తాడు కాయో పండో యిస్తాడు నాన్నా అంటూ పలక రిస్తాడు ఆళ్ళు బావుంటే అంతేచాలు. నా కంటారా. యిదే బావుంది యే కొడుకూ పెట్టక్కరలేదు. ఇద్దరూ కళ్ళముందున్నారు యాపారం బాగానే వుంది. నా భార్య పొద్దున్నే యిడ్లీ పెట్టి యింటికాడే అమ్మతాది అన్నీ ఒమ్మితే రెండున్నర మిగుల్తాది లేదూ అమ్మకం కాకపోయినా నష్టంలేదు పిల్లలు తింటారు. ఏదో బతుగ్గడవ డానికి నలుగురం నాలుగు పన్లూ చేసుకుంటన్నాం'' రావుఁలు చెప్పడం ఆపి లేచాడు

''బాగుందోయ్ అంతా బాగున్నారంతే చాలు ఒక వూరివాళ్ళం నిన్నీరోజు చూడ్డం చాల సంతోషంగా వుంది' అన్నారు వెంకటేశంగారు

రావుఁలు వెళ్ళేక ఆలోచనలో పడ్డారు

సాయంకాలమైంది ప్రయివేటు పిల్లలకి ఏదో చెప్పి పంపించేసి వీధిలోకి బ య ల్దే రే డు వెంకటేశంగారు కాస్త దూరం నడిచి మెయిన్ రోడ్డు ఎక్కేసర్కి సముద్రపొద్దుకి వెళ్ళాలని పించింది కాలి నడకనే వెళ్ళి జనమెవ్వరూలేనిచోట ఇసుకలో కూర్చొని కెరటాల వంక చూస్తూ వుండి పోయారు చాలాసేపు

ఆయన మనసంతా అల్లకల్లోల కడలిలావుంది తను చూసిన మానవ జీవితాన్ని మూడు తరగతులుగా విభజిస్తే తనది మధ్య తరగతి మరి సమాజంతో తమ స్థితి చూస్తే అధమంగానేవుంది. దీని క్కారణం ఆదాయం తక్కువయి ఆర్థికంగా చితికి పోడం — పరువు, మర్యాదలంటూ స్తోమతకు తగిన జీవన విధానాన్ని ఎ ం చు కో క వ డ ం — ఒక్కరు సంపాదిస్తే కుటుంబమంతా కూర్చొని తినడం

ఇట్టుకింది త ర గ తి కి చెందిన రావుఁలు కుటుంబాన్ని చూస్తే . . అవసరాలకు తగ్గట్టు అందరూ ఆర్జిస్తున్నారు ఈ పని కూడదూ అనే నిబంధనలేదు

అటు పైతరగతికి చెందిన కంట్రాక్టరు గారింటకూడ ఆయన భార్య తీరిక వేళల్లో ఎంబ్రాయిడరీ స్కూల్లో టీచరుగా పనిచేస్తోంది పెద్దకొడుకు తండ్రికి సహాయకారిగా వుంటూ ఆ పనిలోని మెలుకువలు నేర్చుకుంటున్నాడు

రెండో అబ్బాయికీ చదువబ్బకపోయినా బిల్డింగ్ మెటీరియల్ సప్లయ్ చేసే షాపు పెట్టుకున్నాడు

మధ్యస్తంగా వుందనుకున్న తన కుటుంబం చూస్తే తెలివిగా , చదువుకున్న సుందరాని కుద్యోగంలేదు ఎంప్లాయ్‌మెంట్ ముడుపులకీ, పోస్టల్ ఆర్డర్స్‌కీ కూడ తండ్రినే యాచించుకో వాల్సిన గతివాడిది

'ఈ పాట్లు పడినా నా కుద్యోగం రాదు సుబ్బరంగా ఏ కిల్లీ బడ్డీయో పెట్టేసుకుంటాను బే.కు లోను తీసుకుని' అన్నాడోమారు. తనూ, సీతామాలక్ష్మి కూడ తలవాచేట్లు చివాట్లుపెట్టేరు ఆ ఆలోచనకి సాంప్రదాయ కుటుంబంలోంచి వచ్చి, నలుగురికీ విద్య నేర్పించే మాష్టారుగారబ్బాయి చుట్టాబీడీ లమ్ముకునే వాడుగా జీవితంలో స్థిర పడ్డమా ? వెధవడబ్బు . వేశ్యలుకూడ సంపాదిస్తున్నారు వందలకి వందలూ — అది కాదు జీవితంలో కావల్సింది — అనుకున్నాడప్పుడు

ఆ డబ్బులేకే అసమర్థుడిగా మారిపోయా డిప్పుడు మరి ఈ అసమర్థుడు రేపు ఆడపిల్లల పెళ్ళిళ్లెలా చేస్తాడు ? ఆకాశాన్నంటేంత ధనరాశి పోసి అల్లుళ్ళనెలా తెచ్చుకోగలడు ?

భవానీ కూడ అణుకువగల పిల్ల — చదువబ్బక పోయినా కత్తిరింపులూ, మిషన్ ఎంబ్రాయిడరీలూ, కుట్లూ నేర్చుకుంది —

'తప్పేంలేదు నాన్నా ఒక మిషన్ కొంటే మన బట్టలతోపాటు చుట్టుపక్కలవారివికూడ కుట్టొచ్చు నాకూ వూసుపోతుంది!' అందొకనాడు— పుట్టింట ఆడపిల్ల సంపాదించడం అంత సబబు కాదనిపించింది — అందుకే ఆ విషయం మళ్ళీ తనముందు తేకుండా చేసేడు —

అయితే తమచుట్టూ గీసుకున్న యీ పరువు ప్రతిష్టల గిరులమధ్య జీవితాలు కుంచించుకుపోయి, యిక ఎన్నటికీ ఎదగలేనివిగా తయారైతే చూస్తూ వుండిపోగలడా ?

ఒక దృఢమైన నిశ్చయానికొచ్చిన వెంకటేశం గారు లేచి, వడివడిగా యింటివైపుకు నడిచేరు

ఇంటికి వెళ్ళగానే బట్టలుకూడ మార్చుకోకుండా వాలుకుర్చీలో కూర్చొని కొడుకునీ, కూతుర్నీ దగ్గరకు పిలిచేరు — సుందరం, భవానీ ఆశ్చర్యంగా తండ్రి దగ్గరకొచ్చారు

సీతామాలక్ష్మి దూరంగా నిల్చునే గమనిస్తోంది—

'చూడొరే సుందరం ఆమధ్యేదో బేంకు లోను విషయం మాట్లాడేవుగా నీ కిష్టమైతే చెప్పు — శంకరం అని చిన్నప్పుడు నా దగ్గరే చదువుకున్నాడా బేంకు మేనేజరు ఆ మాత్రం సాయం చేయకపోడు— భవానీ క్కూడ కుట్టుమిషన్ కావాలని అంది ఆ సంగతి కూడ అప్పుడే కదుపుతాను!' అని, పిల్లల ముఖంవంక చూడకుండా ఆకాశంలో అప్పుడే ఉదయిస్తున్న చంద్రుడి వంక చూశారు —

భవానీ, సుందరం ఒకరి ముఖాలొకరు చూసుకుని తల్లివంక చూశారు — వాళ్ళ కళ్ళలో ఆనందం చిలికింది —

'మీరేం అనుకోకపోతే . మరో సంగతికూడ చెప్పాలనుకుంటున్నా నాన్నా' నసిగేడు సుందరం

ఏవిఁటన్నట్లు చూశారు వెంకటేశంగారు కొడుకువైపు

'నాకు నామోషీ లేకపోయినా నాకు బియ్యే డిగ్రీ నిచ్చిన యూనివర్సిటీని కిల్లీకొట్టుకు లాగి నేను కించపరచదల్చుకోలేదు అంచేతే మెట్రిక్ నుండి బియ్యే వరకూ ప్రయివేటుగా వెళ్ళే విద్యార్థుల కోసం కరెస్పాండెన్స్ కోర్సు పెట్టదల్చుకున్నాను — దీనికి నా మిత్రులు కొందరు సాయపడుతున్నారు. మీరు ఊఁ అంటే 'ఆగేడు సుందరం వెంకటేశం గారి కళ్ళు ఆనందంతో మెరిశాయి అన్ని దానాలకన్నా విద్యాదానం గొప్పది —

'ఎంబ్రాయిడరీ స్కూల్లో కొత్త టీచర్ని వేసుకుంటారట — యీరోజే అడిగారు వాళ్ళు నన్ను' భవానీ చెబుతోంది

వెంకటేశంగారి హృ ద య ం లో ఆనంద కెరటాలు ఎగిరిపడ్డాయి — గుండెల్లోంచి వినవచ్చే ఆ హోరులోంచి అతని గొంతు అంగీకారంగా ధ్వనించింది — అతని కళ్ళలో చిప్పిల్లిన నీటి బిందువుల్లో ఆనాటి పున్నమివెన్నెల మెరిసింది —

సందెగాలి వారిమధ్యనుండి ఆ న ం ద ం గా కదిలింది. ★

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

కె జి ఏస్ కె కుప్పం

తమిళ ఎడు తాళర్‌గల్ సుజాత అవర్‌గళై పట్రి ఉంగల్ అభిప్రాయం ఎన్న?

మంచి రచయిత. (ఆడదనుకుని మోసపోకండి)

కవికి సామాన్య మానవునికి తేడా ఏమిటి?

సామాన్యుడు కళ్ల తోను, కవి హృదయంతోను చూస్తాడు యీ సమాజాన్ని, ఈ లోకాన్ని.

కథలు కల్పితాలా? జీవన ప్రతిబింబాలా?

కల్పితాలే. నిజ జీవితం కల్గించే ఉత్తేజంనుంచి కథ రూపొందుతుంది.

వివి. ఎస్. సైనికపురి

నాకు ఒకొక్కసారి రచయితనవ్వాలని, సైన్టిస్టు, డాక్టర్, యాక్టర్ యిలా ఏ రోజుకా రోజు ఆలోచనలు మారి పోతూ వుంటాయి. నేను పట్టుదలతో ఏదో రంగంలో రాణించా లంటే ఏం చెయ్యాలి?

వెరి సింపుల్ మిస్టర్ వాట్‌సన్! ఆ రంగం పై దృష్టి కేంద్రీకరించి కృషి చేయడం ప్రారంభించాలి. ఉద్దేశ్యాలలో స్థిరత్వం ఏర్పడడానికి—వయసు రావాలి.

శేఖర్. తిరుపతి

తల్లి తండ్రులు మగ పిల్లలతో సమానంగా ఆడ పిల్లలకి చదువులు చెప్పిస్తున్నారు. మీ మొగుళ్ళని మీరు వెతుక్కోండి అంటూ స్వేచ్ఛ యిస్తున్నారు. కాని మగవారితో కలిసి మెలిసి తిరిగి మనసుకి నచ్చిన వాడిని ఎంచుకొనేస్థితి యీ నాటి సంఘంలో ఆడ పిల్లలకి కనిపించడం లేదు. కారణం?

(1) అబ్బాయిలలో మానసికమైన దృఢత్వం లేకపోవడం. (2) అమ్మాయిల పట్ల వ్యక్తిగా గౌరవించి మెలగడం— చేయకపోవడం.

కె ఎవ్. ఎల్. గరికపాడు

ప్రశ్నలకి జవాబు లివ్వడానికి ఏ అర్హత వుండాలి?

అడగడానికి వుండే అర్హతలే—వుంటేచాలు.

నాకు మీతో స్నేహం చేయాలనివుంది. ఉత్తరం రాస్తే ఉత్తరం వ్రాస్తారా?

సారీ, నా స్నేహితులని నేనే ఎంచుకొంటాను.

కె వి. ఎస్. గుంటూరు

మీ తొలి నవల ఏది? ఎన్ని నవలలురాశారు?

అవతలి గట్టు. వో పది పన్నెండు రాశానేమో.

పుష్ప. విజయనగరం

విద్య లేనివాడు వింత పశువు అంటూనే చదువుకున్న వాడికంటే. . . అంటారు. ఎలా?

విద్య వేరు. చదువు వేరు. సంస్కారం నేర్పని విద్య, ఇంగితం నేర్పని చదువు దండుగ అని చెప్పడమే — దాని వుద్దేశ్యం.

ఎస్. ఆర్ ఆర్ కాకినాడ

అనుకోని పరిస్థితులలో ఒక వివాహితస్త్రీతో నాకు అక్రమ సంబంధం ఏర్పడింది. . .

ఫరవాలేదు. ఈ రోజుల్లో అక్రమ సంబంధాలు ఫేషన్‌గా వుంది! ఎక్కడ విన్నా పెళ్లయిన వాడిని ప్రేమించే స్త్రీలు, పెళ్లయిన వాడు ప్రేమించే స్త్రీలు... విన్పిస్తున్నారు!!

కె. కె. కె. గూడూరు

మీరు మార్క్సిస్టా? నాన్ మార్క్సిస్టా? యాంటీ మార్క్సిస్టా?

ఏదీ కాదయ్యా— బిహైండ్ మార్క్సిస్టుని!!

కె ఏస్ బి మండపేట

మన హీరోలు ఎంత పేద వారైనా వేసిన డ్రస్సు మరలా వేయరు. కారణం ఏమిటి?

మీరు హర్షించరని!! ఒక సాంగ్‌లో ఎన్ని డ్రస్సులు మార్చాడు హీరో అన్నది తర్కించుకునే మీరు వేసిన డ్రస్సు వేస్తే — సహిస్తారా? పాత్ర పేదది గాని హీరో పేదవాడా? ప్రొడ్యూసరు పేదవాడా!

పి. ఏస్. ఆర్. ఇలెందు

జీవితంలో మరిచి పోనిది మధురమైనది మనసులో దాచుకోలేనిది ఏమిటండి?

సొంతగొప్ప!

వి. బి పలాసా

ఈ సృష్టిలో ప్రేమకు పెళ్లికి పగే అంటాను మీరేమంటారు?

సిన్‌తో బతికేకంటే పగలో బ్రతకడంమెరుగు అంటాను.

కె. జి. ఎస్. కె. కుప్పం

బలమైన దెబ్బకంటే పరుషమైన మాట మనిషిలో చాలా మార్పు తెస్తుంది. కారణం?

శరీరం కంటె మనస్సు మన్నితమైనది కనుక.

ఎస్. బి. ఆర్. – రాజమండ్రి


ఈ అగ్రకులాలవాళ్లు మూడు వేల సంవత్సరాలుగా దేవుని పేర సమాజాన్ని పీడించారు. ఈ ముప్పయి సంవత్సరాలుగా అంబేద్కర్ వలన తక్కువ కులాలకు కల్గిన సహకారానికి ఆందోళన చెందుతున్నారు. జనాభాలో 10% వున్నా....

మీ లెక్కలూ పెర్సంటేజీలూ చదివాను. 'తక్కువ ఎక్కువ' కులంలో కాదు బుద్ధిలో.. ఆర్థిక స్తోమతులో. అంతేగాని తోడేలూ, మేక పిల్ల కథావతుగా చేస్తే ఎలా అగ్ర కులాల వాళ్ల జీవితాలు?....అగ్రకులాలే-ముందు కొచ్చి కులాంతర మతాంతర సంపర్కాలకి దోహదం చేస్తున్నారు. ఇంతెందుకు-బ్రాహ్మల కొదిలేయండి. ఇతర కులాల వారంతా—ఐక్యతాభావంతో వున్నారా? తక్కువ కులాలవారే—తమలో తాము హెచ్చు తగ్గులు చూపించుకుంటున్నారే. ఇంకా వారిలో వారేఎందరో ఏక పంక్తిని భోజనానికేనా కూర్చోరే—బ్రాహ్మలనెందుకండీ ఆడిపోసుకోవడం? మూడువేల సంవత్సరాల క్రిందట నీ తాతను వాళ్ళ ఏదో చేశారు. ఇప్పుడు విన్ను కాలరాస్తా ననడంలోని నీతి ఏమిటో నాకర్థం కాదు. సాటి బ్రాహ్మడిని పట్టించుకోనిది బ్రాహ్మడే—సహకరించడు. చేయ కల్గినా సహాయం చేయడు—ఎందుకు? బ్రాహ్మడు బ్రాహ్మడికి చేశాడంటారని. కాని ఇది ఇతర కులాల వాళ్లకి వర్తిస్తుందా? గుండెమీద చేయి వేసుకుని చెప్పండి? కులంవల్ల చెడి పోతున్నది బ్రాహ్మడు. బాగుపడుతున్నది ఇతరులు.

కె. టి. ఎస్. – మహబూబ్‌నగరు

అద్వితీయ రూపం చూసి ప్రణయ పురస్సరంగా కౌగిట చేర్చుకుందామని సమీపించిన శలభాన్ని దీపకలిక దయా రహితంగా రూపు నశాపు చేస్తుంది. ఎందుచేత?

ఎందుచేతేమిటి స్వామీ? దాని భయం దానిది ఆరిపోతానేమోనని!!



నిర్ణయం - వి. పద్మ

"ఇదిగోన్నరా, మన చీరల కుర్రాడు రానే వచ్చాడు" అంది టీచర్ వరలక్ష్మి కళ్ళజోడు సరిచేసుకుంటూ.

"ఇవాళ వచ్చాడేమిటే, ఫస్టు తారీఖు రేపయితేనూ" నాగరత్నం కామెంటు చేసింది.

"అవునవును. ఈ నెలాఖరులో అందరి చేతుల్లోనూ పర్సులయితే వుంటాయి కాని అందులో 'పస' ఏమీ ఉండదు" అందరి లోనూ కాస్త పెద్దదయిన లక్ష్మీకాంతమ్మ నవ్వుగా అనేసింది.

లంచ్ అవర్లో టీచర్లందరూ భోజనాలు కానిచ్చేసి, తీరికగా కూర్చొని కబుర్లు చెప్పు కుంటున్నారు.

ఇంతలో చీరల కుర్రాడు లోపలకి రానే వచ్చాడు. చీరలమూట నెత్తిన పెట్టుకుని ఈ చీరల కుర్రాడు సంవత్సరానికి ఒకటి, రెండుసార్లు ఇలా వచ్చి మూటంతా ఒక్క గంటలో ఖాళీ చేసుకుని వెళ్లడం మామూలే. ఈ అమ్మకంలో వాడికి, కొనడంలో వీళ్ళకి లాభం లేకపోలేదు. ఎంత ఖరీదైన చీరె అయినా సరే పైకం మొత్తం ఒక్కసారి చెల్లించే అవసరం లేదు. నెలకి 20 రూ. ప్రకారం ముట్టచెపితే చాలు. ఒక్కసారిగా డబ్బు పెట్టి ఖరీదైన చీరలు కొనలేని వాళ్ళకి ఈ పద్ధతి తేలికగా వుంటుంది. పైగా వాడు మంచిరకాలు కూడా తెస్తాడు. అందుకే ఈ చీరల వాడు రాగానే టీచర్లం దరూ బెల్లం చుట్టూ ఈగలలాగా మూగి చీరల మూటని నిముషంలో ఖాళీ చేస్తారు.

"వచ్చావా! మూడు నెలలయింది. ఎక్కడా వత్తావు లేవు అనుకుంటున్నాం" వరలక్ష్మి చీరలవాణ్ణి పలకరించింది.

"వస్తే ఊరికె వస్తానా అమ్మా! మంచి మంచి రకాలు వుంటేనే గానీ రాను." చీరలు పరుస్తూ అన్నాడు.

అందరు కిలకిల మంటూ చీరలచుట్టూ చేరారు.

ఇక్కడ యింత హడావిడి జరుగుతూ వున్నా లలిత మాత్రం ఇదంతా తనకి పట్టనట్టుగా నిన్న జరిగిన టెస్టు పేపర్లు దిద్దుతూ కూర్చుంది. ఈ విషయం నాగరత్నం గమనించింది.

"ఏమ్మా! లలితా, ఎదురుగా "పంచ భక్ష్య పరమాన్నాలు" ఉంటె రుచి చూడా ఏమిటి! అంది."

"నాకు ఇప్పుడు చీర కొనే వుద్దేశ్యం లేదండి" లలిత తల వంచుకుని పేపర్లు దిద్దుతునే అంది

"ఊరికే, చూడవోయ్, నచ్చితే తీసుకో, లేకపోతే లేదు" పంకజం అంది.

"చూడండి అమ్మగారు, ఇందులో బలవంతం ఏముంది" చీరల కుర్రాడు కూడా అనడంతో బాగుండదని లలిత పేపర్లు మడిచి తనూ చీరల దగ్గర కూర్చుంది.

"ఈ చీర చూడండి అమ్మా! డిజైన్ మీకు చాలా బాగా సూట్ అవుతుంది." కుర్రాడు పెద్ద పెద్ద పూలున్న చీర ఒకటి లక్ష్మీకాంతమ్మకి చూపించాడు.

"ఈ చీర కట్టుకుని వయసు దాన్ని అయిపోమంటావా నాయనా? మా వారు నన్ను గేలి చేస్తారు కూడానూ! నా కేమో, బోర్డరునూ, సన్న చుక్కలు వున్న చీరలు చూపించు" లక్ష్మీకాంతమ్మ అంది.

"అవును మరి, మీరు పైకి సన్న చుక్కలు అంటున్నారు గాని మీ కళ్ళన్నీ పెద్దపువ్వుల మీదే వున్నాయి అందుకే ఆ అబ్బాయి మీకు ఆ చీర చూపించాడు" పంకజం ఎత్తిపొడిచింది.

లక్ష్మీకాంతమ్మ గుర్రుగా చూసింది "నన్నేదో అన్నావు, మరి నువ్వంత ముదురు రంగు తీశావ్, అంత తెల్లగా వుంది" అంది కోపంగా నల్లటి పంకజాన్ని ఎదురుదెబ్బ కొడుతూ.

"సరే, సరే, ఇంక కబుర్లు మాని త్వరగా తెమల్చండి. అవతల టైం అయిపోతోంది" వరలక్ష్మి త్వరపెట్టింది.

ఇలా కబుర్లలతో, ఎత్తిపొడుపులతో అందరూ చీరలు సెలక్షన్ చేసుకున్నారు. లలిత స్నేహితురాలు మల్లిక తెల్లటి జార్జెట్ చీర తీసుకుంది.

"దీనిమీద నేను పెయింట్ చేస్తాను" అని "లలితా, నువ్వేమీ తీసుకోవా" అంది.

"ఉహుం!" అంది లలిత మౌనంగా.

"అదేమిటమ్మా! లలితా! నలుగురితో పాటు నారాయణా అనాలి. అందరం తీసుకున్నాం. నువ్వూ తీసుకో!" నాగరత్నం సలహా యిచ్చింది. ఇంతలో చీరల కుర్రాడు అడుగునపడివున్న చీర పాకెట్ పైకి తీశాడు. అది లేత నీలం రంగు జార్జెట్ చీర దానికి బోర్డర్‌గా మూడువేళ్ల వెడల్పుతో ముదురు నీలం రంగులో పువ్వులు, లతలు ఉన్న లేస్ వుంది. ఆ చీర ఎంతో అందంగా, అపురూపంగా, గుప్పెటలో పట్టుకుంటే యిమిడిపోయేటంత నాజూకుగా వుంది.

"మీది మంచి పసిమిరంగు, ఈ చీర మీ వంటికి అద్భుతంగా వుంటుంది చూడండి" అన్నాడు చీరల కుర్రాడు.

ఆ చీర లలిత మనసుని దోచుకుంది.

"అబ్బ, ఎంత బాగుందో ఈ చీర" అంది పంకజం.

లలిత మనసులో తల్లి తండ్రులు, తమ్ముడు, చెల్లెలు కదిలారు ఎవ్వరికీ సరైన బట్టలు కూడా లేవు. తను ఈ చీర కట్టుకుంటె ఏం బాగుంటుంది?

"ఇంకా ఏటి ఆలోచిస్తున్నావు లలితా? ఆ చీర నీకు నచ్చలేదా?" నాగ రత్నం అడిగింది.

"బాగానె వుందండి!" అంది లలిత.

"అయితే ఇంకేం? ఎంతయ్యా ఆ చీర ధర" వరలక్ష్మి అడిగింది.

కుర్రాడు చీర మీద వ్రాసిన ధర చూసి "199 రూ లు" అన్నాడు.

"మాట తొంభై తొమ్మిదా! ఆ ఒక్క రూపాయి ఎందుకు నాయనా తక్కువ" చీర ధర వినేసరికి లలిత గుండె దడదడ లాడింది.

ఇంతవరకు తను కట్టుకున్న చీరలన్నీ తక్కువ ధరవే, ఇంత ధర పెట్టి చీర కొనలేదు.

"200 అయితే ఏమిటమ్మా? మీరు ఒక్కసారీ యిస్తున్నారా డబ్బు? నెలకి 20 రూ. కదా మీరు యిచ్చేది" చీరల కుర్రాడు వచ్చచెప్పాడు

"అదీ నిజమే ఒక్కసారిగా ఇంత ధర పెట్టి బయట షాపులోతను కొనగలదా!" లలిత మనసు నెమ్మదిగా చీరవైపే మొగ్గు చూపడం మొదలుపెట్టింది.

అమ్మా, నాన్నకి తను నచ్చచెపుతుంది. నాన్న తన మాట కాదనరు.

"మా ఇంట్లో చూపించి వాళ్లకి నచ్చితే తీసుకుంటాను" అంది లలిత చివరిసారిగా.

కుర్రాడు నవ్వాడు "ఇంత చక్కటి చీర ఎవరికి నచ్చదు చెప్పండి? ఎవరికైనా ఈ చీర నచ్చలేదంటే వాళ్ళకి కళ్లులేవని అర్ధం."

"ముందరి కాళ్లకి బంధం బాగానే వేస్తున్నాడు" వరలక్ష్మి గొణుక్కుంది.

"అదేమిటి? ఒకళ్ళకి నచ్చింది, యింకొకళ్లకి నచ్చాలనీ రూలేముంది" మల్లిక అంది.

ఏమయితేనేం, లలిత చీర తీసుకుని బయలు దేరింది.

అందరూ కుర్రాణ్ణి హెచ్చరించారు డబ్బులు మాత్రం యివ్వాళ కాదు, రేపు యిస్తాం. రేపు ఫస్టుతారీఖు కాబట్టి, అని.

అందరూ చేతుల్లో క్రొత్త చీరలతో కళకళలాడే ముఖాలతో యిళ్లకి బయలు దేరారు. లలిత, మల్లిక ప్రక్క ప్రక్కనే నడవసాగారు.

'అడుగోనే మన హీరో" అంది మల్లిక సడన్‌గా


ఆ హీరో ఎవరో లలితకి తెల్సుకాబట్టి తల ప్రక్కకి తిప్పి చూడలేదు. రెండు, మూడు నెలల నుండి ఆ అబ్బాయి బస్ స్టాపులో కనిపిస్తూనే వున్నాడు, తన స్నేహితులతో సహా. మంచి ఒడ్డూ,పొడుగు, తీరైన ముఖం, చక్కటి క్రాప్ వుండడమే కాకుండా, తనకి తగినట్లు మంచి బట్టలు వేసుకుని ఎప్పుడూ నీట్‌గా మల్లెపువ్వులా వుంటాడు.

ఒకరోజు మల్లిక కనిపెట్టి "లలితా, ఆ అబ్బాయి ఎవరో మన వైపే చూస్తున్నాడే" అని చెప్పింది. లలిత తల తిప్పి చూసింది.

అతను బిస్కెట్ కలర్ ప్యాంట్, డార్క్ కలర్ షర్టు వేసుకుని, క్రాప్ చక్కగా దువ్వుకుని నీట్‌గా వున్నాడు. లలిత తల తిప్పి చూడగానే అతను కొద్దిగా పెదవులు కదిపి నవ్వినట్లుగా చూశాడు. లలిత వెంటనే తల తిప్పేసుకుంది.

మల్లిక "మనవైపు చూస్తున్నాడు" అని చెప్పింది గానీ అతను చూసేది తన వైపు మాత్రమేనని లలిత గమనించింది. కానీ అతనేమో చెడువుద్దేశ్యంతో చూస్తున్నట్లుగా అనిపించలేదు. అతను మంచి సంస్కార వంతుడులాగె కనిపిస్తున్నాడు. కానీ ఎవరి మనసులో ఏముందో ఎవరికి తెలుసు. అందుకే లలిత మళ్లీ అతనివైపు చూడలేదు. కానీ అతను రోజూ అక్కడ నిలబడి వుండడం మల్లిక ద్వారా తెలుస్తూనే వుంటుంది.

ఒకరోజు మల్లిక అతని గురించి సమాచారం సేకరించింది. అతని పేరు సుధీర్ అని, ఆంధ్రాబ్యాంక్‌లో కొత్తగా ఉద్యోగంలో



చేరాడనీ. "ఇదంతా నీకెలా తెలుసు?" లలిత అడిగింది.

"మవ్వు పట్టించుకోవు గదా అని యింకెవరు పట్టించుకోరా" అని నవ్వింది మల్లిక.

లలిత ఆ తర్వాత ఎప్పుడూ అతని వైపు చూడలేదుకానీ ఒక్కనిముషం తను అతనిని చూడగానే అతను నవ్వబోవడం, అతను నిలబడిన తీరు, ఎప్పుడూ జ్ఞప్తికి వస్తూనే వుంటుంది. ఒక మనిషి తన్ను యిష్టపడు తున్నాడన్న నిజం ఆమెకి ఎంతో సంతృప్తిగా అనిపించింది.

ఇవాళ లలితికి అతను మాటి మాటికి జ్ఞాపకం వస్తున్నాడు. తనది చాలా పెద్ద జడ. తలంటుకుని తలలో మల్లెలు పెట్టు కుని, ఆ నీలంచీర కట్టుకుని, బొట్టూ, కాటుక పెట్టుకుని వస్తే తనని అతను ఎలాచూస్తాడో! మెచ్చుకున్నట్లు—చూస్తాడా?

"ఏమిటో ఏం మాట్లాడవు" మల్లిక మాటలతో ఈ లోకానికి వచ్చింది లలిత.

'హీరో అదిగో అనగానే ఆలోచన్లో పడ్డావా' ఉడికించింది మల్లిక.

"ఛీ, ఛీ, అతనిగురించి ఎవరాలోచిస్తు న్నారు ?" అంది లలిత.

మల్లిక తన మనసు కనిపెట్టిందని తెలియగానే లలిత ముఖం ఎర్రగా కందిపోయింది.

"ఇవాళ మన హీరో పుట్టినరోజను కుంటాము" అంది మల్లిక.

"ఎలా తెలుసు" అడిగింది లలిత.

"ఒక్కసారి అటుచూడు" అంది మల్లిక.

అతను ఏదో విశేషం వున్నవాడిలాగె కనిపిస్తున్నాడు.

నిర్ణయం

లలితవైపే చూస్తున్నవాడు, లలిత తన వైపు చూడగానే కళ్లలోకి సూటిగా చూశాడు. ఛీ అని తల తిప్పుకుంది లలిత. ఇలా చల్లని వెన్నెలలో, మల్లెపూల పాన్పుమీద పడుకున్న ట్లుగా వున్న ఆలోచనలన్నీ యిల్లు దగ్గర కాగానే ఆకాశంలో నుండి పాతళంలోకి విసిరి వేయబడినట్లుగా అయింది. లలిత తండ్రి రెండేండ్ల క్రితమే రిటైర్ అయ్యారు అదే సమయానికి లలిత బి. ఎ. ప్యాసయి వెంటనే స్కూల్లో టీచర్‌గా చేరడంతో తండ్రికి కాస్త విశ్రాంతి దొరికినట్లు అయింది. తండ్రి ఖాళీగా వుంటే యిల్లు గడిచే ఆధారం లేదుకాబట్టి, ఆయన ఒక సరుకులదుకాణంలో లెక్కలు రాసే పనిలో చేరారు లలితకు, ఆయనకు వచ్చే ఆ కొద్ది మొత్తంలో యిల్లు గడవాలి తమ్ముడు, చెల్లెలు చదువులు నడవాలి—అమ్మకి వున్నది ఒక్కటే మంచి చీర. లలితకి, ఆమె తండ్రికి వచ్చేజీతం ఏ నెలకి, ఆ నెల అప్పు చేయకుండా గడవ డానికి ఎంతో కష్టం అవుతుంది. లలిత తండ్రి చాలా అభిమాన వంతుడు. తిండి లేకపోతే చావంలే, అప్పకి మాత్రం చేయి జాపను అంటారు ఆయన.

ఇంటి పరిస్థితి తెలిసే యిటువంటి పని ఎలా చేసింది? ఈ చీర కట్టుకుని తమ వాళ్ల మధ్య ఒక్క నిముషమైనా నిలబడగలదా? లలిత తను చాలా తప్పు పని చేసినట్లు మదన పడ సాగింది.

లలిత గుమ్మంలో అడుగు పెట్టగానె వసారాలో కుర్చీలో కూర్చొని ఆమె తండ్రి పేపర్ చదువుతూ వున్నారు. లలితను చూడ గానె "వచ్చావామ్మా" పలకరించారు. తమ్ముడు, చెల్లి అప్పుడే స్కూలు నుండి వచ్చినట్లున్నారు. అమ్మ వంటగదిలో కాఫీ పెడుతోంది. లలిత ఆ రోజే తను ఈ ఇంటి పరిస్థితి గమనిస్తున్న దానిలా అందరిని మనస్సులోనే గమనించ సాగింది.

అలా కుర్చీలో కూర్చుని పేపర్ చదువు తున్న నాన్నకి వున్నవి రెండే రెండు మంచి చొక్కాలు, పంచలూ ఆయన అవి వేసుకునే వుద్యోగానికి పోతారు. తమ్ముడు, చెల్లి చిన్న వాళ్లయినా వాళ్ళకి యింటి పరిస్థితి బాగ తెలుసు వాళ్ళు ఏ నాడు మాకు 'ఇది కావాలి అని అడగరు అమ్మా, నాన్న తమని అల పెంచారు ఎప్పుడూ మన స్థితికి తగినట్లుగ వుండాలి కానీ అందని అంతస్తుల కోసం ఎగబ్రాక కూడదని నాన్న ఎప్పుడూ చెపుతునే వుంటారు. అన్నీ తెలిసీ తను ఈ పని ఎలా చేసింది ?

కాఫీ యిస్తూ అమ్మ అడగనే అడిగింది—"ఏమిటే ఈ కవరు" అనీ.

లలిత ఒక్కసారి వులిక్కిపడింది.

"అది మనది కాదమ్మా. ఇవాళ స్కూలుకి చీరల వాడు వస్తే మల్లిక కొనుక్కుంది. మన యింట్లో చూపించి ఎలా వుందో కనుక్కోమంటే తెచ్చాను" అంది లలిత.

ఆ చీర తీసి తల్లికి చూపించింది లలిత.


ఒక్కసారి చీర విప్పగానే నాజూకుగా, మెత్తగా వున్న చీర "నీవు వుండవలసిన స్థానం యిదిగాదు సుమా" అని వెట్కార్చి నట్లుగా అనిపించింది లలితకి.

"ఎంత బాగుందో చీర, అదృష్ట వంతురాలు. ఆ పిల్లకి ఎటువంటి బాధ్యతలు లేవు. వచ్చే జీతమంతా దాచుకుని ఇటువంటి చీరలు కొనుక్కుంటుంది. మేమూ వున్నాం, ఎందుకు దండగ. కూతురు జీతం మీద ఆధారపడి వున్నాం" ఆవిడ పైకి ఉదా సీనంగా అన్నా, లోపల దుఃఖాన్ని ఆపుకున్న ట్లుగా కనిపించింది.

ఆ మాటలకి లలిత బాధ పడింది.

"ఇంకెప్పుడైనా ఆ మాట అంటే నా మీద ఒట్టేనమ్మా. నేనే మొగవాణ్ణయితే ఏం చేసేదాన్ని. నేను యీ యింటికి పెద్ద కొడుకునమ్మా ఇంకెప్పుడూ అలా బాధ పడకు" అంది లలిత బాధగా.

ఆ రాత్రి పడుకుందేగానీ లలితకి నిద్ర



నిర్ణయం

పట్టలేదు. ఎందుకో చాలా బాధగా, ఆ బరువుని మనస్సు మోయలేనట్లుగా అనిపించింది లలిత కళ్లనుండి తనకు తెలియకుండానే నీళ్ళు జలజలా కారసాగాయి. తను ఏం పని చేస్తోంది? తండ్రి గీసిన లక్ష్మణ రేఖను దాటాలని చూస్తోందా? అందని అంతస్తుల కోసం ఎగబ్రాకాలని చూస్తోందా? ఆ చీరకోసం తను ఎందుకు ఆశపడింది? అలాగే తన మనస్సు సుధీర్ కోసం ఆశ పడడం లేదుగదా? అతనికీ, తనకీ ఆకాశానికి భూమికి వున్నంత దూరం వుంది. అతను తనవైపు చూస్తే తను ఎందుకు సంతోష పడుతోంది. అలా తను ఎంతసేపు ఏడ్చిందో తనకే తెలియదు.

ఇంటికి రాకముందు దాకా తనని సంతోష పెట్టినచీరని ఇప్పుడు చూస్తే చాలు అసహ్యమనిపించింది. అంతకుముందు తనని చూపినవ్వాడని, తన కళ్లలో కళ్ళు పెట్టి చూశాడని సంతోషించిన కల్మషంతోవున్న తన మనసుని చూస్తే తనకి అసహ్యమనిపిస్తోంది. నెలకి ఇరవై రూపాయలు యిచ్చి తను రెండు వందల రూపాయల వెలకల ఆ చీరని తీసు కొనగలదు. కానీ అంత ఖరీదైన చీరను కట్టుకునే అర్హత తనకి లేదు. ఆ రెండు వందలు పెడితే ఇంటిల్లిపాది కాస్త మంచి బట్టలు కొనుక్కోవచ్చు.

ఆ చీరని రేపు తను వాపస్ ఇచ్చేస్తుంది. అలా తను యింకెప్పుడు సుధీర్ వైపు చూడను కూడా చూడదు, ఆలోచించదు.. అంతే ఈ విధంగా గట్టిగా నిర్ణయం చేసుకున్నాక లలితకి సంతృప్తిగా అనిపించింది.

మనస్సులో బరువు తగ్గినట్లుగా అనిపించాక ఆమెకి తెలియకుండానే ఎప్పుడో నిద్ర పట్టేసింది.

పొద్దునే లేచి ముఖం కడుక్కున్నాక రాత్రంతా ఏడ్చి ఏడ్చి ముఖం అంతా వుబ్బినా మనస్సు మాత్రం తేలికగా, బాధంతా తీసివేసి మబ్బులు పోయిన తర్వాత నిర్మలంగా వున్న ఆకాశంలా అయింది.

అందరూ భోజనాలు చేసేటప్పుడు లలిత తల్లి అడిగింది.

''సరుకులన్నీ నిండుకున్నాయండి'' అని.

''ఇవాళ మాకు జీతాలు వస్తాయిగా, కొందాం'' అన్నారు లలిత తండ్రి.

కార్లకి హైడ్రోజను ఇంజను!

జపానులోని ప్రభుత్వ పరిశోధనా సంస్థవారు క్రొత్తరకం హైడ్రోజను కారు ఇంజన్ను తయారు చేశారు. ఇందులో అల్పపీడనంలోగల హైడ్రోజను వాయువును ఇంధనంగా ఉపయోగిస్తారు. లోహ సమ్మేళన పదార్థాల నుండి తయారయ్యే హైడ్రోజను తక్కువ పీడనం కలిగి వుంటుందని పరిశోధనల్లో తేలింది. ఈ ఇంజనులో దీనినే ఇంధనంగా ఉపయోగిస్తారు. హైడ్రోజనువాయువు ఇంధనంగా గ్యాసోలిన్ కంటే సమర్థవంతంగా పనిచేయగలదని కూడా పరీక్షల్లో తేలింది. ఒక లీటరు హైడ్రోజనువల్ల 1010 కాలరీల ఉష్ణం ఏర్పడితే, గ్యాసోలిన్ వలన 848 కాలరీల ఉష్ణం మాత్రమే ఏర్పడింది.

''మాకు నోట్‌బుక్స్ కొనాలి నాన్నా'' అన్నాడు తమ్ముడు.

''తప్పకుండా కొంటాను'' అన్నారు లలిత తండ్రి.

''ఈ నెల నుండి ఎలాగైనా మనం నెలకి ఇరవై రూపాయలు దాచాలి నాన్నా'' అంది లలిత.

''ఎందుకమ్మా'' అన్నారు నాన్న ఆశ్చర్యంగా.

''ఇంట్లో ఎవరికీ సరైన బట్టలు లేవు. కాస్త రెండు, మూడు వందలు దాచామంటే ఇంట్లో అందరం గుడ్డలు కొనుక్కోవచ్చు'' అంది లలిత.

ఆయన నవ్వారు.

''ప్రతినెలా అప్పులేకుండా గడిచేసరికి దేవుడు దిగి వస్తున్నాడు'' అన్నారు.

''ఎలాగైనా సరే నాన్నా, మనం కాస్త దాచుకోవాలి. నేను దాస్తాను నాన్నా! మనం కూడా అందరిలా మంచి బట్టలు కట్టుకోవాలి'' ఈ మాటలు లలిత పైకి అనలేదు కాని మనస్సులోనే దృఢనిశ్చయంతో గట్టిగా అనుకుంది.

వంటలు



"కొత్తిమీరి కూర"

కావలసిన వస్తువులు ; కొత్తిమీర-10 కట్టలు, కొబ్బరికోరు – 2 చిప్పలది, చింతపండు – కొద్దిగా, ఆవాలు – 2 చెంచాలు, మినప్పప్పు – 3 చెంచాలు, ఎండు మిర్చి – 6, జీలకర్ర – 1 చెంచాడు పసుపు – చిటికెడు, ఉప్పు – తగినంత.

తయారు చేయుట : మొదట కొత్తిమీర బాగా సన్నగా తరుగుకోవాలి. కొబ్బరికోరు కోరి రెడీగా ఉంచుకోవాలి ఆ తరువాత ఈ రెండూ కలిపి రోట్లోవేసి కాస్త చింతపండు కూడా వేసి, చెక్కాముక్కా గట్టిగా ముద్దగా నీళ్ళు పోయకుండా రుబ్బాలి. తరువాత– బాణలిలో కొద్దిగా నూనెపోసి కాచీ, పైన చెప్పిన పోపు సామాన్లు వేసి వేయించి తీసి ప్రక్కను పెట్టుకోవాలి ఆ తరువాత ఈ కొత్తిమీరి కొబ్బరి ముద్దనువేసి బాగా ఎర్రగా పొడిగా వచ్చేట్లుగా వేయించాలి. బాగా వేగినాక అప్పుడు అందులో వేయించి ఉంచుకున్న పోపూ, ఉప్పూ, పసుపు వేసి తిరగమోత బాగా కలిపి దింపేయాలి. ఇది అన్నంలోకి, టిఫిన్‌లలోకి, చాలా రుచిగా ఆధరువుగా ఉండి, 3, 4 రోజులపాటు చెక్కు చెదరకుండా నిలవ ఉంటుంది. దీని రుచి అద్భుతం! అమోఘం !!

– జి రామలక్ష్మి

రేగిపళ్లు ఊరగాయ

కావలసిన వస్తువులు :– రేగిపళ్లు – 5 కే జీలు, ఆవాలు – 50 గ్రా లు, చింతపండు – పావుకేజి, బెల్లం – 1 కేజీ, జీలక ర–15గ్రా.లు, మెంతులు–20గ్రా.లు, కారంపొడి–100 గ్రా.లు, నూనె(రిఫైండ్) –అరకేజి, ఉప్పు, పసుపు తగినంత

చేయు విధానం :– పుచ్చులు లేనివి, తాజావి అయిన రేగిపళ్ళు ఎంచి, శుభ్రంగా తుడిచి, వెడల్పైన పాత్రలో వేసి తగినంత ఉప్పు, కారం వేసి కలిపి ఎండలో 3 రోజు లుంచాలి. చింతపండులో కొద్ది నీరు చేర్చి చిక్కని పుల్ల రుబ్బి తీయాలి. దీనిని అరగంట ఎండలో ఉంచి తీయాలి. జీలకర్ర, మెంతులు పొయ్యిపై మూకుడులో కొద్ది సేపు వేసి మెత్తని గుండ చేయాలి. ఆవాలు ఎండలో 1 గంట ఉంచి చేటలో వేసి చెరుగుతే పై పొట్టు వచ్చేసి, పచ్చని గుడ్లు మిగులుతాయి. వాటిని మెత్తగా దంచాలి. శుభ్రమైన గాజు జాడిలో 3 రోజులు ఎండిన రేగిపళ్ళు వేయాలి (రసంతో కలిపి) అందులో జీలకర్ర, మెంతుల పొడి, కారం పొడి, ఆవపిండి కలిపేయాలి. చింతపండు పుల్ల కూడా ఆ తర్వాత కలిపి ఉంచాలి. బెల్లాన్నే తీగెపాకం పట్టి చల్లారేక కలపాలి. నూనె కూడా కొద్దిగా వెచ్చబెట్టి చల్లారేక ఈ మొత్తం ఊరగాయలో కలిపి 15 రోజుల పాటు ఎండలో ఉంచుతూ తీసే నిలవ ఉంటుంది

పులుపు, తీపి, కారం అన్ని రుచులతో తింటుంటే నోరూరిస్తూ ఎంతో మజాగా ఉంటుంది ఊరగాయ.

– ఎల్ వి. ఉమ

సగ్గుబియ్యపు పకోడీలు


కావలసిన వస్తువులు: పెరుగు - 2కప్పులు, సగ్గుబియ్యం–1 కప్పు, బియ్యపుపిండి – 2 కప్పులు, ఉల్లిపాయలు–4 (పెద్దవి), పచ్చి మిరపకాయలు - 10, షోడా ఉప్పు–కొద్దిగా, ఉప్పు–తగినంత, కొత్తిమిర–1 కట్ట.

చేయు విధానము :– సగ్గుబియ్యము పెరుగులో రెండు గంటల ముందుగా నాన బెట్టవలెను. అరగంట ముందు ఆ మిశ్రమానికి బియ్యపు పిండి కలిపి ఉంచుకొనవలెను. తరువాత పచ్చిమిరప కాయలను, ఉల్లిపాయ తరిగి కొత్తిమిర వలిచి షోడాఉప్పు, ఉప్పు వీటన్నిటినీ ముందుగా కలిపి ఉంచుకున్న సగ్గుబియ్యపు మిశ్రమానికి చేర్చాలి. బాణలిలో నూనె మరగించి వీటిని పకోడీల మాదిరిగా దోరగా వేయించుకోవాలి. ఇవి వేడి మీద చాలా రుచిగా ఉంటాయి.

–జి సావిత్రి

మమతాంకురాలు

జి. భాను



హైదరాబాద్ వెంటనే రమ్మని ఉత్తరం వచ్చింది. వచ్చేటప్పుడు ఆదివరకు అనుకొన్న ప్రకారంగా డబ్బు తేవలసిందనీ, ఉద్యోగం ఖాయం అని ఆ ఉత్తరం సారాంశం!

నా మేనల్లుడు డిగ్రీ చేతికి వచ్చినా, గోళ్లు గిల్లుకొంటూ, రోడ్లు గస్తీ తిరుగుతున్న కారణంగా, హైదరాబాద్‌లో తెలిసిన మిత్రున్ని బతిమిలాడి, బామాలి, హోటళ్లు మొదలైనవాటికితిప్పి, ఉత్తరాలమీదఉత్తరాలు గుప్పించి, నా మేనల్లుడి పరిస్థితి ఏకరువు పెట్టి 'ఈ కరువు రోజుల్లో మీరు తప్ప గత్యంతరం లేదు' అని ప్రార్థించాను.

'సరేగాని ఒక షరతు ఇదుగో ఇంత రుసుపు చెల్లిస్తే తాత్కాలికంగా పూనా డిపార్టుమెంటులో ఉద్యోగం వచ్చే ఏర్పాటు చేస్తాను ఆహార, విహార, వ్యవహారాల్లో మొహమాటం ఉండకూడదనీ లోకరివాజు ప్రకారం నీదగ్గర దాచకుండా చెబుతున్నా. ప్రయత్నం చేసినందుకు కొంత నాకు మిగతాది వాళ్లకు. తర్వాత నీ యిష్టం' అన్నాడు, చిన్నప్పుడు నాతో చదువుకొని, హైదరాబాద్‌లో గడితేరి మొనగాడైన మోహనరావు. 'సరే' అని అతను చూపించిన త్రోవల్ను చూసి ఒప్పుకొన్నాను. నేను వచ్చిన నెల పదిహేను రోజులకే ఈ ఉత్తరం వచ్చింది

ఇంతకు ముందే చేయవలసిన ప్రయత్నం చేశాను కాబట్టి ఉత్తరాన్ని చూసి హడావుడి పడలేదు నిమ్మకు నీరెత్తినట్లు స్థిమితంగా ఉన్నాను నా మేనల్లుని తాత్కాలిక ఉద్యోగం కోసం శాశ్వతంగా పడివుండే ఇళ్ల స్థలం అమ్మి, డబ్బు సంతనచేసి పెట్టుకొన్నాను.

ఉద్యోగాల అన్వేషించే ప్రయత్నంలో నీతి నియమాలు, మానవత్వాల మూల్యాలు, తర్వాత సంభవించే ప్రభావాలు మొదలైన వాటిని గూర్చి ఆలోచించడం అనవసరమే కాదు, నిరర్థకం అనే అభిప్రాయానికి వచ్చిన నేను, ఉత్తరోత్తరా కలిగే మంచి చెడుల తారతమ్యాల్ని సమీక్షించి, తర్కించే, బాదరబందీకి లోను కాలేదు.

ఈ ప్రపంచం అంతా ఒక దారిని వెళ్తున్నప్పుడు, మామూళ్లు, లంచాలు, బహుమతులు, పార్టీలు మామూలు లాంఛనాలుగా పరిగణించబడుతున్నప్పుడు ఎన్ని బలహీనమైన అంతరాత్మలు ఘోషిస్తే మాత్రం ఏమిటి? అనే తాత్వికధోరణిలో నా మనస్సుకు చిక్కం పెట్టుకొన్నాను. ప్రయాణానికి సిద్ధం అయ్యాను. తీరా బట్టలు సర్దుతుంటే సూటుకేసు పాతదే, దాని పైమూత ఊడి పోయింది! అందుకని హరహరా అని బజారు పరుగెత్తాను మధ్యాహ్నం ఎండలో.

మెయిన్ బజారులో అన్వార్ ఇండస్ట్రీట్ అనే షాపు దగ్గరకు వెళ్లాను. అక్కడ పదమూడు, పధ్నాలుగేళ్ల కుర్రవాడు పని చేస్తున్నాడు. సన్నగా ఉన్నా ఉషారుగా ఉన్నాడు. పెద్ద కళ్లు అరవిక్కారు. పీచు లాంటి జుట్టు.

"రండి సార్... ఏం చెయ్యాలి సార్?" అన్నాడు

"నువ్వే రిపేరు చేస్తావా? ఇంకా పెద్దోళ్లు ఉన్నారా?!"

"ఆదేంటి సార్! చిన్నప్పట్నుంచి ఈ పన్లోనే ఉన్నాగదా సార్. బేగ్‌లు, గీగులు, సూటుకేసులు, గీటుకేసులు అన్నీ టకటకా చేసిపారేస్తా సార్..."

"సరే ఇదుగో ఈ సూటుకేసు మూత ఊడిపోయింది. లోపల గుడ్డకూడా ఊడిపోయింది ఎంత తీసుకొంటావో చెప్పు. ఇంతకీ నీ పేరేమిటి?"

"నా పేరు సుల్తాన్ సార్. ఇటియ్యండి" అని సూటుకేసు తీసుకొని, అటు, ఇటూ తిప్పి చూశాడు.

"దీనికి వెనక రివిట్లు ఊడి పోయ్యాయి సార్... చూడండి రెండు, మూడు రివిట్లు పడతై సార్. ఈ గుడ్డని జిగురుతో అంటించాల. మంచి రివిట్లు వెయ్యాలి సార్. ఒక్క రివిట్ ఖరీద్ రూపాయిన్నర సార్. రివిట్లు, నా కూలి మొత్తం ఆరు రూపాయలవుతుంది సార్" అన్నాడు.

పనిసంగతేమోగాని మొత్తానికి మాటకారిలాగా కనబడ్డాడు ఆ కుర్రోడు. కొంచెం ఎక్కువగా చెబుతున్నట్లుగా నాకు అనిపించింది. అయినా ఒక విధమైన ఆకర్షణ, ఆ మాటల్లో ఉండడం వల్ల ఇంకో చోటికి వెళ్లే ప్రయత్నం చేయలేదు.

'ఇదుగో సుల్తాన్! ఆరు గీరు లేదు. చివరిమాట ఐదిస్తాను. తొందరగా చేసి పెట్టు. మెడికల్ షాపు కెళ్లి అమృతాంజనం తెచ్చుకొంటాను ఇంతలో' అని వెళ్లాను.

ఓ పావుగంటకు వచ్చేటప్పటికి సుల్తాన్ నా పని అరకొరగానే ఉంచేశాడు. ఒక రివిట్ మాత్రం బిగించాడు. నేను అక్కడున్న మ్బాలు మీద కూర్చున్నాను.

అంతలో ఎవరో కుర్రోడు ప్లాస్టిక్ నవ్వారు సంచిలో వేసుకొని దిగులు మొహంతో వచ్చాడు. వాడికి పది, పదకొండు సంవత్సరాల కంటే ఎక్కువ వుండవు. పసితనం, అమాయికత్వం వాడి ముఖంలో తొంగి చూస్తున్నవి

'ఏమ్టి బాబూ! ఏంకావాలి?' సుల్తాన్ అడిగాడు.

'ఇదుగో! 'ఈ నవ్వారు కుట్టాలి?' అన్నాడు బైటకు తీసి.

'ఎన్ని సోట్ల కుట్టాలి?'

'ఎనిమిది చోట్ల కుట్టాలంట ... తెగిపోయింపట... మా షావుకారు తొందరగా రమ్మన్నాడు... లేకపోతే అన్నానికి పంపించడంట' దిగులుగా అన్నాడు.

'ఎవరు మీ షావుకారు?'

'పాపారావు ... విజయాటాకీస్ దగ్గిర కొట్టు'

'సరే ... రూపాయిన్నరవుతుంది దాన్ని కుట్టాలంటే...ఉందా?'

'అద్దరూపాయే యిచ్చాడు మా షావుకారు మరి'

'సరే జల్దిగా ఎళ్లి ఇంకో రూపాయి తీస్కరా...ఎనిమిది కుట్లకి అద్దరూపాయి యిస్తే గిట్టదనిచెప్పు...ఇది అద్దె యాపారం కాదు...ఎళ్లు...'


వీడు చాలా గట్టోడు. ఆఫీసరైతే ఇటువంటివాడు యమా లంచాలు పడతాడు అనుకొన్నాను. వయస్సు తక్కువైనా జాలిలేదు, కరుణ లేదు. డబ్బే ముఖ్యం వీడికి. డబ్బు ఎంత గడ్డి తినిపిస్తుంది? ఏ రంగంలోనైనా ఈ ధన దాహం ముమ్మరంగా ఉంది! అనుకొన్నాను.

'చూడండి సార్! ఈ షావుకారు లమ్డి కొడుకులకు సిగ్గూ, శరమ్ లేదుసార్ ... ఆ పాపారావుది షామియానాల అద్దె కొట్టు సార్...పాపం ఆ కుర్రోణ్ణి తిండికి పంపలేదు సార్...ఎంత ఆశ సార్ షావుకార్లకి ... టీకి గూడా డబ్బు లివ్వర్ సార్ ఈ దొంగ నాయాళ్లు. అమ్మ! వీళ్లకి వీడు ఎంత కొట్టేస్తనాడో కమీషన్ అనే యావ సార్ ...' మనషంటే జాలి ఉండాలి సార్...' సుల్తాన్ మాట్లాడుతున్నాడు. నాకు ఒళ్లు మండుతున్నది.

గుడ్సులో నుంచి నిన్నమొన్న వచ్చిన బచ్చాగాడు, జాలి అనే మాటకు అర్థం తెలియని కుర్రకుంక, లోకం అంటే అమీ తుమీ తెలియని పిల్లకాకి ఎవడికో లేని జాలిని గురించి నాతో మాట్లాడుతున్నాడు; నన్ను వాజమ్మను చేసి. దెయ్యాలు వేదాలు వల్లించడం అంటే ఇదే కాబోలు! ఎనిమిది కుట్లకు రూపాయిన్నర కావాలని పట్టుపట్టిన వీడు ధర్మప్రభువు! మిగతావాళ్లు అధర్మ చక్రవర్తులు! లోకంలో ఈనాడున్న విచిత్రం ఏమిటంటే బొడ్డూడని వాడు మొదలుకొని గద్దెక్కిన ప్రతిగాడిద కొడుకు ధర్మపన్నాలు వల్లించే వాళ్లే! హరికథల్లో పిట్టకథలు కలిపికొట్టేవాళ్లే! క్రియ దగ్గరకు వచ్చేటప్పటికి అంతా తల్లక్రిందులు! అదే కాకపోతే నేను ఎండలో పడివచ్చి, ఈ సూటుకేసు రిపేరు చేసుకోవలసిన దుర్గతే పట్టేది కాదు!

అంతలో ఇంతకు ముందు వెళ్లిన కుర్రవాడు వచ్చాడు. వాడి ముఖంలో ఏడుపు కనబడుతున్నది. ఎండలో రావడం వల్ల చెమట బాగా పట్టింది. చొక్కాతో ముఖం తుడుచుకొన్నాడు.

'తెచ్చావా?' అన్నాడు సుల్తాన్.



మమతాంకురాలు

'ఆఁ...మరే... మా షావుకారే మొత్తం రూపాయిపావలే ఇచ్చాడు, మిగతా పావలా నన్నేసుకోమన్నాడు. నా కిచ్చే బేటాలో కలిపి రేపిస్తానన్నాడు. లేకపోతే ఇంటికి పంప డంటూ అన్నానికి' అన్నాడు.

'ఆహాఁ ... సరే ... మంచిదే ... ఏదీ రూపాయిన్నర ఇక్కడ పెట్టు'

రూపాయిన్నర మిషన్ బల్లమీద పెట్టాడు ఆ కుర్రవాడు.

నా సూటుకేసు గుడ్డను అతికించ బోతున్న సుల్తాన్ ఆ పని ఆపి, 'సార్! మీ పని అయిపోతుంది ఒక్క నిమిషంలో వీణ్ణి పంపేస్తాను' అని మిషను మీద ఎక్కి ఆ నవ్వారు అతుకులు గబగబా కుట్టాడు. కొద్ది నిమిషాల్లో ఆ పని పూర్తి చేశాడు. కుర్రగాడికి ఎంత ఆశ! డబ్బులు కనబడితే చాలు ఒక పని ఆపి ఇంకోపని అందుకొంటున్నాడు. సుల్తాన్ అంటే మనసులో నాకు కోపం ద్విగుణీకృతమైంది.

'చుట్టుకో బాబు నవ్వారు' అన్నాడు సుల్తాన్ ఆ కుర్రోణ్ణి ఉద్దేశించి. తర్వాత జిగురుతో నా సూటుకేసు గుడ్డను అతికించాడు.

'అయిపోయింది సార్ మీ పని! సూను కోండి... డబ్బులివ్వండి...'

నేను డబ్బులిచ్చి పెట్టెను క్రిందాపైనా చూసుకొంటున్నాను.

నవ్వారు చుట్టుకొని కుర్రవాడు వెళ్లబోతున్నాడు.

'బాబూ! ఇదుగో మాట! ఈ రూపాయిన్నర నువ్వే తీస్కో ... మీ షావుకారుతో నాకిచ్చానని చెప్పు...పాపం! ఆకలవుతుందన్నావుగా, రిక్షాలో ఇంటి కెళ్ళు. ఇదుగో ఈ పదిపైసలు సోడా తాగు. ఇటువంటి కష్టాలు నాకు తెలుసు. ఈ షావుకార్లు ఇంతే. జాలి ఉండదసలు. నాకు తెలుసుగా, దొంగ నాయాళ్లు ...' అని బక్కెటు లోని నీళ్లతో చేతులు కడుక్కొంటున్నాడు మెరుస్తున్న కళ్లతో ఆ కుర్రవాడు సుల్తాన్ వైపు ప్రశంసా పూర్వకంగా చూసి వెళ్లిపోయాడు.

ఈ సన్నివేశం చూస్తున్న నేను నిర్ఘాంత పోయాను. నా ఊహకు భిన్నంగా జరిగిన సంఘటన అది!

డాన్సులు

కాలేజీ—చదువుల్లోనే
చేస్తారు
కుర్రకారంతా
'ఆరంగేట్రం'
(రంగప్రవేశం)

పదహారేళ్ళ పడుచుపిల్లల
పరుగులెత్తే పరువంలో
కొత్త అందాలు
'భరతనాట్యం'

దూరాన వున్న ప్రేయసి
ప్రేమలేఖ ఆలస్యమైతే
ప్రియుడి మనసు
'కథాకళి'

చిలిపి వయసు
చేసే
వలపు విన్యాసాలే
'డిస్కో'

పెళ్లికెదిగి కూర్చున్న
ఆడపిల్ల తండ్రి
అంతరంగంలో
'శివతాండవం'

అందుకే
ప్రపంచమే
ఒక
'రంగస్థలం'

— తిరునగరి వెంకట నారాయణ మూర్తి

వీణ్ణి ఒట్టి మాటల పోగు అనుకున్నాను కాని, వాడి మనసులో అమృతపు సోన ఉంటుందని అనుకోలేదు! వీధి గుండెలోనూ మమతాంకురాలు మొలిచాయి!

ఇంకా కళ్ళు తెరవని కుర్రవాడైతే నేమి వాడిలో స్పందించే మమత, మానవత ఈ లోకంలో పెద్దలుగా చెలామణి అవుతున్న పెద్దమనుషుల్లో, అధికారుల్లో, మహానుభావుల్లో, స్నేహితుల్లో ఎందుకు మృగ్యమై పోయిందో నాకు అనూహ్యమైంది!

నా కన్నులు చెమర్చాయి.

'సుల్తాన్ బాగుచేసింది నా సూటుకేసును మాత్రమే కాదు; నా మస్తిష్కాన్ని' అనే పదునైన ఆలోచనలతో ఇంటిముఖం పట్టాను సంతృప్తిగా.

కలకడవేని మనసులు

ముసునూరి పేరయ్యశాస్త్రి



"మాస్టారూ!

"వస్తున్నాను. ఆఁ...మీరా, రండి...అలా కూర్చోండి."

"కూర్చుంటే పనులవ్వండి. మీరు వెంటనే బయల్దేరి జిల్లాపరిషత్ ఆఫీసు కెళ్లాలి."

"ఆ ప్రయత్నంమీదే వున్నాను."

"ప్రయత్నంమీదున్నానంటే యెలాగండి? ఈసరికి మీరు బస్టాండ్‌లో వుండాలి. ఆఁ... మన సమితి ప్రెశిడెంటుగారిచేత ఫోను చేయించాను. చైర్మన్‌గారు చూద్దామన్నారట. గూడెం ట్రాన్సఫర్ కోసమే ఇంకో మాస్టారు ప్రయత్నం చేస్తున్నారని చెప్పానుగా! ఆయన కూడా ఎం. ఎల్. ఏ. చేత చెప్పించాట్ట. వెళ్ళి నా భార్య రోగిష్టిదని, పిల్లలు గూడెం లోనే చదువుతున్నారని... నేను ఒంటరిగా దూరంగా ఉండి యిబ్బందులు పడుతున్నానని కాళ్లావేళ్లాపడండి. మంచివాడే! వినకపోడు."

"ఇంకో మాష్టారు ప్రయత్నిస్తున్నారన్నారుగా; ఆయన పేరేదో చెప్పారు మరచిపోయాను."

"నరసింహారావు. ఆయన కూడా ఈ రోజు జిల్లాపరిషత్ ఆఫీసు కెడుతున్నాట్ట. వెళ్లి ఆయన్నికూడా బ్రతిమాలండి. ఈ ఛాన్సు యిప్పించమని."

విశ్వనాథం మాస్టారు నిట్టూర్చారు.

"రెండు సంవత్సరాలనుంచి ప్రయత్నం; ఈసారైనా పనవుతే నావాళ్ల దగ్గర వుంటాను."

"మీరు బయల్దేరండి" తొందర చేశాడాయన. విశ్వనాథం మాస్టారికి యాభై సంవత్సరాలుంటాయి. మనిషి దృఢకాయుడు.

"ఇదిగో, యిప్పుడే బయల్దేరతాను. బస్సొచ్చే వేళకూడా అయిందిగా!" అనేసి నాలుగు మెతుకులు కతికి, హడావుడిగా యింట్లోంచి బయటపడ్డారు.

* * *

పది గంటలకల్లా జిల్లా కేంద్రం చేరుకొన్నారు విశ్వనాథం మాస్టారు. బస్ దిగి సరాసరి జిల్లాపరిషత్ ఆఫీసు కొచ్చారు. అప్పుడే నిద్ర లేస్తోంది ఆఫీసు. రకరకాల చెట్లమధ్య రాతి కట్టడాలతో గంభీరంగాఉన్న ఆఫీసు భవనాలు, మాస్టారికి స్వాగతం పలుకుతున్నట్లుగా భావించి లోపలికొచ్చారు. అక్కడ తిరుగుతున్న మనుష్యుల్లో నరసింహారావు మాస్టారికోసం చూస్తున్నారు. చాలాసేపు మనుష్యుల్ని పరీక్షగాచూసి, తర్వాత ఒకాయన్ని సమీపించారు.

"మీ పేరు" అన్నారు గుచ్చి గుచ్చి ముఖంలోకి చూస్తూ.

ఆ వ్యక్తి విశ్వనాథం మాస్టారివంకోసారి చూసి ఆనక తలదించి "నాపేరు బాబూ రావండి" అన్నాడు.

విశ్వనాథం మాస్టారు నిరాశగా, "అలాగా! ఎక్కడో చూసినట్లు అనిపిస్తేనూ..." అర్థోక్తిగా అనేసి ముందుక్కదిలారు. అర గంట గడిచింది. ఆ మాస్టారికోసం తీవ్రంగా గాలించడం మొదలు పెట్టారు. గడచిపోతున్న ప్రతీ క్షణం తిరిగిరానిదిగా... అవకాశాన్ని జారవిడిచేదిగా భావిస్తూ కంగారు పడిపోతున్నారు. ఎందరో వస్తున్నారు వెడుతున్నారు. ఎవరిని గుర్తించటం? నిరాశగా నడుస్తూ క్యాంటిను దగ్గరకు వచ్చారు. అంతలో క్యాంటీన్ లోపల్నుంచి హడావిడిగా వస్తున్న వ్యక్తిని చూసి, విశ్వనాథంమాస్టారు సంబరపడిపోయారు. ఆ మధ్య ఎలక్షన్ డ్యూటీలో తారసపడిన వ్యక్తాయన బహుశా ఆ నరసింహారావు మాస్టారు ఈయనేకావచ్చు.

నిలకడలేని మనసులు

సన్నగా రివటలా వున్నాడు. వయసు నలభై దాకా వుండొచ్చు. మనిషి గంభీరంగానే వున్నాడు. విశ్వనాథం మాస్టార్ని దాటి పదడుగులు ముందుకెళ్లిపోయాడు. విశ్వనాథం మాస్టారు వరుగులాంటి నడకతో అతన్ని చేరుకొన్నాడు.

"మాస్టారూ!" అని పిలిచారు.

అతను ఆగాడు. విశ్వనాథం మాస్టారు అతనిముందుకొచ్చి "మీపేరు నరసింహారావు గారే కదూ!"

"అవును" అన్నాడతను.

విశ్వనాథం మాస్టారి మనసు తేలిక పడింది.

"బ్రతికించారు. మీకోసమే ఎదురు చూస్తున్నాను" అన్నారు విశ్వనాథంమాస్టారు సంతోషంతో.

"నా గురించా!" ఆశ్చర్యపోయాడతను.

"అవునండి. మీతోనే..."

"ఇక్కడే వుంటారుగా! పనుంది... చూసుకొని వస్తాను. వుండండి."

గతుక్కుమన్నారు విశ్వనాథం మాస్టారు. మనిషిని చూస్తే దారిలోకి వచ్చేలా కనిపించడంలేదాయనకి.

"లేదు... ఇప్పుడే మాట్లాడాలి. దయచేసి..." ఆగిపోయారు అర్థోక్తిగా అని.

నరసింహారావు మాస్టారు చిరాగ్గా చూసారాయన వైపు. తప్పదన్నట్లుగా ముఖంపెట్టి "అనుకొన్న సమయానికెళ్ళపోతే పనులవ్వవని మీకు తెలుసుగా! అయినా తప్పేలాలేదు. ఏమిటో చెప్పండి" అన్నాడు.

విశ్వనాథం మాస్టారు మెల్లగా కబుర్లలో పడేశారు. ఆ కబుర్లతో అతనిని ఆఫీసు వెనకాలకి తీసికొచ్చారు. గుబురుగా చెట్లు, ఒకవేళ కాళ్ళు పట్టుకోవాల్సివచ్చినా గోప్య ప్రదేశం. జన సంచారం లేదు. పట్టపగలే చీకటి పడ్డట్టుగా వుంది. చల్లగా హాయిగా వుంది వాతావరణం.

"అయ్యా! నేను చాలాకష్టాల్లో వున్నాను. అన్యథా శరణం నాస్తి, త్వమేవ శరణం మమా" అన్నారు రెండు చేతులు జోడించి విశ్వనాథం మాస్టారు.

నరసింహారావు మాస్టారు ఆశ్చర్యపోతూ, "ఏమిటండీ" అన్నాడు.

"అయ్యా, నా భార్య రోగిష్టిది. పిల్లలు గూడెంలోనే చదువుతున్నారు కాలేజీలో. నేను ఒక కుగ్రామంలో పనిచేస్తున్నాను. చాలా రోజులకి గూడెం పోస్ట్ వుందని తెలిసి ప్రయత్నం చేస్తున్నాను. ఆ పోస్ట్‌కే మీరూ ప్రయత్నిస్తున్నారని తెలిసింది. ఇవి చేతులు కావు... దయుంచి మీరు నాదారి కడ్డు తప్పుకోండి" అన్నారు అతని రెండుచేతులూ పట్టుకొని.

నరసింహారావు మాస్టారి ముఖం అప్రసన్నంగా మారిపోయింది. ముఖంలో కోపం జేవురించింది.

"అదెలాకుదురుతుందండి? అక్కడ నాకు రెండు వ్యాపారాలున్నాయి. అవి చూసుకోవాలి" అన్నాడు.

"మీరు కనికరించాలి!" విశ్వనాథం మాస్టారి కంఠంలో కొన్తంత బాధ

"అనవసరంగా ఈ వ్యవహారంలో వేలు పెట్టకండి." చిక్కచ్చిగా అనేశాడతను.

విశ్వనాథం మాస్టారి ముఖంలో రంగు మారింది. పెదవులు అదురుతున్నాయి చిరు చెమటు పట్టేసినాయి. శరీరంలోనిరక్తమంతా చల్లబడిపోయినట్లు, నీరసం కమ్మేస్తోంది.

'మరోసారి మీరు ఆలోచించాలి' అభ్యర్థన ధోరణిలో దీనంగా అడిగాడు విశ్వనాథం మాస్టారు.

నరసింహారావు మాస్టారింక ఆలశ్యాన్ని భరించలేకపోతున్నాడు. వెళ్లడానికి వెనక్కి తిరిగి— "లాభంలేదండి" అన్నాడు అడుగు ముందుకు వేస్తూ. విశ్వనాథం మాస్టారతన్ని వెళ్ళనివ్వలేదు. చేయి పట్టుకొన్నారు. నరసింహారావు మాస్టారు ఆగి, విశ్వనాదం మాస్టారి వైపు చూసాడు. ఆయన చూపులు న. మాస్టార్ని కలవర పరచాయి. భారీవిగ్రహమేమో భయపడ్డాడు.

'నన్ను వదలండి' అన్నాడు విశ్వనాథం మాస్టారు.


'వదలను, మర్యాదగా నా దారి కడ్డం తప్పుకోండి.'

"నేను తప్పుకోను."

"తప్పుకోవాలి."

"తప్పుకోను...తప్పుకోను."

విశ్వనాథం మాస్టారిలో సహనం చచ్చిపోయింది. మానవత్వం నశించింది, అవసరం ఆయన్ని పశువుగా మార్చేసింది. ఫలితంగా నరసింహారావు మాస్టారి తల మీద గట్టిగా గుద్దారు. అరవబోయాడు. కానీ అరచేతిని అడ్డంపెట్టి అరవనీయలేదు. మరోగుద్దు... తల తిరిగింది... మరోగొద్దు... అంతే, మొదలు నరికిన చెట్టులా నేల వాలిపోయాడాయన. భయంగా చుట్టూ కలయచూసారు విశ్వనాథం మాస్టారు. గుబురుగా చెట్లు వుండటంవల్ల ఎవరో గమనిస్తారన్న ప్రశక్తి లేదు. మెల్లిగా అతన్ని గోప్యంగావుండేలా వుంచి ...బయట కొచ్చి ముఖం తుడుచుకున్నారు. లోపల కంగారుగా వున్నా, ధైర్యాన్ని తెచ్చు



కౌంటు ఆఫీసులోకి వచ్చారు. ఛైర్మన్‌గార్ని కలవటానికి పర్మిషన్ సంపాదించి, ఆయన గదిలోకి అడుగు పెట్టారు.

"నమస్కారం"

"ఆఁ ... ఏమిటి, చెప్పండి."

అన్నీ వివరంగా చెప్పారు విశ్వనాథం మాస్టారు. కొన్ని క్షణాల తర్వాత, "ఆహాఁ... మీరా... వెళ్లి మీ సెక్షన్ గుమాస్తాని కలవండి." అన్నారు. మరోసారి నమస్కరించి, తనకుసంబంధించిన సెక్షను కెళ్లారు. సుపరిచితమైన వ్యక్తి అవడంవల్ల ఈయన్ని చూడగానే కుర్చీ ఆఫర్ చేసాడా గుమస్తా. స్థిమితంగా లేచిన మాస్టారు బరువుగా నిట్టూర్చి కూర్చుని వచ్చిన సంగతి చెప్పి, "ఛైర్మన్‌గారు మిమ్మల్ని కలవమన్నారు" అన్నారు.

ఆ గుమాస్తా జాలిగా మాస్టారి వంక చూస్తూండి పోయాడు.

"వెరీ సారీ మాస్టారూ !" అన్నాడు.

మాస్టారు కంగారుపడి పోతున్నారు. చావు కబురు వినబోతున్న మనిషి ముఖంలా వాడిపోయింది.

తిరిగి గుమస్తా యిలా అన్నాడు—

"నిన్న రాత్రి వరకు మీకే ఆ వూరిద్దామని నిశ్చయించు కున్నాము. మీ సమితి ప్రెసిడెంటుగారు మన ఛైర్మన్‌గారికి ఆప్తుడు. అయితే, ఈ వుదయమే మినిష్టర్ గార్నుంచి ఫోన్ వచ్చింది. ఆయన వత్తిడి వల్ల 'రామారావు' అనే వ్యక్తిని గూడెం వేశారు. వెరీ సారీ మాస్టారూ !" అని.

విశ్వనాథం మాస్టారు లేచి నిలబడ్డారు. మెల్లిగా అడుగులు వేస్తూ బయట కొచ్చారు. ఆయన మనసంతా దిగులుగా వుంది. ఇప్పుడు ట్రాన్స్‌ఫర్ అవలేదన్న బాధకన్నా స్వార్థంతో, పశుతత్వంతో ఆ మాస్టార్ని హింసించానన్నదే ఆయన్ని కృంగదీస్తోంది. ఇద్దరిలో ఒకరికైనా పనవ్వక— మరోడుకాస్త తన్నుకు పోవడమే ఆయన్ని పిచ్చివాడిగా చేస్తోంది. మెల్లిగా అడుగులు వేస్తూ క్యాంటీన్ దగ్గర కొచ్చారు. చెంబుతో నీళ్ల పట్టుకొని, నరసింహారావు మాస్టార్ని కొట్టి పడేసిన చెట్ల గుబురులోకి వచ్చారు. నరసింహారావు మాస్టారు మెల్లిగా మూల్గుతున్నారు. విశ్వనాథం మాస్టారు ముఖం మీద నీళ్ల చల్లారు. అయిదు నిముషాలు గడిచాయి. విశ్వనాథం మాస్టారు క్రింద కూర్చుని, తన తొడమీద నరసింహారావు మాస్టారి తల పెట్టుకొని ముఖం తుడిచారు.

"అమ్మా..."మూల్గాడు నరసింహారావు మాస్టారు.

"మాస్టారూ !" పిలిచారు విశ్వనాథం మాస్టారు.

మరో అయిదు నిముషాలు గడిచాయి.

మెల్లిగా అతను కళ్ళు తెరచాడు అంతా మసగ్గా వున్నట్లు కనిపించింది.

"మాస్టారూ ..." ముఖంలో ముఖం పెట్టి పిలిచారు విశ్వనాథం మాస్టారు. రెండు నిముషాల తర్వాత కాస్త తేరుకొన్నాడతను కళ్లుతెరచి, విశ్వనాథం మాస్టార్నిచూసి కళ్ళు పెద్దవిచేసి చూస్తూండి పోయాడు.

విశ్వనాథం మాస్టారి అవస్థ వర్ణనాతీతం తల పగలుకొట్టుకొని మాస్టారి యెదుటే చచ్చిపోవాలన్నంత బాధగా వుంది. ఏడుపు వచ్చేస్తోంది.

"మాస్టారూ ... నన్ను క్షమించండి. స్వార్థంతో మానవత్వం విస్మరించి మిమ్మల్ని హింసించాను, నన్ను క్షమించండిమాస్టారూ" అని గొల్లు మన్నారు విశ్వనాథం మాస్టారు.

నరసింహారావు మాస్టారు గొంతు పెగల్చుకొని, "మీ పనయిందా" అన్నాడు నీరసంగా.

"లేదండి. మీకు, నాకు లేకుండా, మూడోవాడు కొట్టుకు పోయాడు" అన్నారు బాధగా !

నరసింహారావు మాస్టారు అంత నీరసంలోను చిరుమందహాసం చేశాడు— ఆ మందహాసంలో వేదాంత ధోరణి విశ్వనాథం మాస్టార్ని ఆలోచింపచేసింది. మానవత్వంలోంచి పశుతత్వంలోకి, పశుతత్వంలోంచి మానవత్వంలోకి ద్వైధీభావంతో నిలకడలేని ఈ మనుషుల మనసు యెంత టక్కరిదో ఆలోచిస్తూ మెల్లిగా లేవదీసి కూర్చో పెట్టారు నరసింహారావుమాస్టారిని.

హైదరాబాద్ నోట్‌బుక్

తిరుమల రామచంద్ర

ఎం. ఏ. విద్యార్థుల సంస్కృత శాకుంతలం:

సురభారతి సమితి ద్వాదశ వార్షికోత్సవం, వాల్మీకి దినోత్సవం జులై 18వ తేదీన ఆంధ్ర సారస్వత పరిషత్తు హాలులో జరిగినపుడు, సుప్రసిద్ధ విద్వాంసులు శ్రీ ముదిగొండ వెంకట రామశాస్త్రి, శ్రీ పరింగంటి శ్రీ రంగాచార్యులు గార్ల సన్మానం, ఉస్మానియా విశ్వవిద్యాలయం సంస్కృత ఎం.ఏ. విద్యార్థులు అభిజ్ఞాన శాకుంతలంలోని ఘట్టాల ప్రదర్శనం జరిగాయి. ఈ ఉత్సవానికి అధ్యక్షత వహించిన సమితి అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయ మూర్తి శ్రీ అల్లాడి కుప్పుస్వామి ప్రసంగిస్తూ మానవుని జీవితంలో కౌమార దశ క్లిష్టమైనట్లే, సంస్థల జీవితంలోను కౌమార దశ క్లిష్టమైం దన్నారు. మన పాలకులు సంస్కృతం అవసర మని, సంస్కృతాన్ని అందరూ నేర్వాలని ఉప న్యాసాలిస్తూ, సహాయం చేస్తామని శుష్క వాగ్దా నాలు చేయడమే కాని, వాగ్దానాలు పూరించరని, ఇలాటిపరిస్థితిలో సురభారతీ సమితి పన్నెండేళ్ళుగా అభిమానుల సహాయంతో యథాశక్తి కృషి చేస్తున్నదని ఆయన అన్నారు. సమితి కార్యదర్శి డాక్టర్ పుల్లెల రామచంద్రుడు వార్షిక నివేదిక చదివిన తరువాత శ్రీయుతులు వెంకటరామ శాస్త్రి, శ్రీ రంగాచార్యులను అధ్యక్షులు పూల దండలతోను, నూతన పదార్థాలతోను సత్కరించా రు. శ్రీ వెంకటరామశాస్త్రి ప్రశస్తిని ఉస్మా నియా విశ్వవిద్యాలయం సంస్కృత శాఖాధ్యక్షులు డాక్టర్ ప్రమోద్‌గణేశ్‌లాల్యే, శ్రీ శ్రీరంగాచార్యుల ప్రశస్తిని డాక్టర్ రవ్వ శ్రీహరి చదివారు. శ్రీ వెంకటరామశాస్త్రి "అనూరీం భారతీం జిత్వా వర్ధతాం సురభారతీ" అని సందేశమిచ్చారు. శ్రీ శ్రీరంగాచార్యులు వాల్మీకిని గురించి రామా యణావతరణ కారణ ప్రయోజనాలను గురించి అనర్గళంగా ప్రసంగిస్తూ, నేడు వివిధ వస్తు వులను తయారు చేసే పరిశ్రమలు రాజధాని పరి సరాలలో ఉన్నట్టు పూర్వం మనుష్యుణ్ణి మనుష్యు ణ్ణిగా తయారు చేసే కార్ఖానాల వంటి ఆశ్ర మాలు ఉండేవని, అలాటి కార్ఖానాలలో తయా రయినవే మన వేద శాస్త్ర పురాణాదులని, భగవద్గీత మానవత్వానికి లక్షణ శాస్త్రం కాగా, రామా యణం మానవత్వానికి లక్ష్య గ్రంథమని సోదాహర ణంగా నిరూపించారు. ఉత్సవానికి ముఖ్య అతి థిగా విచ్చేసిన మాజీ ఇన్‌కంటాక్స్ కమిషనరు శ్రీ టి. రామనరసింహం తమ ప్రసంగంలో భార తీయ తత్త్వ శాస్త్రానికి ఉపనిషత్తులు, బ్రహ్మ సూత్రాలు, భగవద్గీత ప్రస్థానత్రయమైతే, భారతీయ సంస్కృతికి, రామాయణ భారత భాగ వతాలు ప్రస్థానత్రయమన్నారు. రామాయణం గొప్పదనం రాముణ్ణి మానవమాత్రుడుగా, ఉత్తమ మానవుడుగా చూపడం, పాత్ర చిత్రణలో భాగ వతం రామాయణాన్ని అనుసరించింది. రామునిది అనుష్ఠాన ధర్మం. త్యాగానికి కూడా రామాయణ పాత్రలు ఆదర్శం. రామాయణం హిందువుల కంపానియన్. మెటఫిసికల్ డాక్యుమెంట్. వైష్ణవా చార్యులు రామాయణాన్ని శరణాగతి శాస్త్రంగా గ్రహించారు. రాముని గొప్పదనాన్ని స్త్రీలు గ్రహించారు. షేక్‌స్పియర్ పాత్రలలో స్త్రీలు గొప్పవారయినట్టు రామాయణ స్త్రీ పాత్రలు గొప్పవి. రామాయణంలోని పాత్రలన్నీ ఏదో సందర్భంలో ఆచార్యత్వం వహిస్తాయి. ఇక సాహిత్య దృష్టితో రామాయణం వైదర్భీ రీతి రచన. పాట కుని స్థాయినిబట్టి సులభ గ్రాహ్యం. వాల్మీకి ఉప మలను, మాలోపమలను ఏ కవీ అనుసరించలేదు అని శ్రీ రామనరసింహం వివిధ విషయాలు వివ రించారు. తర్వాత ఉస్మానియా విశ్వవిద్యాలయం సంస్కృత ఎం. ఏ. విద్యార్థులు కాళిదాసుని అభి జ్ఞాన శకుంతలంలోని ప్రథమ తృతీయ చతుర్థ పంచమాంకంలోని ఘట్టాలను ప్రదర్శించారు. పంచమాంకంలకినే భారత కథానుసారిగా ఆకాశవాణిని ప్రవేశపెట్టి భరతవాక్యం పలికారు. ఈ శాకుంతలం చూచినప్పుడు నాకు అర్ధ శతాబ్ది క్రితం ఎడ పల్లి సూర్యనారాయణ దుష్యంతుడుగా, అద్దంకి శ్రీరామమూర్తి కణ్వుడుగా, సంజీవరావు శకుంతలగా ప్రదర్శించిన వీరేశలింగం గారి శకుంతల నాటక ప్రదర్శనం జ్ఞాపకం. నాటకాలలో పద్యాలకు రాగాలు కూడదనే వాదం ముమ్మరంగా జరుగు తున్న కాలమది. సంస్కృత నాటకకారులు గాని, వ్యాఖ్యాతలు గాని శ్లోకాలకుగాని గీతాలకు గాని రాగ నిర్దేశం చేయలేదు గనుక ఎవరికి వారు తమకు తోచిన రాగాలు తీసేవారు. యడవల్లి మున్నగు వారుతెలుగు శాకుంతలం పద్యాలతోపాటు సంస్కృత శ్లోకాలుకూడా రాగయుక్తంగా చదివేవారు. పండి తులు, పామరులు విరగబడిచూచేవారు ఆ నాటకాన్ని. కణ్వ పాత్రధారి అద్దంకి శ్రీరామమూర్తి 'శమమేష్యతిమే శోకః' అనేదాన్ని ఆనంద భయిరవిలో ఆలపిస్తే ప్రేక్షకులంతా కన్నీళ్ళు కురిపించేవారు. ఆ ప్రదర్శనలు చూచినవారికి ఎం. ఏ. విద్యార్థుల శాకుంతలనాటకం అంతగా నచ్చకపోవడం సబబే. కాని నారంగతులతో విద్యార్థులను పోల్చగలమా ? అయినా విద్యార్థులు బాగానే నటించారు. మరి కొంత శిక్షణ ఇస్తే ఇంతకన్నాబాగా నటించగలరని అనిపించింది. తమ పాత్రలు అందరూ యథాశక్తి పోషించారు. పాత్రధారులు వీరు, దుష్యంతుడు— కె. నీలకంఠం, కణ్వుడు— కె. కళాధర్, శార్ ఙ్గరవుడు—ఎస్. శివరామకృష్ణమూర్తి, శారద్వతుడు — ఇ. వెంకటేశ్వరశర్మ, దేవారికుడు— పి. రామ



ఇటీవల హైదరాబాద్ రవీంద్రభారతిలో డైరీ డెవలప్‌మెంటు వార్షికోత్సవాల సందర్భంగా కూచిపూడి భరతనాట్య–జానపద-నృత్య రీతుల్లో శాస్త్రీయంగా నృత్య ప్రదర్శన లిచ్చిన కుమారి చల్లా జయలలిత.

శేఖర్, శకుంతల— ఇ. రాజ్యలక్ష్మి, అనసూయ — ఎం. అనిత, ప్రియంవద— టి. సంధ్యాదేవి, నేపథ్య గాయకులు — వై. నారాయణ, డి. వనమాల, దర్శకత్వం— ఎ. రాములు, ఉత్సవం శ్రీ కె. ఆర్. సుబ్రమణ్యం వేదపఠనంతో ప్రారంభమయింది. డాక్టర్ పుల్లెల రామచంద్రుడు స్వాగతం చెప్పారు. శివకుమార్, పతంజలి, ఆనంద్ అనే బాలురు స్తోత్ర గీతాది శ్లోక పఠనం చేశారు. సురభారతీ సమితి కార్యవర్గ సభ్యుడు, సుప్రసిద్ధ న్యాయవాది, ఎమర్జన్సీ కాలంలో కారాగార క్లేశం అనుభవించినవారు అయిన శ్రీ బుర్రా సుబ్బారాయుడు కాలధర్మానికి సంతాప సూచకంగా అధ్యక్ష భాషణం తర్వాత రెండు నిముషాలు మౌనం పాటించారు. డాక్టర్ రవ్వ శ్రీహరి ధన్యవాదాలతో ఉత్సవం సమాప్తమయింది.

శ్రీమతి గాంధీ మెరుపు పర్యటన :

ప్రధాని శ్రీమతి గాంధి తమ లోక్‌సభ నియోజక వర్గంలోని మూడు విధానసభ ప్రాంతాలు సంగారెడ్డి, ఎల్లారెడ్డి, మెదక్‌లలో జులై 20వ తేదీన మెరుపు పర్యటన కావించారు. దాదాపు ఎనిమిది గంటలపాటు 220 మైళ్ళ దూరం పర్యటించిన ప్రధాని కుప్పలు తెప్పలుగా వచ్చిన ఫిర్యాదులను,విజ్ఞాపనలను చాలా శ్రద్ధతో విన్నారు. పర్యటన తరువాత సంగారెడ్డిలో ఆమె జిల్లాపరిషత్ కార్యాలయంలోను, యెల్లారెడ్డిలో ఒక సినిమాహాలులోను అభివృద్ధి సమీక్షా సమావేశాలలో పాల్గొన్నారు. మెదక్‌లో సర్పంచ్‌ల సమావేశంలో ప్రసంగిస్తూ పార్లమెంటు సభ్యులు తమ తమ నియోజక వర్గాలలో వికాస గోష్టులు నిర్వహించాలని సూచించారు. వీటివల్ల అధికారులు ప్రజల సమస్యల పరిష్కారానికి, ప్రజలు అధికారుల కష్టాలు తెలుసుకొనడానికి అవకాశం కల్గుతుందని ఆమె అన్నారు. పర్యటనానంతరం ఆమె ఆ రాత్రే 9 గంటలకు ఢిల్లీకి తిరిగి వెళ్లారు.

కుమారి సీతాదేవి పిటిషన్ ;

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిషేధించిన మరీచిక నవలారచయిత్రి కుమారివాసిరెడ్డి సీతాదేవిని ప్రభుత్వం మహిళా సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టరుగా ట్రాన్స్‌ఫర్ చేసింది. ఈమె ప్రస్తుతంయూత్ సర్వీసెస్‌శాఖలోడిప్యూటీడైరెక్టరుగావుంటున్నారు. ఈశాఖలో ఈమె సర్వీసు ఏడేళ్ళు. తనను యూత్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ పదవినుంచి మహిళా సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టరు పదవికిరివర్టు చేయడం చెల్లదని ఆమె ట్రిబ్యూనల్‌కు పిటిషన్ దాఖలుచేశారు.మరీచిక నవలపై నిషేధంన్యాయమా కాదా? అనే విచారణ దానిపై చర్యలకు ముందే కుమారి సీతాదేవిని రివర్టు చేయడం పెక్కు అనుమానాలకు అవకాశమిస్తున్నది.

ఉ ప శ్రు తి :

తెలుగువారంత అప్రయోజకులు మరొకరు లేరండీ?— అన్నారు ఒకరు నాతో. ఏమిటి? ఎందుకు?— అనడిగాను. సుఖ వ్యాధులలో కూడా మనది రెండవ స్థానమేనా ? మన ఖర్మ !— అన్నాడు ఆయన, మొదటి స్థానం రానందుకు ఆవేదనపడుతూ.

అవీ... ఇవీ... అన్నీ...

"సువర్ణ భాషితాలు" గ్రంథావిష్కరణ

శ్రీ తాడి వెంకట కృష్ణారావుగారు రచించిన "సువర్ణ భాషితాలు" గ్రంథాన్ని ఇటీవల పద్మశ్రీ డా. బోయిన భీమన్న ఆవిష్కరించారు.

ఈ సమావేశానికి ఆస్థాన కవి డా. దాశరథి అధ్యక్షత వహించారు.

ఈ గ్రంథావిష్కరణోత్సవం హైదరాబాదులోని శ్రీ కృష్ణదేవరాయ ఆంధ్ర భాషానిలయం విజయభారతి సాంస్కృతిక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. భాషా నిలయం గౌరవ కార్యదర్శి శ్రీ ఎం.ఎల్. నరసింహారావుగారు స్వాగతం పలికారు. శ్రీమతి గాలి ప్రభావతిగారి ప్రార్థనతో సభ కార్యక్రమం ప్రారంభమైంది. గ్రంథంలోని సూక్తుల ప్రాశస్త్యాన్ని గురించి డా. వి. రామమూర్తి రేణు, డా. పి. రమాపతిరావు, డా. వాసా ప్రభావతి ప్రసంగించారు.

వేద పఠనం జరుగుతుండగా రచయిత తమ గ్రంథాన్ని శ్రీమతి పి. దుర్గలక్ష్మి నిత్యానందరావుకి అంకితం చేశారు. శ్రీ మన్నెపురి శ్రీరాం గారు రచయితను పట్టు శాలువతో సన్మానించారు.

విజయభారతి సాంస్కృతిక సంఘం కార్యదర్శి శ్రీ టి. రంగవర ప్రసాద్ కవి వందన సమర్పణ చేశారు. (ఒ. వి.)

శ్రీ బొల్లిముంతకి సన్మానం

ప్రముఖ సినీ రచయిత శ్రీ బొల్లిముంత శివరామకృష్ణకి ఇటీవల తెనాలిలోని వన్నపనేని కళామందిర్‌లో సన్మానం జరిగింది. సినీ దర్శకుడు శ్రీ వి. మధుసూదనరావు అధ్యక్షత వహించగా శాసనమండలి సభ్యుడు శ్రీ కె. రోశయ్య సభని ప్రారంభించారు. సినీ దర్శకుడు శ్రీ బి. ఎస్. నారాయణ అభినందన సంచికని ఆవిష్కరించారు.

శ్రీయుతులు తుమ్మల వెంకట్రామయ్య, చందు సుబ్బారావు, అన్నాబత్తుని సత్యనారాయణ, మైత్రేయ, ప్రతాపరెడ్డి, లోకం వెంకటేశ్వరరావు, జోసెఫ్, శ్రీమతులు వన్నపనేని రాజకుమారి, విజయ లక్ష్మీరాజా మొదలగువారు ప్రసంగించారు.

ఆహ్వాన సంఘం తరపున శ్రీ రోశయ్య సన్మానం చేశారు. అనేక సంస్థలు, వ్యక్తులు, సంఘాలు శ్రీ బొల్లిముంతను సన్మానం చేశారు. ప్రారంభంలో శ్రీ ఆలపాటి ధర్మారావు సభకు స్వాగతం చెప్పారు.

(ఒ. వి.)



ఇటీవలనెల్లూరులోజరిగినఅఖిలభారతస్థాయి వేష సంగీత నృత్యపోటీలసందర్భంగా ఆర్.టి.ఓ. శ్రీ కృష్ణమూర్తిచే సన్మానింపబడుతున్న నృత్య దర్శకుడు శ్రీ సలీంని, కూచిపూడి నృత్యంలో ప్రథమ బహుమతి పొందిన కుమారి నాగమణి (విజయవాడ)కి బహుమతి ప్రదానం చేస్తున్న సినీనటి ముచ్చెర్ల అరుణని, వేష అధ్యక్షుడు శ్రీ సుందరరామిరెడ్డిని చిత్రంలో చూడవచ్చు.

ఉత్తరాలు

(4 వ పేజీ తరువాయి)

పిల్లల కథా?

"విజేత" కథ చదివిన తర్వాత ఈ ఉత్తరము వ్రాయాలన్పించింది. ఇలాంటి కథలు చిన్న పిల్లల కూన పత్రికలలో ఎక్కువగా వస్తుంటాయి.

భవానీ కృష్ణ (చిత్తూరు)

అమ్మ

కని, పెంచి పెద్ద చేసిన 'అమ్మ'ని భార్య రాగానే ఆమె మాటలు విని ఎడంగా ఉండడం మనం ఈ రోజుల్లో చాలా చూస్తున్నాము.

కడియాల చంద్రుడు (మహబూబ్‌నగర్)

ఏమని వర్ణించనూ?

నటి శ్రీ ముఖ చిత్రం వెలువడిన పత్రికను ఏమని వర్ణించనూ?

యన్. నాగిరెడ్డి సత్య (నాగర్ కర్నూల్)

హైదరాబాద్ నోట్‌బుక్

16—7—82 తేదీ పత్రిక హైదరాబాద్ నోట్‌బుక్‌లో శ్రీ తిరుమల రామచంద్రగారు పాలస్తీనా మోచక సంస్థపై విరుచుకుపడ్డారు. పాలస్తీనా మోచక సంస్థ వోటమిని ఆసరాగా తీసుకొని శ్రీ యాసర్ అరాఫత్‌ను అవహేళన చేశారు. హైదరాబాద్ నోట్‌బుక్‌లో వ్రాయటానికి యింతకంటే విశేషాలు వారికి దొరకలేదు గామోసు. ఉపశ్రుతి అన్నారు. అపశ్రుతి అంటే సమంజసంగా ఉండేదేమో! పాలస్తీనా వాళ్ళు ఉన్న పరిస్థితిలో మనము ఉంటే ఎలాగుంటుందో?

ఇలాంటి వ్యాఖ్యానాలు రావటము సహజమే. కాని ఆంధ్ర సచిత్ర వార పత్రికలో వస్తే ఎబ్బెట్టుగా ఉంటుంది.

మూసా (పొదిలి)

సందేశాత్మకం

"నేటికథ — రేపటి ముగింపు" కథ సందేశాత్మకంగా ఉన్నది. ముఖ్యంగా ప్రియతమరావు చేసిన నేరాలకు ప్రకాష్ వేసిన శిక్షలు సమంజసముగా ఉన్నవి. ఉన్నతమైన ఆశయసిద్ధికి కంకణం కట్టుకొన్న మహనీయుడుగా ప్రకాష్ మా గుండెల్లో గూడు కట్టుకొన్నాడు.

అల్లంరాజు కామేశ్వర శాస్త్రి (చింతలూరు)

సినిమా ఫక్కీ

ప్రేమదేవత సీరియల్ ప్రారంభంలో చాలా బాగుంది. తరువాత కథ అచ్చం సినిమా ఫక్కీలో నడుస్తున్నది. సినిమారంగం నుంచి విశ్రమిస్తున్న మా అభిమాననటుడు డా. నటరత్న పద్మశ్రీ నందమూరి తారక రామారావుగారి ముఖ చిత్రంతో మన సంచిక వెలువడాలని నా కోరిక. నా కోరిక నెరవేర్చరూ?

యన్. నాగిరెడ్డి సత్య. (నాగర్ కర్నూలు)

గిల్టీ

ఈ వారం కథలలో "గిల్టీ" కథ చిన్నదే అయినా చాల సస్పెన్స్‌తో నడిచింది. శారద లాంటి అమ్మాయి లుండటం ఈ కాలంలో ఎంత అరుదో, పంకజరావులాంటి "గిల్టీ మైండెడ్" వారుండడం అంత సహజమే. ఏమైనా పెండ్లి ముందర తనలోని లోపాన్ని ధైర్యంగా చెప్పిన శారద నిజాయితీ, తనలోని లోపాన్ని కప్పిపుచ్చి పెండ్లికి సిద్ధమైన పంకజరావు గిల్టీ ఫీలింగ్ మెచ్చదగిందే.

కొండవలస శ్రీనివాసరావు (టెక్కలి) ●

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, Mallikarjuna Rao Street Gandhinagar, Vijayawada-3. Editor : S. Radhakrishna.





సంపూర్ణ పోషకాహారంలో వుండవలసినవన్నీ కలిసివున్న రుచికరమైన పదార్థం

సిరిలాక్®

ఇన్‌స్టెంట్ వీట్ మిల్క్ సీరియల్

దీనిని తయారు చేయడం చాలా సులభం.
—దీనితో ముందుగా మరగబెట్టిన గోరువెచ్చని నీరు చేర్చండి.



ముందుగా మరగబెట్టిన నీటితో సెరిలాక్ చేర్చండి



బాగా కలపండి



వెంటనే యిచ్చేందుకు తయారు

ఇవ్వగలిగినంత కాలం మీ పాపకి చనుపాలు యివ్వండి—మీరు యివ్వగలిగిన మంచి ఆహారం అదే. 4 నెలల ప్రాయం వచ్చేసరికి పాపకి ఎక్కువగా పోషక పదార్థాలు కావాలి. ఘన పదార్థాలు తీసుకోడానికీ పాప సిద్ధంగా వుంటుంది. సిరిలాక్ యివ్వడం వలన, పాలు యివ్వడం మానకుండా పాప ఆహారంలో ఘన పదార్థాలు ప్రవేశ పెట్టడం గురించి మీ డాక్టర్‌ని సంప్రదించండి.

మీ పాపకి సరిఅయిన పాళ్లలో పోషక పదార్థాలు అందించడానికి సిరిలాక్‌లో గోధుమ పిండి, పూర్తి మీగడ పాలు మరియు చక్కెర ఉన్నాయి. పిండి పదార్థాలు మరియు క్రొవ్వు పదార్థాలు శక్తి నివ్వడానికి, మాంసకృత్తులు పెరుగుదలకి, విటమిన్లు మరియు ఖనిజాల లోపాల నుండి రక్షణ కలిగించడానికి దీనిలో ఉన్నాయి. సిరిలాక్—మీ పాప బాగుగా, ఆరోగ్యంగా పెరగడానికి.

సిరిలాక్—పాలు వుండనే వున్నాయి

SAA/FSL/C/2258 TEL NESTLÉ.

ఇప్పుడు! ప్రపంచ ప్రసిద్ధమైన పసిమిచాయ రహస్యం ఇండియాలో!

క్లియర్-టోన్



ప్రత్యేక దినుసు చర్మానికి తేటను, పసిమిచాయను తెస్తుంది-ప్రకృతి సిద్ధంగా.

శాస్త్రీయమైన సూత్రం మచ్చల్నీ, కళంకాల్నీ తొలగిస్తుంది.

మేలైన సూర్యకవచం చర్మం నల్లబడటాన్ని అరికట్టుతుంది.

సమృద్ధిగా చెమ్మనిచ్చే పదార్థం చర్మాన్ని మృదువుగా చేస్తుంది.

పరిపూర్ణమైన పసిమిచాయ క్రీం

ప్రపంచమంతటా వివిధ దేశాలలో లక్షలాది సుందరులు క్రమంతప్పకుండా వాడుతున్నారు, **క్లియర్-టోన్**.

అంతర్జాతీయ ఔషధ శాస్త్రపరిశోధనా ఫలితమైన ఈ శాస్త్రబద్ధమైన పసిమిచాయ సూత్రీకరణను నికొలాస్ లాబరేటరీస్ ఇండియా లిమిటెడ్ వారు మీకందిస్తున్నారు.

అంతర్జాతీయ స్వీకరణ పొందిన సూత్రం **క్లియర్-టోన్** మీ చర్మానికి తేటను పసిమిచాయను తెచ్చేందుకు, ఇండియాలో లభించే మరే యితర క్రీంలోనూ లేని ఒక ప్రత్యేక దినుసు కలిగి ఉంది.

క్లియర్-టోన్ క్రీం మీ చర్మానికి మరింత పసిమిచాయను తెచ్చేందుకు, మచ్చల్నీ కళంకాల్నీ తొలగించేందుకు ప్రకృతి సిద్ధంగా పనిచేస్తుంది. అందులోని శాస్త్రీయ సూత్రీకరణ హాని కలిగించే అల్ట్రావయొలెట్ కిరణాల నుండి మీకు రక్షణ కలిగించి, మీ చర్మం నల్లబడటాన్ని అరికట్టుతుంది. అంతేకాదు, **క్లియర్-టోన్** మీ చర్మానికవసరమైన చెమ్మను అతి సున్నితమైన పద్ధతిలో ఇస్తుంది. ఆతేడామీకై మీరే చూడండి. **క్లియర్-టోన్** క్రమం తప్పకుండా వాడండి, మరి 8 వారాల్లో దాని ఫలితాల్ని చూసి వళ్లు పులకరించి పొండి.



మేలైన సూత్రం
మేలైన చర్య

పసిమిచాయ రహస్యం-ప్రకృతి సిద్ధంగా క్లియర్-టోన్

లండన్. పారిస్. న్యూయార్క్.